అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 25-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 58 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

కీలక రంగాలకు
కత్తిరింపులు..

వ్యవసాయం, సివిల్ సప్లయిస్, విద్యుత్, సాంకేతిక విద్యలకు కుదింపులు

పేద జనానికి అత్యంత అవసరమైన రంగాలకు ప్రభుత్వపరంగా ప్రాధాన్యత తగ్గుతూ వస్తున్నది. ముఖ్యంగా వ్యవసాయం, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖలతోపాటు కీలకమైన సాంకేతిక విద్యకు సైతం కేటాయింపులు తగ్గిపోతున్నాయి. టీఆర్ఎస్ సర్కారు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లను పరిశీలిస్తే ఇదే విషయం విదితమవుతున్నది. రాష్ట్ర విభజనానంతరం 2014 నవంబరులో కేసీఆర్ సర్కారు మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదించింది. అది పూర్తి స్థాయి బడ్జెట్ కాదంటూ ప్రభుత్వాధినేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ బడ్జెట్‌ను మినహాయిస్తే కీలక రంగాలన్నింటినీ నిధులు తగ్గిపోతున్నాయనేది నిర్వివాదాంశం.

వివరాలు 9లో



తప్పంతా బ్యాంకులదే..!

కేంద్ర సర్కారు వైఫల్యమేమీ లేదు..

- బ్యాంక్ మోసాలపై ప్రభుత్వం మాటిది
- మోడీ 'కాపలా'పై సర్వత్రా విస్మయం
- దేశమేగతి పట్టెనోనని సామాన్యుల ఆవేదన!



న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల్లో మోసాలు అంతకంతకు పెరుగుతూ.. సర్కారుకు చెడ్డపేరు తెస్తున్న వేళ సర్కారు నష్ట నివారణ చర్యలకు దిగింది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో పాటు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బ్యాంకు మోసాలపై నోరు విప్పుతూ తప్పంతా బ్యాంకులదేనని తేల్చేశారు. నియంత్రణా యంత్రాంగం వైఫల్యమే అని పేర్కొన్నారు. బ్యాంకులకు నియంత్రించే ప్రభుత్వానికి, పెద్ద బ్యాంక్ ఆర్బీఐకి ఈ మోసాలతో ఎలాంటి సంబంధంలేదన్న రీతిలో వారి స్పందనలు వెలువడడం దేశంలోని సామాన్యుడిని మరింత కలవరానికి గురి చేస్తున్నాయి. దేశానికి కాపలాదారుగా ఉంటానన్న ప్రధాని మోడీ వేలాది కోట్ల ప్రజాధనం బ్యాంకు మోసాల పేరతో సరిహద్దులు దాటిపోతుంటే.. తప్పు మాదికాదన్నట్టుగా స్పందిచడం దేనికి గుర్తని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంటి కాపలాదారు సరిగా లేకుంటే ఇళ్లు గుల్ల అయినట్టే.. ఇప్పుడు దేశాన్ని ఏలుతున్న వారు సరిగ్గా పని చేయకపోతే రానున్న రోజుల్లో దేశానికి ఏగతి పడుతుందోనని సామాన్యులు ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు సర్కారు స్పందనపై ప్రతిపక్షాలు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. సర్కారు వైఫల్యతకు బ్యాంకు మోసాలు ఒక నిదర్శనమని.. సర్కారు బడాబాబులకు వంత పాడుతోందని.. బడా మోసాల వెనుక ప్రభుత్వ జోక్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని వారు 9లో



28 నుంచి ఇంటర్ పరీక్షలు

- నిర్వహణకు సర్వంసిద్ధం
- 9,63,546 మంది విద్యార్థులు
- 1294 పరీక్షా కేంద్రాలు
- ఉదయం 8.45 గంటల వరకు చేరుకోవాలి
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌కు అవకాశం : ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్

వివరాలు 9లో

వ్యవస్థను శాసిస్తున్న
బడా కంపెనీలు

పారిశ్రామికవేత్తలకే ప్రభుత్వాల ప్రోత్సాహం

- ఆర్థిక అసమానతల నుంచే వైరుధ్యాలు : జేవీవీ సదస్సులో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బి సుదర్శన్‌రెడ్డి

వివరాలు 9లో



మనం ఇద్దరం..మనకు 18 మంది

హిందూ జనాభాను పెంచాలని
బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



లక్నో: 'మనం ఇద్దరం – మనకు 18 మంది' అంటూ కొత్త నినాదంతో మరో వివాదాన్ని తెరపైకి తెచ్చారు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సైనీ. హిందు దంపతులు 18 మంది పిల్లలను కనాలని సూచించారు. జనాభా నియంత్రణ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సూచనలు చేయడం గమనార్హం. హిందువులు పిల్లలను కంటూనే ఉండాలని అన్నారు. దేశంలో జనాభాను నియంత్రించే చట్టం వచ్చేందవరకూ హిందువులు పిల్లలను కనడం ఆపొద్దని చెప్పారు. 2013 ముజఫర్‌నగర్ అల్లర్లలో నిందితుడైన విక్రం సైనీ అదే జిల్లాలో కటౌలీ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. హిందువులు ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకునే విధానాన్ని అవలంభిస్తున్నారనీ, కానీ ఇతరులు డజన్ల కొద్ది పిల్లలను కంటున్నారని అన్నారు. న్యాయం అందరికి సమానంగా ఉండాలన్నారు. హిందువులంతా ఇద్దరిని కని ఆగిపోవద్దని సూచించారు. 'మాకు ఇద్దరు పిల్లలు పుట్టాక.. ఇక చాలని నా భార్య ప్రతిపాదించింది. నేను వారించి నలుగురి నుంచి ఐదుగురిని కనాలని 9లో

టీఆర్టీ పరీక్షలు షురూ



తొలిరోజు ఆన్‌లైన్ ఎగ్జామ్ ప్రశాంతం

- ఉదయం 92.8 %, మధ్యాహ్నం 85.43 % హాజరు
- ఆలస్యంతో పలు కేంద్రాల వద్ద అభ్యర్థుల ఆవేదన
- సతులు పరీక్షల్లో - పతులు పిల్లలతో

వివరాలు 9లో

గుజరాత్ ఎన్నికల ఫలితాలపై
ఈసీకి హైకోర్టు నోటీసులు



అహ్మదాబాద్: ఇటీవల గుజరాత్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎలక్షన్ కమిషన్(ఈసీ)కు, ఆ రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫలితాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేతలు.. కోర్టులో నాలుగు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటర్ వెరిఫియేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపీఏటీ) స్లిప్పుల ఆధారంగా కౌంటింగ్ నిర్వహించాలని 20 మందికి పైగా కాంగ్రెస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. అంతేకాక, సంత్రాంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ నేత కుబర్‌భాయ్ దినోర్ 9లో



ఫోన్‌కు సై..బంధానికి నై!

65% యంగ్ ఇండియన్స్
అత్యుత్తమ నేస్తం వారి మొబైలే!

- ఆత్మీయ బంధాల కన్నా.. ఫోన్ స్నేహాలకే మొగ్గు
- గంట సేపు ఫోన్ కనిపించకపోయినా.. డిప్రెషన్లోకి వెళ్తోన్న 77% భారత యువత
- పిల్లల్ని వదిలి ఫోన్లతో 73 %పేరెంట్స్
- హార్వర్డ్ యూనివర్సిటీ, బోస్టన్ మెడికల్ సెంటర్ సర్వేల్లో తేలిన పలు అంశాలు

వివరాలు 9లో



బీహార్‌లో విషాదం

- విద్యార్థుల పైకి దూసుకెళ్లిన కారు
- 9 మంది మృతి, ఆరుగురి పరిస్థితి విషమం

పాట్నా: బీహార్‌లో దారుణం చోటు చేసుకుంది. విద్యార్థుల పైకి వేగంగా దూసుకెళ్లిన కారు.. 9 మందిని బలిగొంది. ఈ విషాద ఘటన బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముజఫర్‌పూర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాల 77 నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉంది. తరగతులు పూర్తయ్యాక ఇండ్లకు వెళ్లడానికి విద్యార్థులు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు వారి పైకి దూసుకెళ్లింది. దాంతో 9 మంది విద్యార్థులు అక్కడిక్కడే మృతి చెందారు. వెంటనే కారు డ్రైవర్ అక్కడ నుంచి పారిపోయాడు. రోడ్డు పై విద్యార్థుల మృతదేహాలు, శరీర భాగాలు చెల్లాచెదురయ్యాయి. మృతుల కుటుంబాల ఆర్తనాదాలతో, రక్తమోడిన ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. కాగా మృతుల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల చొప్పున బీహార్ సీఎం నితీశ్‌కుమార్ యాదవ్ పరిహారం ప్రకటించారు. 'తొమ్మిది మంది విద్యార్థులు మృతి చెందారు. ఘటనలో 24 మంది గాయపడగా అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు పాట్నాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు' అని ముజఫర్‌పూర్ డీఎస్పీ గౌరవ్‌పాండే తెలిపారు. 'జాతీయ రహదారి పై అంతకముందే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వృద్ధురాలిని తప్పించబోయి విద్యార్థుల పైకి కారు వేగంగా దూసుకెళ్లింది' అని ప్రత్యక్ష సాక్షి చెప్పారు. పాట్నాలోని ఆస్పత్రి ప్రాంతమంతా క్షతగాత్రుల కుటుంబసభ్యుల ఆర్తనాదాలతో భయానకంగా మారింది. పరిస్థితిని, రక్షణ చర్యలను పర్యవేక్షించడానికి ముజఫర్‌పూర్ రేంజ్ డీఐజీ అనిల్‌కుమార్ సింగ్ ఘటనా స్థలికి చేరుకున్నారు. కాగా బీహార్‌లో ఈ నెల చోటుచేసుకున్న ఘటనల్లో ఇది రెండో పెద్ద ప్రమాదం. ఈ నెల 19న పాట్నా శివారులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో పది మంది మృతి చెందగా, 35 మంది గాయపడ్డారు.

ఈ ఏడాది ఏడుగురు సుప్రీంకోర్టు జడ్జిల రిటైర్మెంట్

న్యూఢిల్లీ : మార్చి 1 నుంచి మొదలుకొని ఈ ఏడాది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏడుగురు పదవీ విరమణ పొందనున్నారు. ఇప్పటికే ఆరుగురు న్యాయమూర్తుల కొరతను ఎదుర్కొంటున్న అత్యున్నత న్యాయస్థానం వీరి రిటైర్మెంట్‌తో సమస్య మరింత జటిలం కానున్నది. ఇద్దరు న్యాయమూర్తుల నియామకం సత్వరమే చేపట్టాలన్న సూచన ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉంది. మార్చి 1 జస్టిస్ అమితవ రాయ్ పదవీ విరమణ చేయనున్నారు. అలాగే మే 4న జస్టిస్ రాజేశ్ అగర్వాల్ రిటైర్ కానున్నారు. అత్యున్నత న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్ తర్వాత సీనియర్ న్యాయమూర్తి అయిన జె చలమేశ్వర్ జూన్ 22న, జులై 6న జస్టిస్ ఆదర్శ్ గోయల్ పదవీ విరమణకానున్నారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అక్టోబర్ 2, ఆ తర్వాత జస్టిస్ కురియన్ జోసఫ్ నవంబరు 29న, జస్టిస్ మదన్ బి లోకుర్ డిసెంబరు 30న పదవుల నుంచి వైదొలగనున్నారు. ఇప్పటికే ఆరుగురు న్యాయమూర్తుల కొరతను ఎదుర్కొంటుండగా.. వీరి రిటైర్మెంట్‌తో జడ్జిల ఎంపికకు సంబంధించి కొలీజియంపై ఒత్తిడి పెరిగింది.

తృణమూల్ దాడులను

తిప్పికొట్టిన సీపీఐ(ఎం) కార్యకర్తలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ గ్రామస్తుల నివాసాలకు కొద్ది రోజుల క్రితం దుర్గాపూర్ ప్రాజెక్ట్స్ లిమిటెట్ (డీపీఎల్) సంస్థ పెద్ద మొత్తంలో సెక్యూర్టీ డిపాజిట్‌ను, విద్యుత్ టారిఫ్‌ను విధించడంతో మినహాయింపు కోరుతూ సీపీఐ(ఎం) నాయకత్వం అధికారులతో చర్చించింది. అయితే డీపీఎల్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి నిరాకరించింది. దీని ఫలితంగా డీపీఎల్ కార్యాలయం ఎదుట శనివారం ర్యాలీ నిర్వహించాలని సీపీఐ(ఎం) నిర్ణయించింది. దుర్గాపూర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఇంతలో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన గూండాలు అక్కడకు చేరుకుని ఎమ్మెల్యే సంతోష్ దేవ్‌రాయ్‌పై ప్రత్యక్ష దాడికి దిగారు. దేవ్‌రాయ్ కిందపడిపోగా, ర్యాలీలో పాల్గొన్న వారిపై ఆయుధాలతో, ఐరన్ రాడ్లతో, కర్రలతో దాడి చేశారు. అయితే ఆ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలంతా ఆ దాడిని ప్రతిఘటించారు. దీంతో దుండగులు అక్కడ నుంచి పారిపోయారు. ఈ దాడిలో ఆరుగురు సీపీఐ(ఎం) కార్యకర్తలు గాయపడ్డారు. ఎమ్మెల్యే దేవ్‌రాయ్‌తో పాటు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు నిరసనగా దుర్గాపూర్‌లోని పలు ప్రాంతాలలో సీపీఐ(ఎం) ర్యాలీలు నిర్వహించింది.

మేఘాలయలో కరుడుకట్టిన ఉగ్రవాది హతం

షిల్లాంగ్ : మేఘాలయలోని ఉత్తర గారో జిల్లాలో కరుడుకట్టిన ఉగ్రవాది, స్వయం ప్రకటిత గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీ(జీఎన్ఎల్ఏ)అధ్యక్షుడైన సోహన్ డాల్‌బోట్ షైరా భద్రతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైనట్టు తెలిపారు. పలు ఉగ్రవాద ఘటనల్లో నందితుడై సోహన్‌పై రూ. పదిలక్షల రివార్డు ఉన్నట్టు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు అచక్‌పెక్ గ్రామంలో జీఎన్ఎల్ఏ ఉగ్రవాదులు సమావేశమౌతుండగా, ఎస్ఎఫ్ 10 కమాండోలు కాల్పులు జరిపారని, ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో అతను మృతిచెందినట్టు మేఘాలయ పోలీస్ చీఫ్ స్వరాజ్ బిర్ సింగ్ తెలిపారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్రవాదులను నిర్మూలించడంలో కృషిచేసిన భద్రతాదళాలను అభినందిస్తున్నట్టు మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ట్విటర్‌లో తెలిపారు. మరో మూడురోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఈ ఘటన సంచలనం కలిగించిందన్నారు. ఫిబ్రవరి 18న ప్రచారం ముగించుకుని తిరిగి వెళ్తున్న సంగ్మా కాన్వాయ్ లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన మందుపాతర పేలుడులో ముగ్గురి మృతి చెందిన సంగతి తెలిసిందే.

మానసిక వికలాంగునిపై దాడి ఘటన

నివేదిక కోరిన కేంద్రం

రూ. 10 లక్షలు పరిహారం ప్రకటించిన కేరళ సీఎం

తిరువనంతపురం : మానసిక వికలాంగుడైన గిరిజన యువకుడిపై దాడి ఘటనకు సంబంధించి కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక పంపాల్సిందిగా శనివారం కేంద్రం ఆదేశించింది. ఈఘటనపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని నివేదిక అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాలని కోరినట్టు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జుయల్ ఓరమ్ తెలిపారు. మానసిక వికలాంగుడైన గిరిజన యువకుడు మధుపై శనివారం కొందరు యువకులు ఆహారాన్ని దొంగిలిస్తున్నాడన్న కారణంతో దాడి చేశారు. గాయాల కారణంగానే అతను మృతి చెందినట్టు పోస్ట్‌మార్టమ్ నివేదికలో రుజువైంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను ఇవ్వాల్సిందిగా కేంద్రం కోరింది. మరోవైపు బాధితుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. పదిలక్షల రూపాయల పరిహారం ప్రకటించింది.

పెండ్లి కానుక పేలి వరుడు మృతి

- వధువు పరిస్థితి విషమం

భువనేశ్వర్: పెండ్లి తాలూకు సంబరం ఆ ఇంట్లో ఐదు రోజుల్లోనే విషాదంగా మారింది. తన పెండ్లి వేడుకలో పుచ్చుకున్న బహుమతిని తెరవడంతో అది పేలి వరుడు, అతని నానమ్మ మృతి చెందిన ఘటన ఒడిషా రాష్ట్రంలోని బొలాంగిర్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వధువూ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు..ఈ నెల 21న జరిగిన వివాహ వేడుకలో గుర్తు తెలియని వ్యక్తి బహుమతి రూపంలో ఓ బాంబును బహుకరించాడు. ఈ బహుమతిని తెరవగానే అది పేలింది. దీంతో వరుడు సహా అతని నానమ్మ, వధువు తీవ్రంగా గాయపడ్డారు. రూర్కెలాలోని ఇస్పాత్ జనరల్ ఆస్పత్రిలో వరుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. వృద్ధురాలు జిల్లా ఆస్పత్రికి వచ్చేలోపే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. బుర్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తీవ్రంగా గాయపడిన వధువు చికిత్స పొందుతున్నదని పోలీసులు తెలిపారు. అయితే ఆ బహుమానాన్ని గుర్తు తెలియని వారు ఇచ్చారని, సంబంధిత ఆధారలను సేకరించామని పాట్నాగర్ పోలీసు అధికారి సేస దేవా బరిహా వివరించారు. విచారణ మొదలు పెట్టామని, బహుమానాన్ని ఇచ్చిన వ్యక్తిని గుర్తించేందుకు కసరత్తులు చేస్తున్నామని తెలిపారు.


మాటల గారడీగా కార్మిక సదస్సు : సీఐటీయు



న్యూఢిల్లీ : షెడ్యూల్ ప్రకారం ఈ నెలలో జరగాల్సిన 47వ 'భారతీయ కార్మిక సదస్సు'ను కేంద్ర ప్రభుత్వం పదేపదే వాయిదా వేసుకుంటూ రావడాన్ని సీఐటీయూ తప్పుపట్టింది. ఈ కార్యక్రమ నిర్వహణ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, దీనిని ప్రభుత్వం మాటలగారడీగా మార్చిందని సీఐటీయూ అధ్యక్షురాలు హేమలత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన హయాంలో కార్మిక సదస్సులు నిర్వహించినా.. ఆ సిఫారసులను అమలు చేసే ప్రయత్నం చేయలేదనీ, ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అసలు సమావేశాల నిర్వహణకే ఆసక్తి చూపడంలేదని అన్నారు. కనీసం ఏడాదికి రెండుసార్లు నిర్వహించాల్సిన సదస్సులను గత రెండేండ్ల నుంచి వాయిదావేసుకుంటూ వస్తున్నదని ఆరోపించారు. సామాజిక భద్రత, కార్మిక చట్టాల సవరణలు, సంస్కరణలు–క్రోడీకరణ, మహిళలపై ప్రత్యేక దృష్టితో ఉపాధి కల్పన తదితర ముఖ్య ఎజెండాతో షెడ్యూల్ ప్రకారం 47వ కార్మిక సదస్సు ఈ నెల 26, 27వ తేదీల్లో జరగాల్సి ఉంది.

"చివరి సమావేశం 2015లో జరిగింది. కనీస వేతనం రూ. 18 వేలు, రెగ్యులర్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు తదితర సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. సమావేశం నిర్వహించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు' అని హేమలత విమర్శించారు.

సోషల్ హల్‌చల్



క్రిమిసంహారకాల నియంత్రణ చట్టానికి సవరణలు

ముసాయిదా బిల్లులో రైతులను శిక్షార్హులుగా చేసే నిబంధనలపై ఆందోళన

- రైతుల ఉసురుతీసే మందుల తయారీ కంపెనీలపై కఠిన చర్యలకు రైతు సంఘాల డిమాండ్

నవతెలంగాణ జనరల్‌డెస్క్

రైతులకు ప్రాణాంతకంగా మారిన క్రిమి సంహారకాల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రతిపాదిత ముసాయిదా బిల్లుపై భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు ప్రారంభించింది. 1968లో మొదటిసారిగా క్రిమి సంహారకాల నియంత్రణ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. 50 ఏండ్ల తర్వాత చట్ట సవరణకు సంప్రదింపులు ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో పంటల దిగుబడిని పెంచడం కోసం ఎరువులను, పంటలను నష్టపరిచే చీడ పురుగులను అంతమొందించేందుకు క్రిమి సంహారకాలను రైతులు వాడుతారన్నది తెలిసిందే. అయితే, క్రిమి సంహారకాలను రైతులు తమ పంట పొలాలపై చల్లుతున్నపుడు కొన్ని సందర్భాల్లో వాటి విష ప్రభావానికి గురై అనారోగ్యం పాలవడం, ప్రాణాలను కోల్పోవడంలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. 2017 రెండో అర్ధభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో 40మందికిపైగా రైతులు క్రిమి సంహారకాల విష ప్రభావంతో చనిపోయారు.

విచక్షణారహితంగా క్రిమి సంహారకాలను వాడటం వల్ల ఆహార ధాన్యాల్లో వాటి అవశేషాలు చేరడంతో మనుషులు అనారోగ్యానికి గురవుతున్నారని 2015–16 ఆర్థిక సర్వే నివేదిక పేర్కొన్నది. దీంతో, క్రిమి సంహారకాల అభివృద్ధి,నియంత్రణ అథారిటీని ఏర్పాటు చేయాలని 2016లో వ్యవసాయంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసు చేసింది. ఇప్పుడు కొత్తగా రూపొందిస్తున్న క్రిమి సంహారకాల నిర్వహణా బిల్లు(1968 చట్టానికి సవరణ బిల్లు)లో వాటి తయారీ కంపెనీల రిజిస్ట్రేషన్ విధి విధానాలు, వినియోగంపై నిర్వచనం, ఇంకా ఇతర నిబంధనలను చేర్చనున్నట్టు తెలుస్తోంది. హానికరమైన క్రిమి సంహారకాలను తయారు చేసే కంపెనీలపై కఠిన చర్యలను ఈ బిల్లులో ప్రతిపాదించనున్నారు. అయితే, దాదాపు ఇటువంటి నిబంధనలతోనే 2008లో యూపీఏ ప్రభుత్వం క్రిమిసంహారకాల నిర్వహణా బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టగా అది ఆమోదానికి నోచుకోలేదు. ఈ ఏడాది జనవరి 11న ఈ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం మొదటి విడత సంప్రదింపులు జరిపింది. ఆ సమావేశానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, క్రిమి సంహారకాల తయారీ కంపెనీలు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అయితే, భేటీకి ముందు ముసాయిదా బిల్లు ప్రతులను మందుల కంపెనీలకు మాత్రమే ఇచ్చి రైతు



సంఘాల నేతలకు పంపిణీ చేయలేదని సమావేశానికి హాజరైన ప్రతినిధులు తెలిపారు. దాంతో,కంపెనీల యజమానులు బిల్లులో కొన్ని సవరణలను ముందే సిద్ధం చేసుకొని ప్రతిపాదించారు. రైతు సంఘాల ప్రతినిధులు కూడా అప్పటికపుడు కొన్ని సూచనలను బిల్లులో పొందుపరచాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలిగించే క్రిమి సంహారకాలను తయారు చేసే కంపెనీలను కఠినంగా శిక్షించేందుకు కొన్ని సవరణలను తాము ప్రతిపాదించామని రైతు నేత తెలిపారు. మందుల డబ్బాలపై చట్ట నిబంధనలను స్థానిక భాషల్లో తెలిపే లేబుళ్లను అంటించాలని, హానికరమైన క్రిమి సంహారకాలను తయారు చేసే కంపెనీలపై భారీ జరిమానాలు విధించాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

అయితే,నిబంధనలను కఠినతరం చేసే క్రమంలో రూపొందించిన బిల్లులోని అంశాలు చివరికి రైతులకే నష్టం కలిగించేలా ఉన్నాయని రైతు సంఘాలు గుర్తు చేసాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైతే క్రిమి సంహారకాలను వినియోగిస్తారో వారికి జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల వరకూ జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. ఇక్కడ వినియోగదారులు అనే పదం రైతులకే వర్తించేలా ఉండటం గమనార్హం. అంటే మందుల తయారీలో తమ ప్రమేయంలేని రైతులు తెలియనితనంతో పొరపాటున వాటిని వినియోగించడం వల్ల శిక్షలకు గురయ్యే అవకాశమున్నదని రైతు నేతలు అభ్యంతరం వ్యక్తం చేసారు.

రాష్ట్రాలకు నియంత్రణాధికారం లేదు..!

ఇప్పటికే అమలులో ఉన్న పురుగుమందుల చట్టంలోనూ తాజాగా రూపొందించిన ముసాయిదా బిల్లులోనూ నియంత్రణాధికారం కేంద్రం చేతుల్లోనే పెట్టుకున్నది. దీని పట్ల మహారాష్ట్ర, పంజాబ్ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. తమ రాష్ట్రాల్లో నియంత్రణాధికారం తమకే ఉండాలని అవి డిమాండ్ చేశాయి. గతేడాది జులై–సెప్టెంబర్ మధ్య కాలంలో తూర్పు మహారాష్ట్రలో పంటలపై పురుగుమందులు పిచికారీ చేస్తూ విష ప్రభావానికి గురై రైతులు మృతి చెందడంతో అక్టోబర్‌లో ఐదు క్రిమి సంహారకాలపై ఆ రాష్ట్రం నిషేధం విధించింది. కొన్ని మరణాలకు కారణంగా భావిస్తున్న మోనోక్రొటోఫాస్(ఆర్గానో ఫాస్ఫేట్ రసాయనం) కూడా నిషేధిత జాబితాలో ఉన్నది. అయితే, చట్టం ప్రకారం రాష్ట్రాలకు 60 రోజుల వరకు మాత్రమే దేనినైనా నిషేధించే అధికారమున్నది. నిషేధాన్ని మరో 30 రోజులపాటు పొడిగించే వెసలుబాటు ఉన్నది. ఆ తర్వాత దానిపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి. దాంతో, ఆ ఐదు మందులను శాశ్వతంగా నిషేధించాలని ఈ ఏడాది జనవరిలో కేంద్రాన్ని మహారాష్ట్ర కోరింది. మందులపై రాష్ట్రాలకున్న 90 రోజుల నిషేధ అధికారాన్ని 240 రోజులకు పెంచుతూ బిల్లులో ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా మందుల తయారీ, అమ్మకాలకు అనుమతి ఇవ్వడం, తొలగించడంపై మాత్రం అధికారం కేంద్ర క్రిమి సంహారకాల బోర్డుతోపాటు రిజిస్ట్రేషన్ కమిటీకి మాత్రమే ఉన్నది. మందుల అమ్మకం, తయారీ, రవాణా, నిల్వ చేయడానికి లైసెన్సులు జారీ చేసే అధికారాలు రాష్ట్రాలకున్నాయి. అయితే, ఓసారి లైసెన్స్ ఇచ్చిన తర్వాత రద్దు చేసే అధికారం రాష్ట్రాలకు లేదు. గడువు తీరిన తర్వాత పునరుద్ధరించకుండా అధికారమున్నది. దాంతో, పంజాబ్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో గడువుతీరిన 20 క్రిమి సంహారకాల లైసెన్సులను నిలిపివేసింది. హానికారక మందుల తయారీ కంపెనీలపై భారీ జరిమానాలకు బిల్లులో ప్రతిపాదన ఉన్నప్పటికీ వాటి యజమానులను నేరస్తులుగా బాధ్యులను చేస్తూ శిక్షలు విధించే నిబంధనలు లేవని రైతు సంఘాలు చెబుతున్నాయి. మందులను అమ్మడం ద్వారా లాభాలు పొందుతున్న కంపెనీ యజమానులు, మార్కెటింగ్ సంస్థల ప్రతినిధులనూ నిందితులుగా చేర్చి విచారించేలా చట్టం ఉండాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బోర్డులో మరికొన్ని భాగస్వామ్యపక్షాలకు చోటు

కేంద్ర క్రిమి సంహారకాల బోర్డులో రైతులు, రాష్ట్రాల వ్యవసాయ బోర్డుల డైరెక్టర్లు, వ్యవసాయ మండళ్ల(జోన్ల) సభ్యులు, ఆరోగ్య నిపుణులు, సంబంధిత విద్యా సంస్థల ప్రతినిధులకు చోటు కల్పించాలని బిల్లులో ప్రతిపాదించారు. ప్రపంచంలో జరుగుతున్న తాజా పరిశోధనలు, అభివృద్ధి ఆధారంగా పురుగు మందుల విష ప్రభావాన్ని అంచనా వేసి తగిన నిబంధనలను రూపొందించాల్సిన బాధ్యత బోర్డు సభ్యులపై ఉంటుంది. అమలులో ఉన్న చట్టంలో ఫంగస్, కలుపు మొక్కల నివారణకుపయోగించే మందులకు సంబంధించిన మార్గదర్శకాలు లేవు. తాజా బిల్లులో వాటిని ప్రతిపాదించారు. మందుల విష ప్రభావాన్ని అంచనావేసి ధ్రువీకరించే అధికారాన్ని ఏ ప్రయోగశాలలకు ఇవ్వాలనేది కూడా బిల్లులో ప్రతిపాదించనున్నారు. ప్రస్తుతం ఫరీదాబాద్‌లోని సెంట్రల్ ఫెస్టిసైడ్స్ లేబొరేటరీ ఈ బాధ్యతలను నిర్వహిస్తోంది.

సబ్సిడీ స్కూటర్ల పథకానికి ప్రధాని శ్రీకారం

చెన్నై: మహిళా ఉద్యోగులకు సబ్సిడీ స్కూటర్ల పథకాన్ని దేశ ప్రధాని నరేంద్రమోడీ తమిళనాడులో శనివారం ప్రారంభించారు. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సమక్షంలో మాజీ సీఎం జయలలిత 70వ జయంతి రోజున ఈ పథకం ప్రారంభమైంది. ఐదుగురు లబ్ధిదారులకు 50శాతం మేర రాయితీ(దాదాపు 25వేల రూపాయలు)తో ఐదు స్కూటర్ల తాళం చెవిలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లను అందజేసి పథకాన్ని ప్రధాని ఆరంభించారు. దీంతో పాటు 70లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్నీ మోడీ ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు, కావేరీ వాటర్ రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం పళనిస్వామి మోడీని కోరారు. ప్రధాని మొదలు పెట్టిన 70లక్షల మొక్కలు నాటే కార్యక్రమం ఏడాది పొడుగునా కొనసాగుతుందని తెలిపారు. ప్రధాని ధైర్యంగా దేశానికి నాయకత్వం వహిస్తున్నారని పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు. మహిళలకు ద్విచక్రవాహనాల కొనుగోలులో 50శాతం రాయితీ ఇస్తామని 2016 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో జయలలిత హామినిచ్చింది. అయితే 'అమ్మ' 70వ జయంతి రోజున లక్ష మంది మహిళలకు స్కూటర్లను పంపిణీ చేస్తామని తాజాగా గతడాది డిసెంబర్‌లో పళనిస్వామి ప్రకటించారు. ఇందుకు దాదాపు 3,36,103 మహిళలు దరఖాస్తు చేసుకున్నారని ఏఐఏడీఎంకే తెలిపింది. అంతకుముందు ప్రధాని మోడీని గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్, ముఖ్యమంత్రి కె పళనిస్వామి సహా పలువురు రాష్ట్ర నాయకులు చెన్నై ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. అక్కడినుంచి మెరీనా బీచ్ సమీపంలోని ఐఎన్ఎస్ అడియార్ నావల్ బేస్‌కు వెళ్లిన ప్రధాని తర్వాత ఈ కార్యక్రమానికి చేరుకున్నారు.

మేమొస్తే.. 'మహిళా' బిల్లు పాస్: రాహుల్

న్యూఢిల్లీ: తాము కేంద్రంలో అధికారంలోకొస్తే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తామని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. చట్టసభల్లో ఎక్కువ మంది మహిళలను చూడాలన్నదే కాంగ్రెస్ అభిమతమని తెలిపారు. కర్నాటకలోని బిజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన మహిళల పబ్లిక్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ కృషి ఫలితంగానే పంచాయతీరాజ్‌లో మహిళలకు రిజర్వేషన్ దక్కుతున్నదని చెప్పారు. పార్లమెంటులో కూడా మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని బిల్లును తీసుకొచ్చామని, బీజేపీ దాన్ని అమల్లోకి తేవడంలో వైఫల్యం చెందిందని తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభ, రాజ్యసభకు ఎక్కువ మంది మహిళలను ప్రాతినిధ్యం వహించాలని, వారి గొంతు దేశంలోని ప్రతీ మూలనా వినిపించాలని కోరుకుంటున్నట్టు వెల్లడించారు. అంతేకాక, కర్నాటకలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువ మంది మహిళలు పోటీ చేసేలా చర్యలు చేపట్టాలని పార్టీ రాష్ట్ర యూనిట్‌కు రాహుల్ సూచించారు.

గుజరాత్‌లో దళితులకు మిగిలింది

ఆత్మహత్యలు.. పోలీసు లాఠీలు..

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని పటాన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో దళిత కార్యకర్త భానుభాయ్ వంకర్ ఆత్మహత్య ఘటన ఆ రాష్ట్రాన్ని కుదిపివేసింది. తమకు కేటాయించిన భూములను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ దళిత సంఘాలు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ రోజు దళితులు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. భూమిలేని దళితులకు కేటాయించిన భూమిని రెగ్యలరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ దళిత్ అధికార్ మంచ్ (డీఏఎం) ఈ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. రాష్ట్ర హోం మంత్రి ప్రదీప్ సిన్హా జడేజా నేతృత్వం వహిస్తున్న వట్వా అసెంబ్లీ నియోజకవర్గంలోని జసోదా నగర్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న దళితులను పోలీసులు ఉతికిపారేశారు. లాఠీలతో విచక్షణారహితంగా దొరికిన వారిని దొరికినట్టు చితకబాదారు. ఈ నెల 18న ఈ ఘటన జరిగింది. పటాన్ జిల్లా సమీ బ్లాక్‌లోని దుడ్కా గ్రామంలో జరిగిన ఆందోళనకు భానుభాయ్ వంకర్ నేతృత్వం వహించాడు. వారికి కేటాయించిన భూమికి వారికి అప్పగించేలా ఆ దళితులకు భానుభాయ్ వంకర్ సహాయపడ్డాడు. భానుభాయ్ ప్రాణ త్యాగం తర్వాతగానీ ఆ ప్రాంతంలో వారికి భూమి పట్టాలు అందలేదు.

హోం మంత్రి నియోజకవర్గంలో ఏం జరిగింది?

జసోదా నగర్ ఘటనలో దళితులపై పోలీసులు వీరంగమాడారు. యష్ మక్వానా అనే దళిత కార్యకర్తను పోలీసులు స్పృహ కోల్పోయే వరకూ చితకబాదారు. పోలీసుల వీరంగంలో మరో దళితుడు ప్రకాశ్‌భాయ్ మక్వానాకు కాలు విరిగింది. 'అహ్మదాబాద్‌లోని జసోదా నగర్ నుంచి వందలాది మందితో ఈ నెల 18న నిరసన ర్యాలీ చేపట్టాం. మా నిరసనకు మద్దతుగా దుకాణాలు బంద్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశాం. వ్యాపారవర్గాల నుంచి మాకు మద్దతు కూడా వచ్చింది. మేం చాలా



శాంతియుతంగా ఆ నిరసన ప్రదర్శన చేపట్టాం. భారీ బలగాలతో పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ వాఘేలా అక్కడకు వచ్చారు. దయాదాక్షిణ్యాలు లేకుండా మాపై వారు లాఠీలు ఝుళిపించాడు. మాలో చాలా మందికి తీవ్రగాయాలయ్యాయి. నన్ను విపరీతంగా కొట్టారు. ప్రకాశ్ భాయి కాలు విరిగింది. మహిళలపై కూడా మగపోలీసులే దాడిచేశారు. తీవ్రగాయాలైన మమ్మల్ని నిర్బంధించి జీఐడీసీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. అక్కడ వాంతులు అవ్వడం ప్రారంభమైంది. అక్కడే స్పృహ తప్పిపడిపోయాను. నా కుటుంబసభ్యులే అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రి నుంచి గురువారం విడుదలయ్యాను' అని యష్ మక్వానా చెప్పారు. హోం మంత్రి ప్రదీప్ సిన్హా జడేజా ఆదేశాల మేరకే ఈ దాడి జరిగిందని యష్ ఆరోపించారు. 'ఇలాంటి ఆందోళనలను ఆపడానికి హోం మంత్రిగా ఏం చేసినా చెల్లుతుందనుకుంటున్నాడేమో... కానీ అతడు తప్పుచేశాడు. ఇలాంటి దాడులతో మా పోరాటాన్ని అణచివేయాలని చూస్తున్నారు. ఈ పోరాటం ఆగదు. మా హక్కులు మేం సాధించుకునేవారకూ.. మా నాయకుడు భానుభాయ్ హంతకులకు తగిన శిక్షపడేవరకూ హోం మంత్రిని నిద్రపోనివ్వం. పోలీసు లాఠీలు, నీటి ఫిరంగులు, బుల్లెట్లు మమ్మల్ని ఆపలేవని ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాం. మా నాయకుడి బలిదానం వృధాకానివ్వం. మా హక్కులు సాధించుకునే వరకూ పోరాడతాం' అని యష్ మక్వానా స్పష్టం చేశారు. తప్పుడు కేసుల్లో ఇరికించడం ద్వారా మమ్మల్ని బెదిరించాలని పోలీసులు చూస్తున్నారని, అలాంటి బెదిరింపులకు చెప్పారు.

కాగా, లాఠీచార్జీపై పోలీసు ఇన్స్‌పెక్టర్ గోహిల్ మాట్లాడుతూ... చట్టప్రకారమే వారిని నిర్బంధించామని, తాము ఎవరినీ కొట్టలేదనీ, చేయిచేసుకోలేదని అన్నారు. మరి వారి ఒంటిపై గాయాలెలా అయ్యాయని విలేకరులు ప్రశ్నించగా.. దానికి సమాధానాన్ని మాత్రం దాటవేశారు. వారు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా.. తాము సంయమనంతో వ్యవహరించామంటూ సర్దిచెప్పుకున్నారు.

బ్యాంక్‌ను మోసగిస్తున్న ఘటనల్లో

బాధ్యులెవరో ప్రకటించాలి

- కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ :పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చోటు చేసుకున్న రూ.11,400 కోట్ల మోసంపై రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)తో సమగ్ర దర్యాప్తు జరిపించాలని శనివారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పీఎన్‌బీలో జరిగిన మోసానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్‌బీఐ, బ్యాంకు మేనేజ్ మెంట్‌లను జవాబుదారిగా చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 60 రోజుల్లోగా ప్రకటించాలని కోరింది. బ్యాంకులను మోసగించే నిరవ్‌మోడి లాంటి మోసగాళ్ళు దేశం నుంచి పారిపోయేందుకు ఎందుకు అనుమతిస్తున్నారో తెలుసుకోవాలనుకుంటున్నానని మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ అన్నారు. బ్యాంకులను మోసగించిన ఘటనల్లో దేశం ఇప్పటికే రూ.21 వేల కోట్లు నష్టపోయింది. ఇతర బ్యాంకులలో జరిగిన మోసాలు కూడా మరికొన్ని రోజులలో వెలుగుచూడనున్నాయి. రూ.390 కోట్ల మోసానికి గురైన ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఉదంతం కూడా బయటకు వచ్చింది. దేశానికి అత్యంత ఖరీదైన కాపలాదారుడు నరేంద్ర మోడీ ఉన్నప్పటికీ, అతని కనుసైగలలోనే ఇలాంటి మోసాలు ఎలా జరుగుతున్నాయో విస్మయాన్ని కలిగిస్తోందని ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో సిబల్ అన్నారు. ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాన మంత్రి మోడీ తాను దేశానికి కాపలాదారుడు(వాచ్‌మెన్)గా పనిచేస్తున్నానని చేసిన వ్యాఖ్యలను సిబల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థ విశ్వసనీయతపై సందేహాలు తలెత్తితే దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది, బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులపై ప్రభావం చూపుతుందని ఆయన చెప్పారు.

హర్యానా పాఠశాలల్లో గాయత్రి మంత్రాలు

చండీగఢ్: హర్యానా రాష్ట్రంలోని పాఠశాల సిలబస్‌లో గీతా శ్లోకాలను చేర్చిన తంతు ముగిసింది. ఇప్పుడు గాయత్రి మంత్రం వంతు వచ్చింది. పాఠశాలలో ఉదయం చేసే ప్రార్థనలో గాయత్రి మంత్రాన్ని జపించాలని తాజాగా రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టార్ ప్రశంసిస్తూ..ఇది విద్యావ్యవస్థలో నైతికతను, సంస్కృతిని పెంచుతుందని వ్యాఖ్యానించారు. దీంతో విద్యార్థులకు సంస్కారవంత విద్య అందుతుందని పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో నైతిక, సంస్కృతిక విలువలను పెంపొందించేందుకు అనేక విషయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరమే విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే పాఠశాల సిలబస్‌లో గీతా శ్లోకాలను చేర్చామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రామ్ బిలాస్ శర్మ తెలిపారు. ప్రస్తుతం పాఠశాల ప్రేయర్‌లలో గాయత్రి మంత్రాన్ని ప్రవేశపెడుతున్నామని చెప్పారు. దీంతో గాయత్రి మంత్ర సారం విద్యార్థులకు తెలియవస్తోందని తెలిపారు.

బతుకుపోరులో ఫార్మా-డీ విద్యార్థులు

25 రోజులుగా నిరసన దీక్షలో 12 వేల మంది

- పట్టించుకోని సర్కారు
- విద్యార్థులకు న్యాయం చేయాలని సీఎంకు తమ్మినేని లేఖ

ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) విద్యార్థులు బతుకు పోరు చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చా లంటూ రాష్ట్ర వ్యాప్తంగా 25రోజుల నుంచి 12వేల మంది రిలేదీక్షలను కొనసాగిస్తున్నారు. అయినా, ప్రభుత్వం వారి ఆందోళనవైపు కన్నెత్తి చూడట్లేదు. దీంతో ఈ దీక్షలను ఆమరణ నిరాహార దీక్షలుగా మార్చి పోరు ఉధృతం చేయడానికి విద్యార్థులు సిద్ధపడుతున్నారు. బతుకు పోరాటంలో దీక్షలు చేస్తున్న ఫార్మా డీ విద్యార్థుల ఆందోళనలపై 'నవతెలంగాణ' కథనం..

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

2008మార్చి13న ఫార్మా డీ కోర్సును పీసీఐ(ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) అనుమతితో భారతదేశంలోకి తీసు కొచ్చారు. ఈ కోర్సును అందించే కళాశాలు దేశంలో 233, రాష్ట్రంలో 47 ఉన్నాయి. భవిష్యత్‌లో మంచి ఉద్యోగావకా శాలు ఉంటాయన్న ఆశతో అనేక మంది ఆరేండ్లు కష్టపడి కోర్సు పూర్తి చేశారు. ఒక్కొక్కరు రూ.10 నుంచి రూ.20 లక్షలు వెచ్చించారు. తొలి ఐదేండ్లు కాలేజీలో చివరి ఏడాది ఏదైనా ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రజలకు నేరుగా ఆరోగ్యసేవలు అందించారు. వైద్యుడు రోగికి మందులిస్తే వాటిని ఎలా వాడాలి? ఎంత మోతాదులో వాడాలి? ఆ మందు ఎంత మేర పనిచేస్తుంది..? అనే అంశాలను క్షుణ్ణంగా చెప్పగలిగే కోర్సే ఫార్మా-డీ. పేషెంట్‌కు కౌన్సిలింగ్ ఇవ్వడంలోనూ, ప్రాణాంతక రోగాలకు ఉపయోగించే ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించడంలోనూ తర్ఫీదు పొంది ఉన్నారు. ఇలాంటి కీలక కోర్సు చేసిన వారికి మాత్రం ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించే అవకాశం ఇవ్వడం లేదు. 2015లో కేంద్ర ప్రభుత్వం 'ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులరైజేషన్' పేరుతో చట్టాన్ని రూపొందించింది. దీనికి కేరళ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి. కేరళ, మహారాష్ట్రలో ఈ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగవ కాశాలను కల్పించాయి. తెలంగాణ ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన లేదు. ఫలితంగా ఈ కోర్సు చేసే వారికి ఎలాంటి ఉపయోగాలూ లేవన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. అంతేకాక తెలంగాణ సర్కారు 2015లో ఈ కోర్సుపై త్రిసభ్య కమిటీ వేసింది. ఈ కమిటీలో డీఎంఈతో పాటు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ నుంచి, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నుంచి ఒక్కొక్క సభ్యులుంటారని పేర్కొంది. మూడేండ్లయినా 'తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్'ను ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోయిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.





సీఎంకు తమ్మినేని లేఖ

సమస్య పరిష్కారంలో సీఎం కేసీఆర్ చొరవ చూపా లని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రత్యేకంగా లేఖ రాశారు. ఈ మేరకు రాష్ట్రంలోని 12వేల మంది విద్యార్థుల ఆందోళనకు తమ పార్టీ మద్దతు తెలు పుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

రూ.లక్షలు ఖర్చుచేసి కోర్సు పూర్తి చేసినా ఫలితం లేదు. కేరళ తరహా విధానాన్ని అమలు చేయాలి. కోర్సు పూర్తిచేసిన వారు అప్పులపాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయం చేయాలి. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

- తాళ్లూరి అనిత, ఫార్మాడీ విద్యార్థిని

పట్టించుకోకపోవటం అన్యాయం

ఎన్నో ఆర్థిక ఇబ్బందులను తట్టుకుని కోర్సు పూర్తి చేశా. ప్రభుత్వం పట్టించు కోకపోవడం అన్యాయం. ఉద్యోగావకాశాలు కల్పించాలి. ప్రభుత్వ, ప్రయి వేటు ఆస్పత్రుల్లో మాకు అవకాశం కల్పిస్తేనే మాకు భవిష్యత్ ఉంటుంది.

- బి.నరేష్, ఫార్మా డీ విద్యార్థుల సంఘం రాష్ట్ర నాయకులు

ప్రధాన డిమాండ్లు ఇవే...

2015లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ (జీవో ఆర్‌టీ-515) నివేదిక ను వెంటనే ప్రభుత్వానికి అందజే యాలి. ప్రతి 30 పడకల ప్రభుత్వ, ప్రయి వేటు ఆస్పత్రుల్లో ఈకోర్సు చేసిన వారికే క్లినికల్ ఫార్మాసిస్టులుగా నియమిం చాలి. ప్రతిఆస్పత్రిలో డ్రగ్ ఇన్‌ఫర్మేషన్, పాయిజన్ ఇన్ ఫర్మేషన్ సెంటర్‌లలో, పేషెంట్ కౌన్సిలింగ్ విభాగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరతను అధిగమిం చేందుకు ఫార్మా-డీ డాక్టర్ల వైద్యసేవలు వినియోగించు కోవాలి.

వర్సిటీలు కాషాయమయం

- ఆర్ఎస్ఎస్, బీజేపీలకే దేశభక్తి లేదు: జేవీవీ సదస్సులో లక్ష్మీనారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి వచ్చాక కేంద్రీయ విశ్వ విద్యాలయాలను కాషాయమయం చేస్తోందని హైద రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ విమర్శించారు. జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) 30వ సంతాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నపుడు పాఠ్యాంశాలను కాషాయీకరణ చేసిందని చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక కేంద్రీయ విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేయాలని భావిస్తోందన్నారు. ఆ విశ్వవిద్యాలయాల్లో వీసీ, రిజిస్ట్రార్లను ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నోళ్లనే నియమిస్తున్నారని చెప్పారు. జేఎన్‌యూ వీసీ జగదీశ్‌కుమార్‌ను నియమించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అనుకూలంగా ఉండేవారినే ప్రొఫెసర్లుగా నియమిస్తున్నారని విమర్శించారు. ఇటీవల జేఎన్‌యూలో 60 మంది ప్రొఫెసర్లను ఆర్ఎస్ఎస్‌కు అనుకూలంగా ఉండే వారిని ఎంపిక చేశారని గుర్తు చేశారు. ఎంపిక కమిటీల్లోనూ కాషాయ వ్యక్తులనే నియమిస్తున్నారని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో అభ్యుదయ భావాలున్న సంఘాలను లేకుండా చేయాలని కుట్ర చేస్తోంద న్నారు. ఆర్ఎస్ఎస్‌కు భిన్నంగా ఉండే సంఘాలను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యం లేని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయని చెప్పారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలకే దేశభక్తి లేదని విమర్శించారు. మోడీ, ఆర్ఎస్ఎస్‌ను విమర్శిస్తే దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. దేశద్రో హులైన లలిత్‌మోడీ, నీరవ్‌మోడీలకు సహకరించి విదేశాలకు పంపించడంలో బీజేపీ నాయకులే సహకరించారని చెప్పారు. దేశాన్ని, వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని అన్నారు. విద్యారంగంలో ఫాసిస్టు దోరణలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జేఎన్‌యూ పీహెచ్‌డీ విద్యార్థి పి అంబేద్కర్ మాట్లాడుతూ విద్యతోనే అసమానతలు తగ్గుతాయని చెప్పారు. సమాజంలో ఉన్నట్టుగానే విశ్వవిద్యాలయాల్లోనూ కులవివక్ష, అసమానతలు కొనసాగుతున్నాయని అన్నారు. అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య అందితేనే ఆర్థికంగా బలోపేతమవుతారని, వారి జీవన ప్రమాణాల్లో మార్పులొస్తాయని చెప్పారు. బిట్స్ పిలాని ప్రొఫెసర్ భీమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నత విద్యావకాశాలకు ఎంతో దూరంలో ఉన్నారని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో 18.1 శాతం ఉన్న దళితులు 7.5 శాతం, 8.4 శాతం ఉన్న ఎస్టీలు 2.1 శాతం, 37.4 శాతం ఉన్న బీసీలు 26.5 శాతం, 11.9 శాతం ఉన్న ముస్లిములు 3.3 శాతం, 22.2 శాతం ఇతర కులాల వారు 56.9 శాతం ఉన్నారని వివరించారు.

ఉన్నత చదువులు లేకపోవడంతో ఉన్నత ఉద్యోగాలనూ పొందడం లేదని చెప్పారు. విద్యా ప్రయివేటీకరణ వల్ల ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు మరింత నష్టం కలుగుతుందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు కృష్ణంరాజులు నాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం జేవీవీ ఉపాధ్యక్షు రాలు డాక్టర్ రమాదేవి అధ్యక్షతన వైద్య ఆరోగ్యరం గంపై చర్చ జరిగింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ టి.సుందరరామన్ మాటా ్లడుతూ కేంద్ర ప్రభుత్వ చర్యలన్నీ కార్పొరేట్ వైద్య రంగాన్ని ప్రోత్సహించేదిగా ఉందన్నారు. మొక్కగా ఉన్న ప్రయివేటు వైద్యరంగం నేడు వటవృక్షంగా మారిందని చెప్పారు. ప్రభుత్వాలు కార్పొరేట్ వైద్యాన్ని పెంచడానికే సహకరించాయని అన్నారు.

పోలీస్..ప్రెస్.. లాయర్.. జానాైనై ఫైన్ కట్టాల్సిందే

చలాన్లు చెల్లించని వారిని వదలని ట్రాఫిక్ పోలీసులు

- లైసెన్స్ లేకుంటే వాహనం సీజ్
- రోడ్లపై అడ్డదిడ్డంగా దూసుకెళ్లడం, డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-సిటీ బ్యూరో

మీరు లైసెన్స్ లేకుండా వాహనాలతో రోడ్డెకుతున్నారా? నెంబర్‌ప్లేట్లు వంచి చలాన్లు నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారా? ట్రాఫిక్ నిబంధలను తుంగలో తొక్కుతూ వాహనంపై దూసుకెళ్తున్నారా? సెల్‌ఫోన్ డ్రైవింగ్.. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారా? అయితే జాగ్రత్త. ఇలాంటివారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు. పోలీస్.. ప్రెస్.. లాయర్.. పొలిటికల్ లీడర్ అంతా జాన్తానై అంటున్నారు. ట్రాఫిక్ నిబంధలు అందరూ పాటించా ల్సిందే.. లేకుంటే తమకు ఎవరైనా ఒక్కటే.. అంటూ చలాన్ రాసేస్తున్నారు. చలాన్ కట్టకుంటే తిరిగి మళ్లీ చర్యలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్ నగరంలో దాదాపు 52 లక్షలకుపై వాహనాలున్నాయి. వాటిలో దాదాపు 30లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలున్నాయని పోలీసుల అంచనా. వీరిలో చాలామంది ట్రాఫిక్ నింబంధనలు పాటించట్లేదు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలపై రోడ్లపైకి వస్తున్న వారివల్ల చాలా మంది అమాయకులు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలపై రోడ్లపైకి వస్తే పట్టేస్తున్నారు. పట్టుబడిన సమయంలో లైసెన్స్ లేకున్నా, అంతకుముందే విధించిన చలాన్ చెల్లించకపోయినా వాహనాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తు న్నారు. ఆ సమయంలో రాజకీయ నాయకులైనా, సెలబ్రెటీ లైనా, మీడియా సిబ్బంది అయినా ఎవ్వరినీ వదట్లేదు. కేవలం 11 రోజుల్లోనే (ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు) ట్రాఫిక్ పోలీసులు 1331 ఛార్జ్‌షీట్లను కోర్టులో దాఖలు చేశారు. పట్టుబడిన వారందరికీ ముందుగా గోషామహల్, బేగంపేట్ కేంద్రాల్లో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెడుతున్నారు. ఇప్పటిదాకా ట్రాఫిక్ ఉల్లం ఘనలకు పాల్పడిన 241 వాహనదారులకు రెండురోజుల నుంచి 15రోజుల వరకు జైలు శిక్షలు పడ్డాయి. చలాన్ల ద్వారా రూ.28.45 లక్షలను ట్రాఫిక్ పోలీసులు వసూలు చేశారు.

82 మంది వాహనదారుల లైసెన్స్‌ల రద్దు

కేవలం 11రోజుల్లోనే 82 మంది లైసెన్సులను ఎర్రమంజిల్ మెట్రోపాలిటన్ 3వ, 4వ మెజిస్ట్రేట్లు రద్దు చేశారు. ఓ వాహనదారుని లైసెన్స్‌ను మూడేండ్లపాటు రద్దుచేయగా, 11 మంది లైసెన్స్‌లను రెండేండ్లపాటు రద్దు చేశారు. 17 మంది లైసెన్స్‌లను ఏడాది, మరో ఇద్దరి వాహన దారులకు సంబంధించి ఆరు నెలల, 51మంది వాహనదారులకు చెందిన లైసెన్స్‌లను మూడు నెలలపాటు రద్దు చేశారు.

చలాన్లు చెల్లించని 39 మందికి జైలు

నగరంలో ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలను చేపట్టిన సమయం లో చలాన్ విధిస్తున్నారు. చలాన్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వాహనాదారుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు వారికి తిరిగి అదనంగా చలాన్ పంపిస్తున్నారు. మూడు కంటే అధికంగా చలాన్లు పెండింగ్‌లో ఉన్న వారిని కోర్టులో ప్రవేశపెట్టడంతో జైలు శిక్షలు పడుతున్నాయి. ఈ క్రమంలో చలాన్లపై నిర్లక్ష్యం వహించిన పలువురి వాహనదారులను కోర్టులో ప్రవేశపెట్టగా వారిలో 39 మందికి జైలు శిక్షలు పడ్డాయి.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే:

హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డాక్టర్ రవీందర్

హైదరాబాద్ నగరంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దీంతో గతేడాదితో పోల్చితే ప్రమాదాలు తగ్గాయి. ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా తనిఖీలను ముమ్మరం చేశాం. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలివ్వొద్దు. కొందరు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. అలాంటి వారి వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలిస్తున్నాం.

'108' సమస్యలనుపరిష్కరించండి..

- సీఎంకు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అమలవుతున్న '108' అంబులెన్స్ వైద్య సేవల పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. ఈ ఉద్యోగుల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వీరి ద్వారా రోజుకు 12 గంటలపాటు పనిచేయిస్తున్న జీవీకె, ఈఎమ్ఆర్ఐ సంస్థలు కేవలం రూ.12 వేల వేతనమిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని తెలిపారు.

చట్టబద్ధంగా సెలవులు, ఉద్యోగ భద్రత కల్పించకుండా దారుణంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వారికి ఏ ఇతర బెనిఫిట్స్ కూడా అమలు కావటం లేదని తెలిపారు. తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన వీరికి.. అడుగడుగునా నిరాశే ఎదురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా మంటూ టీఆర్ఎస్ తన ఎన్నికల ప్రణాళికలో కూడా హామీనిచ్చిందని జూలకంటి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జీవో నెం.14 ప్రకారం ఉద్యోగులందరికీ రూ.18 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఎంను కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి.. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

సంస్కారం

అది మొదటి ప్రపంచ యుద్ధ సమయం. సైన్యంలో యిద్దరు ప్రాణస్నేహితులు. తూటా తగిలి వారిలో ఒకరు నేలకొరిగితే, ఆ స్థితిలో స్నేహితుడ్ని చూసిన మరో సైనికునికి గుండెను పిండేసినంత బాధ. అప్పుడతను ఓ కందకంలో దాక్కుని ఉంటాడు. ఎటు చూసినా తుపాకీగుండ్ల మోత. ఆ పరిస్థితిలో తన లెఫ్టినెంట్‌ని కలిసి, తన మిత్రుడిని తీసుకురావడానికి అనుమతి తీసుకొని వెళ్తాడు సైనికుడు. "వెళ్లిరా, కాకపోతే ప్రయోజనం ఉండకపోవచ్చు.." అంటాడు లెఫ్టినెంట్. ఎలాగోలా తోటి సైనికుడ్ని చేరుకొని, భుజం మీద మోసుకొని తాను ఉండే కందకం దగ్గరికి తీసుకొస్తాడు. అప్పటికే మరణించిన స్నేహితుడ్ని చూసి, "నేను ముందే చెప్పాను.. ఏమీ ప్రయోజనం ఉండదనీ.. నీకూ బలమైన గాయాలే తగిలాయి.." అని చెబుతాడు లెఫ్టినెంట్. "కానీ నాకు చాలా తృప్తిగా ఉంది. నేను వెళ్లేటప్పటికి నా దోస్త్ బతికే ఉన్నాడండీ.. వాడు నన్ను చూడగానే, "నువ్వొస్తావని తెలుసురా..!" అన్న "ఆ ఒక్క మాట చాలు.. కోటి స్నేహాల పెట్టు.." అన్న ఆ స్నేహితుని హృదయ స్పందనే సంస్కారం.

ప్రతి ఒక్కరి జీవితానికి సంస్కారం ఉన్నతమైనది. ప్రాణపదమైంది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకునే ఈ సంస్కారం ప్రతి మనిషికీ హుందాతనాన్ని యిస్తుంది. సమాజాలను ఉదాత్తస్థాయిలో ఉన్నత శిఖరాలపై నిలుపుతుంది. దేశదేశాల్నీ సమున్నత స్థాయిలో నిలబెడుతుంది.

సంస్కారం అంటే ఏమిటీ..? చదువుకుంటే వస్తుందా సంస్కారం..? విజ్ఞానం లేకపోయినా మనుషుల్లో ఆ సంస్కారం ఉంటుందా..? పుట్టుకతోనే ఉంటుందా? సంస్కారానికి కొలబద్ద ఏమైనా ఉందా? సంస్కారం అనేది మన తల్లిదండ్రుల నుంచి వస్తుంది. మనచుట్టూ ఉండే పరిసరాల ప్రభావంతో ఉంటుంది. మన స్నేహితులూ సహచరుల నుంచీ అబ్బుతుంది. మనం నమ్మిన ఆశయాలను బట్టీ, మన అభ్యాసాన్నిబట్టీ ఉంటుంది. విజ్ఞానం నుండీ వస్తుంది. సాధించిన విజయాలూ సాధించవలసిన లక్ష్యాల నుంచీ వస్తుంది. మన తోటివారిని మనుషులుగా పరిగణించడంలో సంస్కారం ఉంటుంది. పరిగణించడమే కాదు. గౌరవించడం. మనతో సరిసమానంగా చూడటం. "ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును. ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును" అని గురజాడ చెబుతారు.

గుణగణాలన్నవి తయారుగా ఉండవు. అంచెలంచెలుగా వీటిని మనిషి నిర్మించుకోవాల్సి ఉంటుంది. అందుకని సంస్కరించటం మనతోనే మొదలు పెట్టాలి. ఒక్కోసారి మనకు తెలియకుండానే ఎవరినయినా బాధ పెట్టి ఉండవచ్చు. ఆ విషయం మనకు తెలిసిన వెంటనే మనంతట మనమే 'గతంలో నిన్ను బాధ పెట్టిన విషయాన్ని మరిచిపో మిత్రమా..! తెలియక అలా జరిగింది. నీ మనసు నొప్పించా.. మన్నించు..!' అని చేయి కలిపితే, అప్పుడు నీలోని సంస్కారం ఇనుమడిస్తుంది. మైత్రీబంధం కొత్త చివుళ్లు తొడుగుతుంది. ఆచరించి చెప్పే సంస్కారానికి ఉన్న ప్రభావం ఒట్టి మాటలకుండదు కదా..! చేసిందే చెప్పీ, చెప్పిందే చేసిన వారు మహాత్ములు. మనసున ఒకటీ, చెప్పింది మరొకటీ, చేసేది వేరొకటీ.. కానీ మనుషులుగా పుట్టీ, ఎదిగిన కొద్దీ ఒదిగీ ఉన్నతులుగా జీవించాలి. మనం సాధించిన విజయం ఏ ఒక్కరి కృషి వల్లనో కాదని తెలుసుకోవాలి. మనం ప్రయాణించాల్సిన గమ్యం యింకా యింకా సుదూరంలో ఉందని గుర్తించాలి.



మనం చూస్తుంటాం. పెద్దవాళ్లను కలవడానికి వెళ్లినప్పుడు, మనల్ని నిలబెట్టి మాట్లాడుతుంటారు. అది వారి కుర్చీ సంస్కారం. ఓ పెద్దాయన్ని 'సార్..!' అని సంబోధించగానే, అలా పిలవొద్దని చెప్పీ, మనుషుల్లో పెద్దోళ్లూ, చిన్నోళ్లూ అని విడిగా ఉండరు. అందరూ సమానులే.. అని హితబోధ చేసారు. అదీ ఆయన నమ్రతా సంస్కారం. పరిచయస్తులు తారసపడినపుడు, మనం పలకరించినా గుర్తు రానట్టు, ఎరిగినా ఎరగనట్టు మరీ చెప్పించుకుని, అపుడపుడూ తప్పించుకుని మొత్తానికి నిన్ను నువ్వే ప్రత్యేకంగా ప్రతిష్టించుకునే నిపుణతకు నిజంగా ప్రణామం చెప్పాలి. ఏదో నాలుగు రాతలతో కరపత్రంగా మిగలడం తప్ప, నిజంగా హృదయంతో కరచాలనం చేయడం ఏనాటికయినా అనుభవంలోకి వస్తుందా..? కానీ, నిజానికి మన సుమ భావాలను ఆత్మీయంగా సుతిమెత్తగా పంచుకోగలిగితే ఆ క్షణాలు 'నిన్న లేని అందమేదో... నిదుర లేచినంత..' ఓ మృదువైన మధురస్మృతి మదిలో తళుకులీనుతూనే ఉంటుంది. కాలమంతే.. కదిలిపోతుంది. కొన్ని క్షణాలు మాత్రం అలా నిలిచిపోతాయెప్పటికీ..

"ఆకాశమా...! నీకెంత అదృష్టమో కదా..! నన్ను చూడు.. ఎంతకాలం నేనిలా కిందనే పడి ఉండాలీ..!?" అని నేలతల్లి నిట్టూర్చిందట. అప్పుడు ఆకాశం "ఎవరుండే చోట వారుండటమే.. మేలు. వృధా ప్రయాసలెందుకు...?!" అని ఓదార్చిందట.. అందుకే ఆకాశం నిండుజాబిల్లి వెలుగులతో మెరిసిపోతూ ఉంటుంది. నేల కూడా బంగారమే.. కానీ ఆ మట్టిలో కూడా విష వాయువులు ఉంటాయి. అటువంటి వాయువులు ఎదిగే మొక్కకు చీడలాంటివి. అందుకని ఎప్పటికప్పుడు ఆ మట్టిని పెళ్లగించి, సంస్కరించాలి. పుష్కలంగా నీరు పెట్టాలి. ఆ వృక్షం సుగంధాన్ని వెదజల్లే ఆస్కారం ఉంటుంది. మనుషులకయినా అంతే. ప్రతి ఒక్కరి జీవితానికి సంస్కారం ఉన్నతమైనది. ప్రాణపదమైంది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకునే ఈ సంస్కారం ప్రతి మనిషికీ హుందాతనాన్ని యిస్తుంది. సమాజాలను ఉదాత్తస్థాయిలో ఉన్నత శిఖరాలపై నిలుపుతుంది. దేశదేశాల్నీ సమున్నత స్థాయిలో నిలబెడుతుంది. ప్రతి ఒక్కరూ సంస్కారాన్ని కంటిపాపలా కాపాడుకోవాలి. వేరెవరూ తస్కరించలేని ఈ సంస్కారం అచ్చంగా మనది. మన సొంతం. సంస్కారవంతమైన జీవితం ఆదర్శనీయం.

ప్రత్యామ్నాయ విలువల కోసం బహుజన ఫ్రంట్



ఎస్. వీరయ్య

మంథనిలో మధుకర్ హత్య, యాద్రాద్రి-భువనగిరిలో నరేష్, స్వాతీ హత్యలకు నిరసనగా వచ్చిన స్పందనలు రెండు భిన్నమైన అనుభవాలనిచ్చాయి. నరేష్, స్వాతి హత్యలకు వ్యతిరేకంగా విస్తృతమైన స్పందన లభించింది. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కదిలారు. మధుకర్ హత్య కూడా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించినప్పటికీ ఇంతటి విస్తృత స్పందన రాలేదు. రెండూ కుల దురహంకార హత్యలే. నిరసనగళాలు మాత్రం సమానంగా స్పందించలేదు. నరేష్ ఎంబీసీ కులానికి చెందినవాడు కాగా, హత్య చేసింది అగ్రకుల కుటుంబీకులు. ఈ దాడికి వ్యతిరేకంగా దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులన్న తేడా లేకుండా అందరూ, ఏకోన్ముఖంగా కదిలారు. కానీ మంథనిలో హత్యకు గురైంది దళితుడు. హత్య చేసింది బీసీ కుటుంబీకులు. ఈ దాడికి వ్యతిరేకంగా దళిత సంఘాలు, వామపక్షాల నుండి వచ్చిన స్పందన బీసీ సంఘాల నుంచి రాలేదు. కులవివక్ష సమస్య సంక్లిష్టమైనది. కులం పరిధిలో మాత్రమే ఆలోచించినంత కాలం వివక్ష కొనసాగుతుంది. కులం గోడల పరిధి దాటి స్పందించాలి. వివక్ష ఎక్కడున్నా ప్రశ్నించాలి. 'నాపట్ల వివక్ష సహించను. నేను మాత్రం కొన్ని తరగతుల పట్ల వివక్ష ప్రదర్శిస్తాన'ంటే.. సమస్యకు పరిష్కారం దొరకదు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో ఉన్న లక్షణమే ఇది. కులం ఉన్నంత కాలం జరిగేది ఇదే. అస్తిత్వం కోసం, గుర్తింపు కోసం పడే ఆరాటం పర్యవసానాలు ఇట్లానే ఉంటాయి.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనే కులమత బేధాలను అధిగమించి ఐక్యమైన వారసత్వం ఉన్నది. ఈ ఉద్యమ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న కమ్యూనిస్టు ఉద్యమం ఆర్థిక, సామాజిక రంగాలలో ఉద్యమబాట పట్టటం సహజమే కదా! ఈ వారసత్వ ఫలితమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం. అడుక్కోవటం ఆపాలన్నదే దీని నినాదం. నిర్ణయాధికారం కావాలిప్పుడు. అమలు చేసే అధికారం కావాలిప్పుడు. ఆ అధికారం బహుజనులకే కావాలిప్పుడు. అదే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నినాదం.

సమర నినాదాలు

బీసీలలో కూడా అందరికీ ఒకే గౌరవం లేదు. ఎంబీసీల పరిస్థితి హీనంగా ఉన్నది. ఎంబీసీలలోనూ అట్టడుగున ఉన్న సంచార జాతులు దయనీయమైన పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. కొన్ని కులాల పేర్లే తిట్టు పదాలుగా మారాయి. గ్రామాలలో భాగమైన ఎంబీసీలు వీరికన్నా కొంత మెరుగైన వారుగా పరిగణించినప్పటికీ, కులం పేరుతోనే తిట్టటం సర్వసాధారణమైంది. ఎవరికి వారు కొంత మంది కన్నా తాము అధికులమని గర్వపడటం, హీనంగా చూడటం, మరికొందరి నుండి వివక్షను అనుభవించటం కులవ్యవస్థ లక్షణం. అందుకే కులవివక్ష కేవలం అగ్రకులాలకే పరిమితమైలేదు. మనువాద భావజాలం ఈ సమాజంలో నాటిన విషబీజాల లోతు చాలా ఎక్కువ. ఏ రెండు కులాలకూ సమాన హోదా లేకుండా చేసింది. సమాజాన్ని ముక్కచెక్కలు చేసింది. అందుకే వేళ్ళమీద లెక్కించగల అగ్రకుల పెత్తందారీ పోకడ గ్రామాల మీద అధికారం చెలాయించగల్గుతున్నది. అత్యధిక సందర్భాలలో గ్రామీణ దళితుల మీద బీసీలనే ఎగదోస్తారు. బడుగుల నుండి వివక్ష అనుభవిస్తున్న ఆశ్రిత కులాలున్నాయి. అందుకే అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా ఐక్యత అన్న నినాదం అందరినీ ఉత్సాహపరచదు. ఆర్థిక దోపిడీ, సామాజిక వివక్ష, సమన్యాయం సమర నినాదాలు కావాలి. అప్పుడే సమరోత్సాహంతో కదలగలరు.

సంస్కరణలా? పోరాటాలా?

ఆర్థిక సమస్యల విషయంలో పోరాటం సూటిగానే ఉంటుంది. కడుపు కాలిన వారంతా కదులుతారు. సామాజిక సమస్యల విషయంలో మనిషికీ మనిషికీ మధ్య మనువాదం అడ్డుగోడలు నిర్మించింది. మానసిక అవరోధాలు సృష్టించింది. ఇక్కడ పోరాటాలా? సంస్కరణలా? అన్న ప్రశ్నకూడా ముందుకు వస్తుంది. కుల వివక్ష మీద పోరాడవచ్చు. కానీ కులాంతర వివాహం పోరాటాలతో జరగదు కదా! ఇద్దరు మనుషుల మధ్య ప్రేమ జనించాలి. పెండ్లికి వారిద్దరూ సిద్ధపడాలి. ఆ తర్వాతనే పోరాటానికైనా సిద్ధపడి పెండ్లి చేసుకోవాలన్న సమస్య వస్తుంది. అందువల్ల సామాజిక రంగంలో జరగవల్సిన కృషి పోరాటాలుగానూ, సంస్కరణలుగానూ సాగకతప్పదు. నిజానికి సంస్కరణలు లేని పోరాటాలు లేవు. పోరాటాలు లేని సంస్కరణలూ లేవు. సంస్కరణ తలపెట్టినవారికి ప్రతిబంధకాలు తప్పవు. వాటిని అధిగమించేందుకు పోరాటాలూ తప్పవు. పోరాటాలూ, సంస్కరణలూ జమిలిగా సాగవల్సిందే. ఎవరి ప్రయత్నం వారు చేయవల్సిందే. కులాంతర, మతాంతర వివాహాలు సంస్కరణోద్యమంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

ఆధునిక మార్గమే...

ఒకప్పుడు ఎవరి కులంలో వారే స్వీయ పౌరహిత్యం ఒక ఆత్మగౌరవ రూపంగా పనిచేసింది. వెనుకబడిన కాలానికి అది సరిపోయింది. కానీ ఇందులో బ్రాహ్మణీకం గొప్పదన్న భావజాలాన్ని అంగీకరించే లక్షణం ఉన్నది. అది మేమూ చేయగలమని చెప్పుకునే ప్రయత్నమున్నది. అట్లానే కుల గుర్తింపు కూడా. వ్యక్తుల పేరు చివరన తాము కూడా కులం పేరు చేర్చటం ద్వారా తమకులం కూడా గొప్పదని చెప్పుకునే తాపత్రయం ఉన్నది. కానీ బ్రాహ్మణీయ భావజాలమే అభివృద్ధి నిరోధకం. మనువాదమే సమాజాభివృద్ధికి ఆటంకం. కుల వ్యవస్థే అభివృద్ధికి అడ్డుగోడ. రాచరికపు కాలాలలో, భూస్వామ్య సమాజంలో ఎదురు మాట్లాడలేని స్థితి. రాజుమీద, పెత్తందార్లమీద కోపాన్ని దేవుడి పేరుమీద పెట్టి వ్యక్తం చేసిన కాలంలో అవే ప్రతిఘటన రూపాలు. కుల పురాణాలు చెప్పుకోవటం, ప్రతి కులం తమకు రాచరిక మూలాలున్నాయని చెప్పుకునేందుకు ప్రయత్నించటం కూడా ఇలాంటిదే. అణగారిన తరగతులు కూడా తాము గొప్పవారమేనని చెప్పుకునే ప్రయత్నంలో భాగమే ఇది. ఇప్పుడు ఆధునిక సమాజంలో ఉన్నాం. ప్రజాస్వామ్యం విలువలు ముందుకొచ్చాయి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందింది. ఆర్థిక వ్యవస్థలు ఆధునిక రూపాలు సంతరించుకున్నాయి. ఆధునిక వర్గాలు అవతరించాయి. ఆధునిక సిద్ధాంతాలు ఆయుధాలయ్యాయి. అస్తిత్వ బంధాలిప్పుడు రక్షించజాలవు. అణచివేత బంధాలను తెంచుకోవాలిప్పుడు. వివక్ష వ్యతిరేక బంధం దండలో దారం కావాలి. సంక్షేమం, సమన్యాయం, సమగ్రాభివృద్ధి కోసం ముందుకు సాగాలి.

ఆధిపత్య విలువలకు సమాధికట్టాలి

ప్రత్యామ్నాయ విలువలకు పట్టం కట్టాలిప్పుడు. వివక్ష ఎవరు పాటించినా ప్రశ్నించాలి. అవినీతికి ఎవరు పాల్పడినా వ్యతిరేకించాలి. ఏంచేసైనా బడుగులు, బలహీన వర్గాల నుండి కొందరైనా పైకి రావాలంటారు కొందరు. ఆధిపత్యవాదులు అనుసరించింది ఇదే. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దోపిడీ, అణచివేత, వివక్ష... ఇవే ఆధిపత్యవాదుల విలువలు. సహకారం, ప్రేమ, సమానత్వం, శ్రమపట్ల గౌరవం, ఆత్మగౌరవం, నిజాయితీ, ఐక్యత, నిబద్ధత, పరస్పర గౌరవం బహుజనుల సహజ విలువలు. బహుజనులకెప్పుడూ ఆధిపత్యవాదుల విలువలు ఆదర్శం కాదు. కాకూడదు. ప్రత్యామ్నాయ విలువలే ప్రత్యామ్నాయ ఉద్యమానికి పునాదులు. ఆధిపత్యవాదులు స్థిరపర్చిన విలువలలో సందుచూసుకోవటం కాదు. ప్రత్యామ్నాయ విలువలు పాదుకొల్పాలి.



ఎడం పెరిగిన నేపథ్యం

ప్రపంచీకరణ పరుగులో బడుగుల్లోని మధ్యతరగతి పాలకవర్గాలకు దగ్గరైంది. అదొక ప్రత్యేక దశ. సామాజిక సంస్థలకూ, కమ్యూనిస్టులకూ ఎడం పెరిగిన కాలం. స్వాతంత్ర్యానికి పూర్వం ఎక్కువ భాగం కులం, వృత్తీ పెనవేసుకుని ప్రయాణించిన కాలం. స్వాతంత్ర్యానంతరం ఒక వైపు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి, మరోవైపు పాలకులు సంక్షేమ రాజ్యంపేరుతో విస్తరించిన ప్రభుత్వశాఖలు. ఇవన్నీ కలగలిసి మధ్యతరగతి విస్తరణకు దారితీసింది. దీనికి తోడు విద్య, ఉద్యోగాలు, కొంతమేరకు రాజకీయరంగంలోనూ రిజర్వేషన్లు రావటం కొత్త పరిణామం. బడుగు, బలహీన వర్గాల నుంచి కూడా గణనీయమైన స్థాయిలో మధ్యతరగతి ఆవిర్భావానికి దారితీసింది. కులాలలో వర్గ విభజనకు కూడా ఇది దారులు వేసింది. సరిగ్గా ఈ కాలమంతా, కమ్యూనిస్టు ఉద్యమంలో, పాలకవర్గాల స్వభావం గురించిన అంచనా విషయంలో తీవ్ర సంఘర్షణ సాగింది. సామాజిక రంగంలో వస్తున్న నూతన పరిణామాల మీద ప్రత్యేక దృష్టి సారించలేకపోయింది. ఆర్థిక రాజకీయ పోరాటాల మీదనే ప్రధానంగా కేంద్రీకరించింది. ఇంకోవైపు పాలకవర్గాలు ఓటుబ్యాంకు రాజకీయాల మీద దృష్టి సారించాయి. అణగారిన తరగతులలో రిజర్వేషన్ల ప్రయోజనం పొంది అభివృద్ధి చెందుతున్న వారిలో కొందరిని చేరదీయటం, బుజ్జగించటం ఎత్తుగడగా ప్రయోగించింది. పాలకవర్గాల ఎత్తుగడలు ఒకవైపూ, కమ్యూనిస్టులు తమ సామాజిక సమస్యల మీద దృష్టి సారించలేదన్న భావం మరోవైపూ వీరి మధ్య ఎడం పెంచింది. ఇంతలో.. సోవియట్ పతనంతో ఒక పెద్ద కుదుపు. యువతకు అప్పటిదాకా ఆదర్శంగా నిలిచిన సోషలిజం మీద ఆశలు సన్నగిల్లాయి. సామాజిక తరగతులలో అభివృద్ధి చెందుతున్న సమూహం మీద కూడా దీని ప్రభావం తక్కువేమీకాదు కదా! దీనికి తోడు సరళీకృత ఆర్థిక విధానాలూ, కొంత కాలం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ పరుగులు తీయటం కూడా ప్రభావితం చేసింది. ఇందుకనుగుణంగానే పాలకవర్గాలు పావులు కదిపాయి. అస్తిత్వం చాటుకునే తాపత్రయాన్నీ, గుర్తింపు కోసం పడే ఆరాటాన్నే అవకాశంగా తీసుకుని ప్రేమ ఒలకబోసారు. కమ్యూనిస్టులపై ఉన్న అపార్థాలూ, అపోహలను పెంచే ప్రయత్నం చేసారు. వీటన్నింటి ఫలితమే సామాజిక శక్తులకూ, కమ్యూనిస్టులకు మధ్య ఈ తాత్కాలిక ఎడబాటు. ఇది శత్రుత్వాల ఫలితం కాదు. ఆవేదనల పర్యవసానం మాత్రమే. తాత్కాలిక ఎడబాటును శాశ్వతం చేసేందుకు పాలకులు చేసిన ప్రయత్నాలు ఫలించజాలవు. సహజబంధం శత్రుపూరితంగా మారటం సాధ్యం కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు దశాబ్దాల కాలం నుండి సాగుతున్న కులవివక్ష వ్యతిరేక పోరాట పరిణామాలు దీనినే సూచిస్తున్నాయి. అంతే కాదు. తాజాపర్చిన సీపీఐ(ఎం) కార్యక్రమం కులం సమస్య పట్ల మరింత స్పష్టతనిచ్చింది. దేశావ్యాపితంగా సామాజిక సమస్యల పట్ల మరింత శ్రద్ధ పెరగడానికి ఇది దారితీసింది. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు డిమాండు చేయటం, సామాజిక రంగంలో కూడా వర్గపోరాటం ఉధృతం చేయాలన్న సీపీఐ(ఎం) పిలుపు ఈ దిశలో కృషి మరింత పెంచింది. ఇప్పుడు తెలంగాణలో ఇది రాజకీయ రంగానికి కూడా విస్తరించింది. ఇప్పుడు బడుగు, బలహీనవర్గాలలోని మధ్య తరగతి మదిలో సాగుతున్న సంఘర్షణ ఇదే. తమ స్థితిగతులు మరింత మెరుగుపరుచుకునేందుకే కాదు, బువ్వలేనివారికోసం.. బువ్వ దొరకని వారిని సమీకరించి... పోరు బాటలో నడపాలి. మధ్యతరగతి, మేధావులు వీరికి అండగా నిలవాలి.

తెలంగాణ గుండెచప్పుడు

తెలంగాణ గుండెల్లో వామపక్ష బీజాలకు బలమైన స్థానమే ఉన్నది. అనేక పార్టీలలో అభివృద్ధి కాముకులున్నారు. అన్ని తరగతులలో అన్ని మతాలలో అభ్యుదయ వాదులున్నారు. మానవీయ విలువలకు, ప్రజాస్వామ్య, లౌకిక విలువలకు బలమైన స్థానమున్నది. హైదరాబాద్ నడిబొడ్డున అంకురించిన కామ్రేడ్స్ అసోసియేషన్‌లోనే... ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభ దశలోనే.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనే కులమత బేధాలను అధిగమించి ఐక్యమైన వారసత్వం ఉన్నది. ఈ ఉద్యమ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న కమ్యూనిస్టు ఉద్యమం ఆర్థిక, సామాజిక రంగాలలో ఉద్యమబాట పట్టటం సహజమే కదా! ఈ వారసత్వ ఫలితమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం. అడుక్కోవటం ఆపాలన్నదే దీని నినాదం. నిర్ణయాధికారం కావాలిప్పుడు. అమలు చేసే అధికారం కావాలిప్పుడు. ఆ అధికారం బహుజనులకే కావాలిప్పుడు. అదే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నినాదం. ■

రిపోర్టర్స్ డైరీ

దోస్తాన్...

బీజేపీ, టీఆర్ఎస్ సర్కారు మధ్య దోస్తాన్ రోజుకురోజుకు పలుచన అవుతున్నదని రాజకీయవర్గాల్లో వినికిడి. నోట్ల రద్దు, జీఎస్టీ విషయంలో బట్టలు చింపుకుని ఎన్డీయే పక్షాన మాట్లాడిన సీఎం కేసీఆర్‌కు చివరకు కేంద్రం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను సైతం బీజేపీ సర్కారు పెండింగ్‌లో పెట్టింది. ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీలమాదిరిగా ఎన్డీయేలో చేరకుండానే బయట ఉండి సోపతి చేసేందుకు సీఎం సిద్ధపడ్డారు. నయానోభయానో నిధులు రాబట్టేందుకు, ప్రాజెక్టులను సాధించేందుకు ఎంచుకున్న ఈ మార్గం చివరకు బెడిసికొట్టింది. కేసీఆర్ చాణక్యనీతిని గ్రహించిన కేంద్రం కాస్త, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పదే పదే ప్రశంసిస్తూ నిధులు ఇవ్వకుండా నెత్తిమీద చల్లనిగుడ్డ వేసి ప్రవచనాలు కలుపుతున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా ప్రాజెక్టులు, సంక్షేమపథకాలు, ఇతర అవసరాల కోసం రూ. 35 వేల కోట్లు తక్షణం అవసరం ఉన్నాయట. అందులో సగం కేంద్రం నుంచి బకాయిల రూపేణా రావాల్సి ఉండేనట. అవి వస్తే గట్టెక్కుదామనుకుంటే టీఆర్ఎస్ సర్కారు పరిస్థితి ప్రస్తుతం అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా ఉందనే ప్రచారం రాజకీయవర్గాల్లో చోటుచేసుకుంటున్నది. దోస్తాన్ పేరిట ఆయా సందర్భాల్లో కేంద్రాన్ని కష్టకాలంలో వెనకేసుకొచ్చినా ఫలితం లేదని కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో వ్యాఖ్యానిస్తున్నారనే ప్రచారమూ ఉంది సుమీ.

- బి.బసవపున్నయ్య

గాయ్...గాయ్

నాలుగేండ్లుగా మిన్నకుండి.. రేపటి నుంచి బస్సుయాత్ర చేపడుతున్న టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గాయ్ గాయ్ అవుతున్నారు. యాత్రకు ఏర్పాట్లు చేయడంలోనూ, సీనియర్లతో మాట్లాడంలోనూ, రూట్ మ్యాప్ సిద్ధం చేయడంలో అన్నింటిలో కూడా గందరగోళం కనిపిస్తున్నది. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బస్సుయాత్రకు వివిధ కమిటీలను ఏర్పాటు రెండు రోజుల ముందు వేశారు. ఆయా కమిటీ సభ్యులతో చర్చించకుండా ఇష్టమొచ్చిన పేర్లు ప్రకటించారు. చాలా మందికి ప్రాతినిధ్యం లేకపోవడంతో అసంతృప్తి ఉన్నది. బస్సుయాత్రలో పాల్గొనాలంటూ ఫేస్‌బుక్ లైవ్ ద్వారా కోరారు. దీనిపై భిన్నాభిప్రాయాలను రెండు సెల్‌నెంబర్లు ఇచ్చి మాట్లాడమన్నారు. దీని కోసం రెండు గంటలపాటు అందుబాటులో ఉన్నారు. ఈ యాత్రకు చాలా మంది సీనియర్లు దూరంగా ఉన్నారు. జూనియర్లు, ఉత్తమకుమార్ అనుచరులు మాత్రమే చురుకుగా పాల్గొంటున్నారు. బస్సుయాత్రలో పాల్గొంటున్నారా? అని ఒక సీనియర్ నాయకుడిని అడగ్గా మ్యాండేట్ కాదు కదా? అని ఎదురు ప్రశ్నించారు. నా సొంత జిల్లాలో బస్సుయాత్ర తిరిగేటప్పుడే దానిపై దృష్టి పెడతానని చెప్పారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవహారశైలి పట్ల అసంతృప్తులూ అలకలూ పెరిగి బస్సు యాత్రోత్సవం కొరవడిందని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

- గుడిగ రఘు

'గీతా' సారాంశం...

రెండున్నరేండ్ల కిందట కొందరు ఉద్యోగులు.. తమ గోడును చెప్పుకునేందుకోసం ప్రభుత్వాధినేత ఇంటి వద్దకు వెళ్లారు. వారు అలా వెళ్లారో.. లేదో.. పోలీసు బాబాయిలు అరెస్టు చేసి పడేశారు. సర్లే.. పెద్దాయన ఎలాగో అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదు.. రాబోయే కాలానికి కాబోయే యువరాజులాగా ఫీలవుతున్న యంగ్ మినిష్టర్ వద్దకు వెళ్లి బాధను వెళ్లగక్కుకుందామనుకున్నారు సదరు సిబ్బంది. వారిని చూసీ చూడగానే.. ఒంటి కాలుమీద చెంగ చెంగన ఎగిరిన ఆ అమాత్యుడు... 'పరిపాలన అంటే మీరు చెప్పినట్టే నడుస్తదా.. మాకు ఎప్పుడేం చెయ్యాలో.. ఎవరిని ఎక్కడుంచాలో బాగా తెల్సు.. నోర్మూసుకుని అవతలికి పోండి...' అని హూంకరించారు. కంగుతిన్న ఉద్యోగులు.. 'ఇందుకేనా సార్.. మేం ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడింది...?' అని ఆవేదనతో కూడిన ప్రశ్నను సంధించారు. సహజంగానే ప్రశ్నించే తత్వాన్ని తట్టుకోలేని ఆ మినిష్టర్.. 'ఏం తలకాయ తిరుగుతున్నదా..? రాజకీయాలు మాట్లాడుతున్నరు...?' అంటూ ఆగ్రహావేశాన్ని వెళ్లగక్కారు. ఇక ఆఖరు అస్త్రంగా.. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటిదాకా జనాన్ని జాగృతం చేస్తున్నామని చెప్పుకుంటున్న ఓ ఎంపీని సదరు బాధితులు కలిశారు. 'మీ సమస్యల్ని రెండంటే రెండే రోజుల్లో పరిష్కరిస్తా. ఈ అంశంపై సీఎం గారితో నేనే మాట్లాడతా...' అంటూ ఆమె ఆకాశమంత హామీనిచ్చారు. ఆమె అరుంధతిలా వాగ్దానమిచ్చి.. రెండున్న రేండ్లు గడిచిపోయింది. ఉద్యోగుల పరిస్థితి మాత్రం దినదిన గండ నూరేండ్ల ఆయుష్షులాగా మారింది. ఇటీవల సచివాలయంలో ఆ బాధితులు విలేకరులకు తారసపడినప్పుడు ఈ విషయాలన్నీ చర్చకొచ్చాయి. 'అన్నా తెలంగాణ వస్తే మా బతుకులు బాగుపడతయ్ అనుకున్నం. కానీ మా తలరాతలేం మారలే...' అని ఓ ఉద్యోగి ఈ సందర్భంగా కంటతడి పెట్టుకున్నాడు. చలించిన ఓ సీనియర్ జర్నలిస్టు... 'మీ తలరాతలు బాగలేక పోవటం కాదు.. గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్టు.. జరిగిందేదో మంచికే జరిగింది. జరుగుతున్నది కూడా మంచికే జరుగుతున్నది.. భవిష్యత్తులో జరగబోయేదంతా మంచే జరుగుతుంది.. కాకపోతే మీరు నిరుత్సాహపడకుండా ఉద్యమాలను ఉధృతం చేయాలి...' అని హితోపదేశం చేశాడు...


-బి.వి.యన్.పద్మరాజు

రైతులు కాదు...వ్యాపారస్తులు...

ఒకసారి ముఖ్యమంత్రి, మరో సారి మార్కెటింగ్ శాఖ మంత్రి వ్యవసాయ శాఖ సమీక్షల సందర్భంగా ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ ప్రకారంగా అధికారులు కొనుగోలు చేశారు. కానీ రైతుల వద్ద నుంచి కాకుండా వ్యాపారస్తుల వద్ద గోదాముల్లో ఉన్న కందులు ఒక్క గింజ లేకుండా కొనుగోలు చేశారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులు పండించిన కంది పంట మార్కెట్‌కు రాకముందే కొనుగోలు కేంద్రాలు తెరిచారు. దీంతో గోదాముల్లో నిల్వచేసుకున్న కందులను మొత్తం వ్యాపారస్తులు మార్కెట్‌లో అమ్ముకున్నారు. పంట పండించిన రైతులు కందులు మార్కెట్‌కు తీసుకొచ్చే సరికి మద్దతు ధర ఉండదు, కొనుగోలు చేసే నాథుడుండడు. దీంతో మద్దతు ధర చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా కొనుగోళ్లు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం, రైతు సంఘాలు వినతి పత్రాలు ఇవ్వడం, పేపర్లు, టీవీల్లో మొత్తుకోవడం మామూలే. వాస్తవంగా మాట్లాడుకోవాలంటే ప్రయివేటు వ్యాపారస్తుల వద్ద ఎన్ని క్వింటాళ్ల కందులున్నాయి? రైతులు పండించిన పంట మార్కెట్‌కు ఎప్పడొస్తుంది? వచ్చే కందులు ఎన్ని క్వింటాళ్లు మార్కెట్‌కు రాబోతున్నాయి? ఎప్పటి వరకు కొనుగోలు చేస్తే, రైతులు పండించిన కందులు మొత్తం కొనుగోలు చేయొచ్చు అనే విషయాలు ప్రభుత్వానికి తెలియదా? అంటే తెలుసు. కాకపోతే వ్యాపారస్తులైతే పెద్ద మొత్తంలో చందాలు గుమ్మరిస్తారు, రైతులేం గుమ్మరిస్తారు తెచ్చిన కందులు తప్పా.. ఏ ప్రభుత్వాలు అయినా వ్యాపారస్తుల వైపే ఉంటాయని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

- మోత్కూరి యాదయ్య

బస్సుయాత్ర



తెలిదేవర భానుమూర్తి

నడినాత్రి. సల్లగాలి గొడ్తున్నది. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌమంటున్నయి. అందరు బండుకున్నరు. కొందరు నిద్రరాక అటిటు బొర్లుతున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. సడక్ మీద మోర్ గొట్టుకుంట గూర్క గస్తి దిర్గుతున్నడు. దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురు జూస్తున్నరు. సడక్ మీద ఆడొక మోటర్ ఈడొక లారి బోతున్నది. జీపుల పోలీసోల్లు గస్తి దిర్గుతున్నరు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు, సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.

బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు గూడ విక్రమార్కుని లెక్కనే దినం పూట బంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు. పొద్దుమీకినంక గానికి వొండుకోబుద్ధి గాలేదు. గాడు హొటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. బిర్యాని తిన్నంక సిగిలేటు ముట్టిచ్చుకుండు. సిగిలేటు దాక్కుంట ఇంటికి వొచ్చిండు. టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంట గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. ఎప్పటిలెక్క గంటి సప్పుడు ఇనంగనే బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్టు గొడ్తున్నదనుకోని ఐదారుపార్లు విక్రమార్కుడు గంటి బజాయించిండు. గంటి సప్పుడుకు బేతాలుడు నిద్రలేసిండు. ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను సైకిల్ మీద గూసుండబెట్టుకోని ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను. వొచ్చే యాడాది ఎలచ్చన్లు అయితయి. కాంగ్రెస్ పార్టి గిప్పటి సందే ఎలచ్చన్లకు రడీ అయితున్నది. మూడు నెలలు ఏదన్న ఒక యాత్ర జేస్కుంట జెనంల దిర్గాలని కాంగ్రెస్ పార్టి అనుకున్నది. ఏ యాత్ర అయితె బాగుంటది. ఎవ్వరెవ్వరు ఏ యాత్ర జేస్తె బాగుంటదని కాంగ్రెస్ ఆలోచన జేసింది. ఆలోచన జేస్తె పనిగాదని ఏ యాత్ర జెయ్యాలనే దాని మీద సర్వే జేపిచ్చింది. కొంతమంది బస్సుయాత్ర. జేస్తె బాగుంటదని జెప్పిండ్రు. కొంతమంది పాదయాత్ర జేస్తె బాగుంటది. పాదయాత్ర జేస్తె జెనంలకు బోవచ్చునని జెప్పిండ్రు. తక్వ మంది రతయాత్ర జేస్తె బాగుంటదని అన్నరు. కొంత మంది గాలిమోటర్ యాత్ర జేస్తె బాగుంటదని జెప్పిండ్రు. ఎక్వ మంది బస్సుయాత్ర జేస్తె బాగుంటదని అన్నరు. ఇగ



దాంతోని వొచ్చె ఇర్వైఆరు తారీకు కెల్లి బస్సుయాత్ర ఉంటదని టిపిపిసి ప్రెసిడెంట్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నడు. అనుడే గాకుంట అందరికి మెసేజ్‌లు బంపిండు. బస్సుయాత్రల అయితె లీడర్లందరు బస్సుల గూసోని బోవచ్చు. గట్ల బోతె కాంగ్రెసోల్లందరు ఒక్కటే. గాల్ల నడ్మ ఎసువంటి కొట్లాటలు లేవు అని జెనం అనుకుంటరని గాయిన అన్నడు. మూడు నెలలు బస్సుయాత్ర జెయ్యాలని గాయిన జెప్పిండు. బస్సుయాత్ర యాడికెల్లి షురువుజెయ్యాలె. ఆదిలబాద్ కెల్లి షురువజెయ్యాలని కొందరు అన్నరు. లే కమ్మం కెల్లి షురువు జెయ్యాలని కొందరు అన్నరు. ఆడికెల్లి గాదు. ఈడికెల్లి గాదు చేవెల్ల కెల్లి షురువు జేస్తె బాగుంటదని కొందరు అన్నరు. ఆకర్కి బస్సు యాత్ర చేవెల్ల కెల్లి షురువుజేస్తె బాగుంటదని అనుకున్నరు. కొబ్బరికాయ గొట్టి పస్పుకుంక్మలతోని బస్సుకు పూజజేసినంక బస్సుయాత్ర షురువుజెయ్యాలని అనుకున్నరు. బస్సుయాత్రరా. బహు మిక్కిలి వినోదరా. నాల్గు పయ్యేలతో ముంగట్కిబోయే బస్సు యాత్రరా బహుమిక్కిలి వినోదరా అని పాడుకుంట బస్సుయాత్ర జెయ్యాలని అనుకున్నరు. బస్సుకు కాంగ్రెస్ జెండలు గట్టాలని అనుకున్నరు. మే పదిహేనో తారీకు దాంక బస్సుయాత్ర జేస్తమని జెప్పిండ్రు. బస్సుయాత్ర అయినంక పాదయాత్రలు షురువు జేస్తమని అన్నరు. ఒకే పారి మూడు పాదయాత్రలు షురువు జేస్తమని జెప్పిండ్రు. ఒక పాదయాత్రను బట్టి విక్రమార్కషురువు జేస్తె ఇంకొక పాదయాత్రను రేవంత్ రెడ్డి షురువుజేస్తడని అన్నరు. ఇంకొక పాదయాత్రను కాంగ్రెస్ మాజి ఎంపి పొన్నం ప్రబాకర్ షురువు జేస్తడని జెప్పిండ్రు.

ఇగ వి.హన్మంతరావు తోక ఊపుకుంట రతయాత్ర జేస్తడని అన్నరు.

"గీ నాలుగేండ్లల్ల టిఆర్ఎస్ సర్కార్ చేస్తమని జెప్పినయి జెయ్యలేదు. ఇంటికొక కొల్వు ఇస్తమని జెప్పింది. గని ఊరికొక కొల్వు గూడ ఇయ్యలేదు. దలితులకు తలా మూడెక్రాల బూమి ఇస్తమని జెప్పింది. గని ఒక్కలికి గూడ మూడెక్రాల బూమి ఇయ్యలేదు. మిషన్ కాకతీయ అన్కుంట కమీషన్లు గొడ్తున్నరు. మిషన్ బగీరతను కమీషన్ బగీరత జేసింద్రు. గియన్ని జెనంకు జెప్పెతందుకే మనం బస్సుయాత్ర, పాదయాత్రలు, రత యాత్ర జేస్తం. మన బస్సుయాత్రకు ప్రజా చైతన్య బస్సు యాత్ర అని పేరు బెడ్దాం. బస్సుయాత్ర జేస్కుంట, పాదయాత్రలు జేస్కుంట జెనంకు చెయ్యిద్దాం. రతయాత్ర జేస్కుంట విహెచ్ జెనంకు తోక ఇస్తడు. నా లెక్కనే కాంగ్రెస్ లీడర్లు అందరు గడ్డం బెంచాలె. కాంగ్రెస్ సర్కార్ వొచ్చెదాంక గడ్డం బెంచాలె" అని తెలంగాన ప్రదేస్ కాంగ్రెస్ కమిటి ప్రెసిడెంట్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నడు.

"కాంగ్రెస్ల అందరు బస్సుయాత్ర, పాదయాత్రలు జేస్తమంటె వి.హన్మంతరావు ఒక్కడే రతయాత్ర జేస్తనని ఎందుకన్నడు. గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ బిరక్ పేలైతది" అని బేతాలుడు అన్నడు.

"కాంగ్రెస్ లీడర్లల్ల ఒక్క విహెచ్‌కే తోక ఉన్నది. తోక తింపుకుంట జెనంకు సూబెట్టెతందుకే గాయిన రతయాత్ర జేస్తనన్నడు" అని విక్రమార్కుడు జెప్పంగనే బేతాలుడు సైకిల్ దిగి బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్:9959150491



తెలుగువారంతా అభిమానించే అతికొద్ది మంది హీరోయిన్స్‌లో ఆమని ఒకరు. మనింట్లో తిరిగే అచ్చతెలుగు అమ్మాయిలా.. హోమ్లీగా కనిపించే ఆమె 'జంబలకిడిపంబ' సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి.. అతికొద్దికాలంలోనే ప్రముఖ హీరోలతో, ప్రముఖ దర్శకులతో కలిసి పనిచేశారు. 'మిస్టర్ పెళ్లాం'లో నటనకు గాను నంది అవార్డు తన అరుదైన నటనతో అందుకున్నారు. అమాయకత్వం ఉట్టిపడే ఇల్లాలిగా.. భర్తను అమ్మే గడసరి గృహిణిగా.. భర్త ఆశయాలకంటే పిల్లల ఆశలకై విలువనిచ్చే తల్లిగా.. ఇలా ఎన్నో పాత్రలకు తన నటనతో జీవం పోసిన ఆమె పెండ్లి తర్వాత వెండితెరకు దశాబ్దం పాటు దూరమయ్యారు. ఆ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎంట్రీ ఇచ్చారు. నిజజీవితంలోనూ ఇల్లాలిగా.. తల్లిగా తన బాధ్యతలతో ఒకవైపు.. తన నటనకౌశలాన్ని గుర్తించి..ప్రోత్సహిస్తున్న దర్శక నిర్మాతలు ఇస్తున్న అవకాశాలతో నటిగా మరోవైపు బిజీగా ఉన్నారు. తన ప్యాషన్, ప్రొఫెషన్, లైఫ్ నటనే అంటున్నారు. వారం రోజుల షూటింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చిన **ప్రముఖ సినీనటి ఆమని** తన బిజీ షెడ్యూల్‌లోనూ మానవితో పంచుకున్న ముచ్చట్లు..

నటననే..నా ప్యాషన్..నా ప్రొఫెషన్

నాన్న మాదేశ్వర్ (మాదప్ప)తెలుగువారే. అమ్మ కన్నడ. నాన్న తన చిన్నప్పుడే బెంగుళూరు వెళ్లి అక్కడే సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా స్థిరపడిపోయారు. అమ్మకు సినిమాలంటే కొంచెం ఆసక్తి. నాన్న డిస్ట్రిబ్యూటర్ కావడంతో కొత్తగా విడుదలైన ప్రతిసినిమాను అమ్మనాన్నలతో కలిసి చూసేదాన్ని. నాకు ఊహ తెలిసే నాటికే సినిమానే నా ప్రపంచంగా మారిపోయింది. ఏ సినిమా చూసివస్తే ఆ సినిమాలో పాత్రలను అనుకరిస్తూ.. అద్దం ముందు నా అభినయాన్ని నేనే చూసుకుని మురిసిపోయేదాన్ని. నటన అంటే నాకు ఇష్టం అని మాత్రం ఇంట్లో చెప్పడానికి చాలా భయపడ్డాను.

గెలువడం కన్నా...

నేను, అన్నయ్య ఇద్దరమే పిల్లలం కావడంతో అమ్మనాన్న ఎంత గారాబంగా పెంచారు. నాకు అమ్మతో కన్నా నాన్నతో చనువెక్కువ. చదువులో యావరేజ్ స్టూడెంట్‌నే. బెంగుళూరులోని భారతీయ సంస్కృతి విద్యాపీఠంలో చదువుకున్నాను. స్కూలులో జరిగే ఆటలపోటీల్లో మాత్రం నేనే ఫస్ట్ పేరు ఇచ్చేదాన్ని. అన్ని పోటీల్లో పాల్గొనేదాన్ని. గెలుస్తామా లేదా అన్నది తర్వాత.. ముందు మనం అందరితో కలిసి ఆడాలి...పోటీపడాలి. అంతవరకు మాత్రమే ఆలోచించేదాన్ని. స్కూలు లెవల్‌లో జిల్లా స్థాయి పోటీల్లోనూ పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. రన్నింగ్, బ్యాట్‌మెంటెన్, త్రోబాల్ ఇలా అన్ని ఆటలు ఆడేదాన్ని. భరతనాట్యం రెండు సంవత్సరాలు నేర్చుకున్నాను. స్కూలులో ప్రదర్శనలు ఇచ్చేదాన్ని.



నా లైఫ్‌లో పెద్దలాస్..

పదవతరగతి పూర్తి అయ్యినాటికీ నాకు సినిమాలంటే పిచ్చి అన్న విషయం ఇంట్లోవారికి కొద్దిగా అర్థమయ్యింది. నాన్న ఒప్పుకోలేదు. చదువుకో లేదంటే పెండ్లిచేసుకో అన్నారు. 'సినిమాల్లో సక్సెస్ కాకపోతే చదువుకుంటాను.. అంతేకాని పెండ్లి మాత్రం చేసుకోను' అంటూ గట్టిగా ఏడ్చేశాను. అమ్మ నాకు ఎంతో ధైర్యం చెప్పారు. నా ఇష్టం తెలుసుకుని నాకు మద్దతుగా నిలిచారు. నాన్నను ఒప్పించారు. అప్పుడు నాన్న తమిళనాడులోని తన స్నేహితుడికి నా గురించి చెప్పారు. కొత్తగా చిత్రపరిశ్రమలోకి వచ్చేవారికి తమిళంలో బాగా అవకాశాలు ఇస్తారు...ప్రోత్సహిస్తారు. తమిళంలో కొద్దిగా గుర్తింపు వచ్చిన తర్వాత ఇతర భాషల్లో అవకాశాలు వస్తాయి. అలా మొదట తమిళంలో రెండు సినిమాల్లో హీరోయిన్‌గా చేశాను. అవి పెద్దగా సక్సెస్ కాలేదు. సినిమాల్లో నటిస్తున్నే డిగ్రీ పూర్తి చేశాను. ఆ సమయంలోనే ఇవివిగారి సినిమాలో అవకాశం వచ్చింది. సెలక్షన్స్ కోసం నా ఫొటోలు పంపాను. ఇంతలో నాన్నకు ఆరోగ్యం బాగలేకపోవడంతో బెంగుళూరు వెళ్లాను. కొద్దిరోజులు నాన్న ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా.. కోలుకోలేదు. ఆయన చనిపోవడంతో నేను పెద్దదిక్కును కోల్పోయాను. నా లైఫ్‌లో అది పెద్ద లాస్..

అమ్మ ఇచ్చిన ధైర్యం..

ఇవివిగారు తీస్తున్న 'జంబలకిడిపంబ' సినిమాలో అవకాశం వచ్చిందని ఫోన్ చేశారు. నాన్న పోయిన దిగులుతో ఉన్న నేను వీలుకాదని చెప్పాను. అప్పుడు అమ్మ 'నువ్వు నటనను ఇష్టపడ్డావు. ఇప్పుడు నాన్న లేరని నీఇష్టాన్ని కాదంటే ఎలా? ఆయన ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి. ఈ బాధ నుంచి కాస్త కోలుకోవడానికి వచ్చిన అవకాశం అనుకో. వెళ్లు' అంటూ ధైర్యం చెప్పారు. దాంతో నేను తెలుగు పరిశ్రమలోకి వచ్చాను.

ప్రొడక్షన్ టైమ్‌లో..

'జంబలకిడిపంబ' సినిమాలో హీరోయిన్ పాత్ర అని చెప్పారు. కొత్త హీరోయిన్‌ను కావడం వల్లనేమో కథ మాత్రం చెప్పలేదు. నేనూ.. అడగలేదు. షూటింగ్ జరిగినన్ని రోజులు నవ్వుల వాన కురిసేది. నరేష్‌గారు, బ్రహ్మానందం గారు, శ్రీలక్ష్మిగారు ఇలా హాస్యకుటుంబం అంతా ఒక చోట ఉందా అనిపించేది. షూటింగ్ సమయంలో కొంత కథ అర్థమైంది. ఆడవాళ్లు మగవాళ్లలాగ, మగవాళ్లు ఆడవారిలాగా ప్రవర్తించే ఈ కాన్సెప్ట్‌తో తీస్తే.. సినిమాలు ఆడుతాయా? అంటూ కొందరు విమర్శించేవారు. వారందరి కామెంట్స్‌తో ఈ సినిమా ఎంటో కొద్దికొద్దిగా తెలిసింది. ఆడుతుందో లేదో అన్న భయం మనసులో ఉండేది. రిలీజ్ అయిన తర్వాత చూస్తే.. థియేటర్ నిండా జనాలు.. అందరి ముఖాల్లో నవ్వులు. చాలా సంతోషం అనిపించింది. ఈ సినిమా విడుదలైన తర్వాత ఒకరోజు బిర్లామందిర్ వెళ్లాం. అక్కడ అందరూ నన్ను గుర్తుపట్టారు.. 'జంబలకిడిపంబ' సినిమా హీరోయిన్ అంటూ చుట్టుముట్టారు. బాగా చేశారని అభినందించారు. ఫర్వాలేదు.. నేను బాగానే నటించగలను అన్న నమ్మకం వారిని చూసిన తర్వాత వచ్చింది.

'శుభసంకల్పం'లోని పాత్ర ..

'జంబలకిడిపంబ' సినిమా తర్వాత దాదాపు 50కి పైగా చాలా సినిమాల్లో నటించాను. ప్రముఖదర్శకులు బాపు గారి దర్శకత్వంలో మిస్టర్ పెళ్లాం, కె. విశ్వనాథ్ గారి దర్శకత్వంలో శుభసంకల్పం వంటి సినిమాల్లోనూ నటించాను. అవార్డులు అందుకున్నాను. శుభసంకల్పం లోని పాత్ర నాకేంతో నచ్చిన పాత్ర. ఆ సినిమా నుంచి నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటున్నాను. 'వసంతకోకిల' సినిమాలో శ్రీదేవి చేసిన పాత్ర వంటి పాత్ర చేయాలన్నది నా డ్రీమ్‌రోల్.

పెండ్లితో కాస్త బ్రేక్

ఒక ఫంక్షన్‌లో కలిసిన బిజినెస్‌మాన్‌తో ప్రేమ, పెండ్లి వెంటవెంటనే జరిగి పోయాయి. ఆ తర్వాత కొద్దిరోజుల పాటు సాధారణ గృహిణిగా ఉండాలనుకున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పిల్లలంటే చాలా ఇష్టం. పెండ్లి అయిన తర్వాత పిల్లల కోసం వెయిట్ చేస్తూ.. సినిమాల్లో వచ్చిన అవకాశాలను కాదన్నాను. ఇప్పుడు మాకు ఇద్దరు పిల్లలు. బాబుకు నాలుగేండ్లు. పాపకు 18నెలలు. వారిద్దరిని మా వారు, అమ్మ చూసుకుంటున్నారు.



పాటలంటే..

నాకు పాటలంటే చాలా ఇష్టం. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ ఇలా అన్ని భాషల్లోని సంగీతసాహిత్యాలకు ప్రాధాన్యత ఉన్న పాటలను వింటుంటాను. ఏ మాత్రం ఖాళీ టైం దొరికినా.. సాంగ్స్ వింటాను.

ఏం కావాలో నిర్ణయించుకోవాలి..

మనం చేసేది ఏదైనా కరెక్టుగా చేయాలి. సినిమాలోకి వస్తే హీరోయిన్‌గా చేయాలా.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయాలా, డ్యాన్సర్‌గా చేయాలా అన్న స్పష్టత ముందే ఉంటే అనుకున్న గోల్‌ను చేరుకోవడం సులభం అవుతుంది. హీరోయిన్‌గా మంచి పాత్రలు రాకపోతే.. తిరిగి వెనిక్కి వెళ్లిపోదాం అనుకున్నాను. మంచి అవకాశాలు వచ్చినప్పుడు వాటిని నిలబెట్టుకున్నాను. బాపుగారి దర్శకత్వంలోని 'మిస్టర్ పెళ్ళాం' సినిమా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ ఫిల్మ్ అవార్డును అందుకోవడంతో పాటు ఆ చిత్రంతో నాకు 'ఉత్తమ నటిగా నంది అవార్డు' వచ్చింది. నటనకు, పాత్రకు ప్రాధాన్యత ఉంటే క్యారెక్టర్ పాత్ర అయినా సరే. ఇప్పుడిప్పుడే మంచిమంచి అవకాశాలు వస్తున్నాయి. రెండు, మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. మరో రెండు సినిమాలు షూటింగ్‌లో ఉన్నాయి.

వి. యశోద



'స్త్రీల సమస్యలు స్త్రీ జీవితానికే పరిమితం కాదు. ఇవి పురుషుల జీవితానికి సంబంధం లేని విషయాలు కాదు. స్త్రీల సమస్యల మీద స్త్రీలకు జ్ఞానం కలగడం ఎంత అవసరమో... పురుషులకు జ్ఞానం కలగడం కూడా అంత అవసరం'

- రంగనాయకమ్మ



కాస్త విరామం అవసరం...

ఒత్తిడి అనేది జీవితంలో ఒక భాగం. చిన్నగా ఒత్తిడికి గురి కావడం మంచిదే అని చెబుతున్నారు నిపుణులు. కాని అనారోగ్యపరంగా వచ్చే ఒత్తిడి ప్రమాదకరమని చెబుతున్నారు. అలాంటి సమయంలో వచ్చే ఒత్తిళ్లను అదుపులో ఉంచుకోవాలంటే కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది. అవేంటో తెలుసుకుందాం...

- ఒత్తిడితో కూడిన వ్యాయామం చేయకూడదు. వ్యాయామం చేసే ముందు మధ్య మధ్యలో కాస్త విరామం తీసుకోవాలి. దాంతో పాటు ఐదు నిమిషాలు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ చేయడం మంచిది.
- కొన్ని గంటల పాటు కదలకుండా పనులు చేయకూడదు. ఎందుకంటే కండరాలు ఒత్తిడి గురవుతాయి. అలా కాకుండా ఉండాలంటే కుర్చీలో నుంచి లేచి పది నిమిషాలు అటూఇటూ తిరగడం మంచిది.
- నీరు సరిగ్గా తీసుకోకపోయిన తల నొప్పి, అలసట, నీరసం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి సమయానికి నీరు తాగడం మరిచిపోవద్దు.
- కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ, టీ, చాక్లెట్ వంటి వాటికి దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్, మసాలా వంటకాలకు దూరంగా ఉండే ఒత్తిడి సమస్యను సగం వరకు అదుపులో ఉంచుకోవచ్చు.
- రాత్రి ఏడు గంటల తర్వాత ఏమీ తినకుండా ఉండటం మంచిది. ఒకవేళ తిన్నా తక్కువగా తినాలి. అలాగే ఆహారంలో ఉప్పు శాతం తగ్గించుకోవాలి.
- ప్రతిరోజు ఆరు లేదా ఏడు గంటలు నిద్ర పోవాలి. నిద్ర తగ్గితే ఏకాగ్రత లోపించడం, ఒత్తిడికి గురి కావడం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి సమయానికి నిద్ర పోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. ❄

ఇవి పాటించాల్సిందే!



ఇంట్లోనే చాలామంది తల వెంట్రుకలకు రంగు (హెయిర్‌డై) వేసుకుంటున్నారు. రంగు వేసుకునే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అనేక సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి రంగు వేసుకునేటప్పుడు జుట్టుకు హాని జరగకుండా ఆరోగ్యంగా ఉండే హెయిర్‌ప్యాక్ వేసుకుంటే మంచిది. రసాయనాలు లేని షాంపూలు ఎంచుకోవాలి. ముఖ్యంగా సల్ఫేట్ లేకుండా చూసుకోవాలి. సల్ఫేట్ వల్ల రంగు త్వరగా పోతుంది. అలాగే తరచూ తలస్నానం చేయడం కూడా సరికాదు. వారానికి రెండుసార్లు చేసుకుంటే మంచిది.

ప్రొటీన్లు అధికంగా ఉండే కండిషనర్లనే ఎంచుకోవాలి. ఇవి రంగు కోల్పోకుండా చూడటమే కాదు. జుట్టుకు బలాన్నిస్తాయి. దాంతో పాటు వెంట్రుకలను మృదువుగా మారుస్తాయి. కృత్రిమ రంగుల్ని వాడుతున్నప్పుడు డ్రయర్‌కు ఎంతదూరంగా ఉంటే అంత ఉత్తమం. తలస్నానం చేయడానికి ముందు తప్పనిసరిగా కొబ్బరినూనె రాసుకోవాలి. ఇది జుట్టుకు రంగు పట్టి ఉండేలా తోడ్పడుతుంది. జుట్టుకు రంగు వేసుకునేటప్పుడు చర్మానికి తగలకూడదు.

ముందుగా ముఖానికి, చెవులకు మాయిశ్చరైజర్, లేదంటే నూనె రాసుకొని తర్వాత డై వేసుకోవాలి. జుట్టు మంచి స్మెల్ రావాలంటే హెయిర్ సీరమ్, లేదంటే హెయిర్ స్ప్రేలు వాడాలి. అయితే ఈ సీరమ్స్, స్ప్రేలు మాడుకు, జుట్టు కుదుళ్లకు తగలకుండా జాగ్రత్తపడాలి. లేదంటే వీటిలో ఉండే గాఢ రసాయనాలు వెంట్రుక కుదురును దెబ్బతీసే అవకాశాలు ఉంటాయి. ❄



గుప్పెడు వేరుశనగతో...

గుప్పెడు పల్లీల్లో (వేరుశనగ) కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. వాటితో పాటు కొవ్వు శాతం కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. వేరుశనగ చాలా బలవర్ధకమైన ఆహారం. దీంట్లో విటమిన్ 'బి' సమృద్ధిగా ఉంటుంది. వేరుశనగ గింజలను నుంచి ఉత్పత్తి అయ్యే పదార్థాలు నూనె, పొడి, పాలు చాలా ఔషధాగుణాలను కలిగి ఉంటాయి. గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు గుప్పెడు వేయించిన పల్లీల్లో కొద్దిగా బెల్లం కలుపుకొని తింటే ఆరోగ్యంగా ఉంటారు. ఇవి మంచి యాంటీ బయోటిక్‌లా, టానిక్కులా పనిచేస్తాయి. పచ్చివేరుశనగ పప్పులో కొంచెం ఉప్పు కలిపి తింటుంటే పండ్లు గట్టిపడడమే కాకుండా దంతాలపైన ఉండే ఎనామిల్ పొర తరిగిపోకుండా కాపాడుకోవచ్చు. లావుగా ఉండేవారు ఆహారానికి ఒక గంట ముందుగా గుప్పెడు వేరుశనగపప్పులు తిని ఒక కప్పు కాఫీ గానీ టీ గానీ తాగితే ఆకలి మందగిస్తుంది. ఈ విధంగా ప్రతిరోజు చేస్తుంటే కొద్దికాలంలో శరీర బరువు తగ్గిపోతుంది. జీర్ణశక్తి సరిగ్గా లేని వారు పచ్చకామెర్లు ఉన్న వారు వైద్యుల సలహామేరకు వేరుశనగ గింజలు తీసుకుంటే మంచిది. ❄

బెలూన్ ఆర్ట్స్...



బెలూన్స్

రంగు రంగుల్లో ఉండే బెలూన్స్ చూడటానికి చాలా ముచ్చటగా కనిపిస్తాయి. పార్టీలకు, అకేషన్లకు, ఇంటి అలంకరణకు బెలూన్స్‌ను ఉపయోగిస్తారు. కాస్త గాలి నింపి ఇంటి గోడలకు అతికిస్తే చాలు ఇల్లు ఆకర్షణీయంగా, అద్భుతంగా కనిపిస్తుంది. ఇక బెలూన్స్‌తో తయారు చేసిన కళాకృతులు ఆశ్చర్యచకితులను చేస్తాయి. చాలామంది బెలూన్ పగిలిపోతే వృథాగా బయటపడేస్తారు. అలా కాకుండా వాటితో కూడా ఎన్నో అపూర్వమైన బొమ్మలను స్వయంగా తయారు చేసుకోవచ్చు.



డైనోసార్

డైనోసార్ : డైనోసార్‌ను చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. దాని కోసం నారింజ, తెలుపు రంగు బెలూన్స్, గమ్ ఉంటే సరిపోతుంది. బొమ్మలో చూపిన విధంగా వివిధ ఆకారాల్లో బెలూన్స్‌లో గాలి నింపుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత గమ్ సహాయంతో బొమ్మలో చూపిన విధంగా అతికించుకుంటే సరిపోతుంది.

చీమ : దీని కోసం నారింజ, నలుపు రంగు బెలూన్స్, గమ్, స్కెచ్ ఉంటే సరిపోతుంది. ముందుగా నారింజ రంగు బెలూన్‌ను పెద్దగా ఊది పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత చిన్నగా నలుపు రంగు బెలూన్స్‌ను ఊది బొమ్మలో చూపిన విధంగా అతికించుకోవాలి. ఇలా చేసిన తర్వాత చివరగా నారింజ రంగు బెలూన్ మీద నలుపు రంగు స్కెచ్‌తో రెండు గీతలు పొడవుగా గీసుకుంటే సరిపోతుంది.



సీతాకోక చిలుక

సీతాకోక చిలుక : సీతాకోక చిలుకను చాలా అందంగా, తయారు చేసుకోవచ్చు. దీని కోసం బ్లూ, పింక్ కలర్ బెలూన్స్‌ను సెలెక్టు చేసుకుంటే సరిపోతుంది. ముందుగా పొడవుగా ఉండే బ్లూ కలర్ బెలూన్‌ను బొమ్మలో చూపిన విధంగా జాగ్రత్తగా మడవాలి. ఆ తర్వాత పింక్ కలర్ బెలూన్‌తో బొమ్మను చేసి దాని మధ్య భాగంలో అతికించుకుంటే సరిపోతుంది. ఇది చూడటానికి చాలా అద్భుతంగా కనిపిస్తుంది.

బెలూన్స్‌తో : బెలూన్స్‌ను ఇంట్లో ఎన్నో విధాలుగా అలంకరించుకోవచ్చు. దీని కోసం ఐదు లేదా ఆరు రంగుల బెలూన్స్‌ను పెద్దగా ఊది పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత కొన్ని పేపర్ ప్లేట్స్ తీసుకొని వాటిని బొమ్మలో చూపిన విధంగా అమర్చుకుంటే సరిపోతుంది. ఇవి చూడటానికి డిఫరెంట్ స్టైల్స్‌లో కనిపిస్తాయి.



మిక్కీమౌస్

మిక్కీమౌస్ : మిక్కీమౌస్‌ను ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. దీని కోసం బూడిద, పసుపు, ఆకుపచ్చ రంగు బెలూన్స్ ఉంటే సరిపోతుంది. పొడవుగా ఉండే బూడిద రంగు బెలూన్ తీసుకొని బొమ్మలో చూపిన విధంగా చుట్టుకోవాలి. ఆ తర్వాత కింది భాగంలో ఆకుపచ్చ బెలూన్ అమర్చాలి. చివరగా చేతిలో లవ్ సింబల్ ఉన్న పసుపు రంగు బెలూన్‌ను ఊది పెడితే సరిపోతుంది.

గుర్రపు బండి : దీన్ని ఎంతో అందంగా తయారు చేసుకోవచ్చు. దాని కోసం బ్లూ, పింక్, రెడ్, తెలుపు రంగు బెలూన్స్ ఉంటే సరిపోతుంది. ముందుగా పొడవుగా ఉండే బ్లూ కలర్ బెలూన్‌ను ఊది అడ్డంగా పెట్టుకోవాలి. దాని పై భాగంలో పింక్ రంగు బెలూన్స్‌ను, రెడ్ కలర్ బెలూన్స్‌ను బొమ్మలో చూపిన మాదిరి అతికించుకుంటే చాలు ఎంతో అద్భుతమైన గుర్రపు బండి రెడీ! ❄

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సాకెర గ్రామంలో శనివారం జరిగింది. ఏఎస్సై గంగారెడ్డి వివరాల ప్రకారం... సాకెర గ్రామానికి చెందిన రాథోడ్ మోహన్(49)ను 2002లో కండక్టర్ ఉద్యోగం నుండి సస్పెండ్ చేయగా.. అప్పట్నుంచి ఆఫీసు, కోర్టు చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయాడు. ఫలితం లేకపోవడంతో తన తొమ్మిదెకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాడు. పంట ఏపుగా పెరిగినా తగినంత కాయలు కాయలేదు. గులాబీ పురుగు సోకి ఎకరానికి కనీసం రెండు క్వింటాళ్ల పత్తి కూడా దిగుబడి రాలేదు. వరుసగా నష్టాల పాలుకావడంతో అప్పులు తీర్చేమార్గం కనబడక మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుమారుడి చదువు కోసం బ్యాంకులో రూ.2.50లక్షలు, పంట కోసం టీజీబీ బ్యాంకులో రూ.3లక్షలు, ప్రయివేటు అప్పులు రూ.3లక్షల వరకు ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మధిరలో బాంబు కలకలం



నవతెలంగాణ- మధిర

భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉందన్న వార్త శనివారం ఖమ్మం జిల్లాలో కలకలం సృష్టిం చింది. రైల్లో అనుమానాస్ప దంగా ఉన్న వస్తువులను గుర్తించి ప్రయాణికులు టీసీకి ఫిర్యాదు చేయగా ఖమ్మం జిల్లా మధిర రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చేతి సంచిలో ఉన్న నీలిరంగు డబ్బాలను గుర్తించి వాటిని స్టేషన్‌లో దించి రైలును పంపారు. అనంతరం ఖమ్మం రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఖమ్మం స్టేషన్‌లో కోణార్క్ రైలును ఆపి అరగంట పాటు తనిఖీ చేశారు. ఖమ్మం డాగ్‌స్క్వాడ్ బృందం మధిర చేరుకుని పరీక్షించగా, పేలుడు పదార్థాలు ఉన్నాయన్న అనుమానం తలెత్తింది. దీంతో ఆ డబ్బాలను మధిర పట్టణానికి దూరంగా ఉన్న చెరువు ప్రాంతంలో ఉంచారు. అనంతరం హైదరాబాద్ బాంబ్‌స్క్వాడ్ బృందానికి సమాచారమిచ్చారు. అందులో బాంబు ఉన్నదీ, లేనిదీ ఆ బృందం తేల్చనుంది.

రమేశ్‌బాబు మృతికి ఫెడరేషన్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ పాత్రికేయులు, ఈనాడులో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన జి.రమేశ్‌బాబు మృతిపట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య సంతాపం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతి ద్వారా వృత్తిలోకి అరంగేట్రం చేసిన రమేశ్‌బాబు అనతికాలంలోనే మంచిపేరు తెచ్చుకున్నారని అభిప్రాయపడ్డారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో పనిచేసిన అనుభవం రమేశ్‌బాబు సొంతమని వివరించారు. వారి కుటుంబ సభ్యులకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సానుభూతిని తెలియజేస్తున్నదని అన్నారు.

మునిపల్లె రాజు మృతి పట్ల తెలంగాణ సాహితి సంతాపం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రముఖ సాహితివేత్త మునిపల్లె రాజుకు తెలంగాణ సాహితి సంతాపం తెలిపింది. ఆయన మరణం సాహితిలోకానికి తీరని లోటని సాహితి నేతలు భూపతి వెంకటేశ్వర్లు, రాంపల్లి రమేష్, మోహనకృష్ణ, తంగిరాల చక్రవర్తి, సలీమా, స్ఫూర్తి, యాదగిరిగిరావు పేర్కొన్నారు. కథలు, పుష్పాలు ప్రేమికులు-పశువులు దివ్యస్వప్నాలతో ముఖాముఖి వంటి కథా కృతులు ఆయన అందించారు. 1925లో గుంటూరు జిల్లా బాటప్ల తాలుకా గరికపాడు గ్రామంలో జన్మించిన మునిపల్లె రాజు సాహిత్యరంగంలో చేసిన సేవకుగానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతోపాటు పలు సత్కారాలు అందుకున్నారు.ఆయన కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాహితీ స్రవంతి సంతాపం

ప్రముఖ కథా రచయిత మునిపల్లె రాజు మృతికి సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది. తెలుగు కథకులలో భిన్నమైన శైలిలో తన ప్రత్యేకతను చాటుకున్నారని స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వొరప్రసాద్, సత్యరంజన్ పేర్కొన్నారు. మనుషుల భిన్న స్వభావాలను, అంతరంగ మనస్తత్వాలను వినూత్నంగా తన కథలలో చిత్రించి తెలుగు పాఠకులను అకట్టుకున్నారని తెలిపారు. ఒక మంచి కథకుడిని తెలుగు కథా ప్రపంచం కోల్పోయిందన్నారు. వారి కుటుంబానికి సాహితీ స్రవంతి తరుపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం

డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

- బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా కాళేశ్వరం : మండలి చైర్మెన్ స్వామి గౌడ్
- పంప్‌హౌజ్, బ్యారేజీ పనలు పరిశీలించిన ఎమ్మెల్సీల బృందం



ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న స్వామిగౌడ్, మహమూద్ అలీ

నవతెలంగాణ-ధర్మారం / మంథని టౌన్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు అద్భుతంగా జరుగుతున్నాయని, ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపుహౌజ్ నిర్మాణ పనులను శాసనమండలి చైర్మెన్ కె.స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి మహ్మద్ అలీతో కలిసి 40మంది ఎమ్మెల్సీల బృందం సందర్శించింది. అనంతరం అక్కడి నుంచి ఆరో ప్యాకేజీ పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లో జరుగుతున్న పంప్‌హౌజ్, సర్జ్‌పూల్, సొరంగం పనులను కలియతిరిగి చూశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మహమూద్ అలీ విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజినీర్ల పని తీరు అద్భుతమన్నారు. గోదావరి నీటిని మనం సమర్థవంతంగా వాడుకుంటే రైతుల కష్టాలు తీరుతాయని సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ సుమారు 38లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు బహుళార్థక సాధక ప్రాజెక్ట్ అని కొనియాడారు. ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు మహారాష్ట్ర అధికారులను ఒప్పించి అంతర్ రాష్ట్ర విబేధాలు లేకుండా ఒప్పందం కుదిర్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువరించడం సంతోషదాయకమన్నారు. ఏడాది పొడవునా 72 కిలో మీటర్ల మేర గోదావరి నది నిండుగా ఉండటంతో జల రవాణా కూడా సాధ్యమని, ఈ నిర్మాణం పూర్తయిన తరువాత రైతాంగానికి సాగు నీటి ఎద్దడి ఉండదన్నారు. కాళేశ్వరం బ్యారేజ్ చీఫ్ ఇంజినీర్ నల్లా వెంకటేశ్వర్లు మ్యాపుల ద్వారా పనుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్‌విప్ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకులు దివాళా

- మార్చిలో పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- బెఫీ జాతీయ ప్రధాన కార్యదర్శి బిశ్వాస్



సమావేశంలో మాట్లాడుతున ఎం.ఏ గఫూర్



సమావేశానికి హాజరైన ప్రతినిధుల్లో ఒక భాగం

అమరావతి : కేంద్రప్రభుత్వం తీసుకురానున్న ఫైనాన్షియల్ రిజాల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్ఆర్‌డిఐ) బిల్లు వల్ల బ్యాంకులు నష్టపోతాయని, ప్రభుత్వ రంగ బ్యాంకులు దివాళా తీసే పరిస్థితి వస్తుందని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 12వ జాతీయ సమావేశాలు శనివారం నుంచి విజయవాడలో ఎంబి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు రుణాలు వసూలు చేసేందుకు అవసరమైన చట్టాలు చేసి బ్యాంకులను, బ్యాంకు ఖాతాదారులను రక్షించాల్సింది పోయి, దానికి విరుద్ధమైన ఎఫ్ఆర్‌డిఐ బిల్లుని తీసుకొస్తోందని తెలిపారు. ఈబిల్లు వల్ల డిపాజిటర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆ భయంతో ప్రజలు ఇప్పటికే బ్యాంకుల్లో డబ్బులు దాచుకోవడం లేదని, ఉన్న వాటిని విత్‌డ్రా చేసుకుంటున్నారని చెప్పారు. దివాళా తీసినా ప్రైవేట్ బ్యాంకుల ఖాతాదారులను ప్రభుత్వ రంగ బ్యాంకులు కాపాడాయని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో కొంతకాలంగా మొండిబాకీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2017 డిసెంబర్ నాటికి రూ.10 లక్షల కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. ఇది మొత్తం బ్యాంకు రుణాల్లో సుమారు 10 శాతమని చెప్పారు. మొండి బకాయిల్లో 80 శాతం పైగా కార్పొరేట్ కంపెనీలు చెల్లించాల్సినవేనని పేర్కొన్నారు. మొండిబాకాయిల లిస్టును సుప్రీంకోర్టు అడిగినా, పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తినా బయట పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. మరోపక్క బకాయిల ఎగవేతదారులపై ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో మార్చిలో పార్లమెంట్ ఎదుట ఒక రోజు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు కె కృష్ణన్, , డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగన్ రాజు, సలహాదారు తపాన్ దాస్ పాల్గొన్నారు.


ఎఫ్ఆర్‌డిఐ బిల్లు శిక్షే : గఫూర్

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ప్రజలకు శిక్షేనని, పేదల సొమ్మును కార్పొరేట్ల పరం చేసేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్ అన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 12వ జాతీయ మహాసభ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేదల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పనిచేయడం లేదని విమర్శించారు. రాయితీల పేరుతో ప్రజాధనాన్ని ప్రయివేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని, ప్రజల కష్టాలకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలు ఏ ఒక్క ప్రభుత్వమూ ఆలోచించడం లేదని తెలిపారు. కార్మిక ఉద్యమాలతో పాటు జాతి ఐక్యత, ప్రాథమిక హక్కుల కోసం పోరాడాలని కోరారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు: వెంకట్రామయ్య

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును వ్యతిరేకించాలని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగుల ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా మహాసభలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అన్ని సంస్థలనూ ప్రయివేటీకరించడంలో భాగంగానే ఎఫ్ఆర్‌డిఐ బిల్లును తీసుకొచ్చారన్నారు. ఆర్బీఐ అధికారాలను కాలరాసే విధంగా ఈ బిల్లు ఉందని, అధికారం మొత్తం ఒక కమిషన్ చేతిలో పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఐబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి సరంజిత్ గోష్ సభలో ముందుగా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభల ప్రారంభ కార్యక్రమంలో ఐబిఇఎఫ్ గౌరవ సలహాదారు తపన్‌దాస్, ప్రధాన కార్యదర్శి బిశ్వాస్, సభాధ్యక్షులు కృష్ణన్, ఎల్ఐసి మహిళా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎం కామేశ్వరి, ఎపిఎంఎస్ఆర్‌యు ప్రధాన కార్యదర్శి యు.వి.కృష్ణయ్య, ఐసిఇఎల్ ఉపాధ్యక్షులు సిహెచ్ కళాధర్ పాల్గొన్నారు.

సీమ న్యాయవాదులతో చర్చించండి..



అమరావతి: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న న్యాయవాదులతో సంప్రదింపులు జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు కోరారు.

ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ నెల రోజులుగా న్యాయవాదులంతా ఐక్యంగా ఆందోళన చేస్తున్నారని వివరించారు.

వారికి మద్దతుగా యువతీ, యువకులు, వివిధ ప్రజా సంఘాలు, ప్రజలు ఆందోళనల్లో పాల్గొంటున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించకుండా

సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ

ఈనెల 22న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాయలసీమ జిల్లాలన్నింటి ల్లోనూ న్యాయవాదులు, ప్రజాసంఘాలు, వామ పక్షాల నాయకులను అరెస్టులు చేయడం ఏమాత్ర మూ సమంజసం కాదని పేర్కొన్నారు. రాయలసీ మలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న న్యాయవాదులతో వెంటనే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఓరియంటల్ బ్యాంక్‌కు మరో నగల వ్యాపారి కుచ్చుటోపీ

- రూ.389.85 కోట్ల మేర రుణాల ఎగవేత
- గత ఏడాదే విదేశాలకు చెక్కేసిన నగల వ్యాపారి
- ఫిర్యాదు చేసిన ఆరునెలలకు సిబిఐ కేసు నమోదు

న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నిరవ్ మోడి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసు ఒక కొలిక్కి రాకముందే మరో వజ్రాల నగల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబిసి) ను మోసగించిన ఉదంతం వెలుగు చూసింది. దీనికి సంబంధించి సిబిఐ శుక్రవారం కేసు నమోదు చేసింది. ఓబిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రాల నగల ఎగుమతి కంపెనీపైనా, దాని డైరెక్టర్లపైన కేసు నమోదు చేసింది. కరోల్‌బాగ్‌కు చెందిన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల నగల ఎగుమతి కంపెనీ రూ.389.85 కోట్ల మోసానికి పాల్పడిందని ఆ బ్యాంకు ఫిర్యాదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ కంపెనీ వజ్రాలు, బంగారం, వెండి నగలను తయారు చేసే వ్యాపారం చేస్తోంది. ఈ మోసానికి సంబంధించి దాదాపు ఆరు నెలల క్రితమే ఓబిసి సిబిఐకి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన ఆరు నెలల తరువాత సిబిఐ కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ కంపెనీ డైరెక్టర్లుగా ఉన్న సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణ కుమార్ సింగ్, రవిసింగ్‌లపై సిబిఐ కేసు నమోదు చేసింది. వీరికి చెందిన రెండో కంపెనీ ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్‌ను కూడా ఈ కేసులో చేర్చింది. ఈ మోసానికి సంబంధించి అంతర్గత విచారణలో నిందితులు విదేశాలు పారిపోయినట్లు తేలడంతో ఓబిసి 2017లో సిబిఐని ఆశ్రయించింది. లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌పై ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ కంపెనీ రుణాలు తీసుకున్నదని ఓబిసి తన ఫిర్యాదులో పేర్కొంది. 2007-2012 సంవత్సరాల మధ్య బంగారు నగల ఎగుమతి, దిగుమతి కోసం ఇతర మార్గాలలో కూడా రుణాలు తీసుకున్నట్లు ఓబిసి తెలిపింది. కాని వాటిని తిరిగి చెల్లించడంలో విఫలమవ్వడంతో ఆ రుణాలను 2014లో నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు.

ప్రసిద్ధ కథకుడు మునిపల్లె రాజు కన్నుమూత

హైదరాబాద్: తెలుగు కథను సుసం పన్నం చేసిన ప్రసిద్ధ కథకుడు మునిపల్లె రాజు (93) ఇకలేరు. ఆయన రచయిత, కవి, వ్యాసకారుడు. హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లోని తన స్వగృహంలో ఆయన కన్నుమూశారు. ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం, మునిపల్లె. అయితే ఆయన కాకమాను మండలం గరికపాడులో 1925, మార్చి 16న జన్మించారు. ఆయన తండ్రి హనుమంతరావు తల్లి శారదమ్మ. చిన్నప్పటి నుంచి కథా సాహిత్యంపై మక్కువ పెంచుకున్న మునిపల్లె రాజు 1943 నుండి 1983 వరకు భారత ప్రభుత్వ రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయర్‌గా ఉద్యోగం చేశారు. ఆయన మొత్తం 69 కథలు రచించారు. 'అస్తిత్వనదం ఆవలి తీరాన'; 'దివోస్వప్నాలతో ముఖాముఖి'; 'పుష్పాలు - ప్రేమికులు - పశువులు'; 'మునిపల్లె రాజు' పేరుతో నాలుగు కథా సంకనాలు వెలువరించారు. 'అలసిపోయినవాడి అరణ్యకాలు'; 'వేరొక ఆకాశం వేరెన్నో నక్షత్రాలు' పేరుతో రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. రచయితలు, కవుల మీద ఆయన రాసిన సాహిత్య వ్యాసాలతో రెండు పుస్తకాలు వెలువరించారు. 'జర్నలిజంలో సృజనరాగాలు'; 'సాహితీ మంత్రనగరిలో సుస్వరాలు' అనేవే అవి. ఆయన రాసిన 'పూజారి' నవలనే 'పూజాఫలం' పేరుతో సినిమాగా బి.ఎన్.రెడ్డి వెండితెరకు ఎక్కించారు. 'అస్తిత్వనదం ఆవలి తీరాన' అనే చిన్న కథకు ఆయన 2006లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. అదే కథకు 2004లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం వచ్చింది. అదే ఏడాది గోపిచంద్ పురస్కారం కూడా అందుకున్నారు. ఇలా ఆయనను ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. తెలుగులో మేజిక్ రియలిజంలో మొదటగా రాసిన రచయిత కూడా మునిపల్లె రాజే.

ఐటీ లో నూతన ఒరవడికి గాను

- రాష్ట్ర పోలీసులకు ఎన్‌సీఆర్‌బీ టోఫీ : డీజీపీ హర్షం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ(ఐటీ)లో నూతన ఒరవడిని సృష్టించింది. టీఎస్‌కాప్స్ యాప్‌ను రూపొందించినందుకు గాను నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) ట్రోఫీని సాధించింది. ఈ అవార్డును 2017 సంవత్సరానికి గాను రాష్ట్ర పోలీసు శాఖకు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించడం, ఐటీలో నూతన పోకడలతో ప్రజలకు మరింతగా పోలీసు శాఖలు సేవలందించాలనే లక్ష్యంతో ఇందులో అత్యుత్తమంగా నిలిచే పోలీసు శాఖకు ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీని 2016 నుంచి ప్రకటిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర పోలీసు శాఖలో వినూతనంగా అందుబాటులోకి తీసుకు వచ్చిన టీఎస్‌కాప్స్ యాప్‌తో సాధారణ కానిస్టేబుల్ మొదలుకుని డీజీపీ స్థాయి అధికారి వరకు సమన్వయం చేసేలా టీఎస్‌కాప్స్‌ను యాప్‌ను రూపొందించడాన్ని కేంద్ర హోంశాఖ ప్రశంసించింఇ. ఐటీ టెక్నాలజీకి సంబంధించి గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్,ఉత్తరఖండ్,ఏపీ తో పాటు తెలంగాణ రాష్ట్రాలు పోటీ పడుతు ఈనెల 9వ తేదీన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఎన్‌సీఆర్‌బీ ప్రత్యేక జ్యూరీ ముందు ఇచ్చాయి. దీనిని పరిశీలించిన జ్యూరీ తెలంగాణ పోలీసు శాఖ ప్రదర్శించిన టీఎస్‌కాప్స్ యాప్‌ను ఏకగ్రీవంగా ఎంపికి చేసింది. ఈ యాప్ ద్వారా క్రింది స్థాయి కానిస్టేబుల్ మొదలుకుని ఇన్‌స్పెక్టర్ వరకు వివిధ కేసుల విచారణ సందర్భంగా అవసరమైన సపోర్టును ఈ యాప్ ద్వారా వెంటనే తీసుకోవడానికి వీలవుతుందని, తద్వారా దర్యాప్తు సమగ్రంగా, సరైన దిశలో సాగడానికి వీలవుంతుందన్నా విధానం ఎన్‌సీఆర్‌బీని ఆకర్షించింది. అలాగే ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రోజువారిగా నమోదైయ్యే నేరస్తుల సమాచారం వెంటనే ఈ యాప్‌లో అప్‌డేట్ చేయడం, ఇతర నేరసుత్ల గురించి వెంటనే ఈ యాప్ ద్వారా దర్యాప్తు అధికారులు వెంటనే పొందడానికి ఆస్కారం ఏర్పడటం , అదే సమయంలో ఘటనా స్థలానికి ఎంత సేపట్లో స్థానిక పోలీసులు చేరుకున్నారనే సమాచారాన్ని కూడా ఈ యాప్ తో ఉన్నతాధకారులు వెంటనే తెలుసుకోవడం, అనూహ్యంగా ఏర్పడే శాంతి భద్రతల సమస్యపై వెంటనే ఉన్నతాధకారులు స్పందించి, క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే తగిన నివారణ చర్యలు తీసుకోవడానికి ఈ యాప్ ఉపయోగ పడటాన్ని కేంద్ర హోంశ్ఖాఖ సైతం ప్రశంసించింది. కాగా 2016 తో పాటు 2017లోనూ ప్రతిష్టాకరమైన ఎన్‌సీఆర్‌బీ అవార్డు రాష్ట్ర పోలీసు శాఖకు దక్కడం సంతోషంగా ఉందని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి శనివారం అన్నారు. ఇక ముందు కూడా ఈ యాప్‌ను మరింతగా పటిష్ట పరచడం, నేర నియంత్రణకు అవసరమైన కొత్త సాఫ్ట్ వేర్‌లను దీనికి అనుసంధానం చేయడానికి తమ కృషి కొనసాగుతుందని అన్నారు. ఈ అవార్డును ఈనెల 28న చెన్నైలో జరిగే అఖిల భారత పోలీసు డ్యూటీమీట్ ముగింపు సభలో కేంద్ర హోంమంత్రి ప్రధానం చేస్తారని ఆయన తెలిపారు.

పదుల సంఖ్యలో రోహింగ్యా గ్రామాలు నేలమట్టం

నెపిడా : డజన్ల కొద్దీ రోహింగ్యా గ్రామాలను మయన్మార్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఉత్తర రాఖినె రాష్ట్రంలో గతంలో రోహింగ్యాలు నివసించిన పలు గ్రామాలు ఖాళీగా వున్నాయి. ఆ గ్రామా లన్నీ పూర్తిగా నేలమట్టమైనట్లు ఆ చిత్రాల ద్వారా వెల్లడవు తోంది. ఆ గ్రామాల్లోని భవనాలు, పొలాలు, చెట్లు అన్నిటినీ ధ్వంసం చేశారు. కొలరాడోకి చెందిన డిజిటల్ గ్లోబ్ ఈ చిత్రాలను మీడియాకు విడుదల చేసింది. గతంలో జరిగిన దానికన్నా ఎక్కువగా ఈ విధ్వంసం వున్నట్లు వెల్లడవుతోంది. గతేడాది ఆగస్టులో ఉత్తర రాఖినె రాష్ట్రంలో చెలరేగిన హింసాకాండతో లక్షలాదిమంది రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. కాగా ఈ ప్రాంతాన్నంతటినీ పునర్నిర్మించేందుకే గ్రామాలను ధ్వంసం చేశామని ప్రభుత్వం చెబుతోంది. అయితే గతంలో హింస, అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకున్న ప్రాంతాలనే ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేసిందని, ఆ హింసపై అక్కడ దర్యాప్తు జరిగేలోగా సాక్ష్యాధారాలను సమూలంగా నిర్మూలించేందుకే ఈ చర్య తీసుకుందని మానవ హక్కుల గ్రూపులు పేర్కొంటున్నాయి. బుల్‌డోజర్లు, ఇతర యంత్రా లతో 28గ్రామాలను నేలమట్టం చేశారు. మంగ్డా చుట్టుపక్కల 50కిలోమీటర్ల పరిధిలో డిసెంబరు, ఫిబ్రవరి మాసాల మధ్య ఈ విధ్వంసం చోటు చేసుకుంది. అలా చదును చేసిన ప్రాంతాల్లో కొన్ని చోట్ల కొత్త భవనాలు, నిర్మాణాలు, హెలిపాడ్లు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు 55 గ్రామాలు నేలమట్టమయ్యాయని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ తెలిపింది. అక్కడ చెట్లుచేమలు లేవు, భవనాలు లేవు, ప్రతీదాన్ని తుడిచిపెట్టేశారు. ఇవన్నీ కూడా నేరం జరిగిన ప్రాంతాలు కావడంతో ప్రస్తుత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని మానవ హక్కుల నిపుణులు పేర్కొన్నారు. ఇది న్యాయాన్ని అడ్డుకోవడమే కాగలదని వ్యాఖ్యానించారు. కాగా తమ సంస్కృతిని నాశనం చేశారని రోహింగ్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ మిగిలిన వాటిని నాశనం చేసి తిరిగి మయన్మార్‌కు రాకుండా చేశారని విమర్శిస్తున్నారు.

గురుకుల టీజీటీ ఫలితాలు విడుదల

- 6 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ గురుకుల విద్యాలయాల్లో ప్రకటించిన పోస్టులకు నిర్వహించిన మెయిన్స్ రాతపరీక్ష ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శనివారం విడుదల చేసింది. రెండో విడత ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన 1:2 నిష్పత్తి చొప్పున అభ్యర్థుల వివరాలను వెల్లడించింది. ధ్రువపత్రాల పరిశీలన వచ్చేనెల 6 నుంచి 9వ తేదీ వరకు జరుగుతుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని కోరారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబర్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. బయలాజికల్ సైన్స్‌కు 50 మంది, మ్యాథమెటిక్స్‌కు 128 మంది, ఫిజికల్ సైన్స్‌కు 161 మంది, సైన్స్‌కు 55 మంది, సోషల్ స్టడీస్‌కు 149 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏండ్లకు పెంచాలి

- ఉన్నత విద్య గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగ విరమణ వయస్సును 60 ఏండ్లకు పెంచాలని తెలంగాణ ఉన్నత విద్య గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం లక్ష్మారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా 11వ పీఆర్సీని జూన్ 2 నుంచి అమలు చేయాలని కోరారు. గ్రాట్యూటీని రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని సూచించారు. జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 20 శాతం హెచ్‌ఆర్‌ఏను ఎత్తివేసి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చేదాన్ని వర్తింపచేయాలని కోరారు. గెజిటెడ్ అధికారులకు కన్వెయన్స్ అలవెన్సులు రూ.4 వేలు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యో గులకు ఇస్తున్నట్టుగా ఎల్‌టీసీ సౌకర్యం కల్పించాలని కోరారు. రిటైర్డ్ అయిన స్థానికులకు తెలంగాణ ఇంక్రిమెంట్ వర్తింపచేయాలని తెలిపారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్‌ను 5/10/15 ఏండ్లుగా మార్చాలని కోరారు. అర్హులైన ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తెలిపారు.

'బస్సు యాత్ర' విజయవంతం కోసం కమిటీలు

ప్రకటించిన టీపీసీసీ

- భట్టి నేతృత్వంలో సలహా సంఘం
- ఆర్గనైజింగ్ కమిటీ చైర్మెన్‌గా షబ్బీర్ అలీ
- ఆర్థిక కమిటీకి గూడూరు
- మీడియా కమిటీకి మల్లు రవి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న 'ప్రజా చైతన్య బస్సుయాత్ర' విజయవంతం కావడానికి టీపీసీసీ నాలుగు కమిటీలను నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి నేతృత్వంలో 26 నుంచి 'ప్రజా చైతన్య బస్సుయాత్ర' పేరుతో బస్సు యాత్రను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ యాత్ర నిర్వహణ కోసం ఆయన నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సలహా సంఘంలో పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే చిన్నారెడ్డి, మధు యాష్కిగౌడ్, ఎంపీ నంది ఎల్లయ్య, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, పీఏసీ చైర్మెన్ గీతారెడ్డి, ఎమ్మెల్యే డి.కె అరుణ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, ఇ.అనిల్, లక్ష్మారెడ్డి, పి.విజయ కుమార్, కిసాన్ సెల్ చైర్మెన్ కోదండరెడ్డి ఉన్నారు. టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి చైర్మెన్‌గా ఆర్థిక కమిటి ఏర్పడింది. సభ్యులుగా గడ్డం ప్రసాద్, జగదీశ్వర్‌రావు, బిక్షపతి యాదవ్, బి. కైలాష్, ఫహీమ్, ఎన్.శరత్‌రెడ్డి, సయ్యద్ సాజిద్ పాషా, మామిడి గోపిలను నియమించారు.

టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి చైర్మెన్‌గా మీడియా కమిటీ ఏర్పాటు చేసింది. సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, దాసోజు శ్రవణ్, కొనగాల మహేశ్, హర్షవర్ధన్ రెడ్డి, కమలాకర్ రావు, సుధాకర్ గౌడ్,ఎబి శ్రీనివాస్, తిరుమలగిరి సురేందర్, సుజాత్ అలీ, హనుమంతరావు, సునీతారావు, ఇందిరాశోభన్, రమ్యారావు, కైలాష్‌నేత, శ్యామ్‌మోహన్, కిరణ్ యాదవ్, బొజ్జా సంధ్యారెడ్డిలను సభ్యులుగా నియమించారు. మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. కో చైర్మెన్‌గా మాజీ మంత్రి దానం నాగేందర్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు కన్వీనర్‌తోపాటు పలువులు సభ్యులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే చైతన్య యాత్ర : మల్లు రవి

కేసీఆర్ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే తాము ప్రజా చైతన్య బస్సుయాత్ర చేపట్టామని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి తెలిపారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణ నేడు రెండు లక్షల కోట్ల అప్పులు ఊబిలో కూరుకుపోయి అప్పుల రాష్ట్రంగా మారిపోయిందన్నారు.

అబద్ధాల్లో కేసీఆర్ దిట్ట: పొన్నం

అబద్ధాలు చెప్పడంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మించిన వారు లేరని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఇందుకు పద్మ అవార్డుల సిఫారసులే సాక్ష్యమన్నారు. కేంద్రానికి సిఫారసు చేసిన పేర్లలో ప్రముఖులు లేరన్నారు. పివి నర్సింహారావు, ప్రొఫెసర్ కె జయశంకర్, అందెశ్రీ, చుక్కా రామయ్య పేర్లు లేకున్నా సిఫార్సు చేసినట్టు ప్రచారం చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

ఓట్లు తొలగింపుపై విచారణ జరిపించాలి: మర్రి శశిధర్‌రెడ్డి

పంచాయతీ ఉపఎన్నికలకు ముందే తమకు అనుకూలంగా లేని వారి ఓట్లను కేసీఆర్ సర్కారు తొలగింప చేసిందని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఈమేరకు శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ తొలగింపుపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దంతానిపల్లిలో 2701 ఓట్లు ఉండగా అందులో 742 ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల సంఘంతో పాటు, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని తెలిపారు.

కొలిక్కిరాని చర్చ !

- సిరియాలో కాల్పుల విరమణపై భద్రతా మండలిలో చర్చలు


డమాస్కస్ : సిరియాలో అంతర్యుద్ధం వందలాది అమాయక ప్రజల ప్రాణాల్ని తీస్తోంది. ఘౌతా ప్రాంతంలో సైనికులకు, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న పోరులో మృతుల సంఖ్య 470కు చేరుకుంది. ఈనేపథ్యంలో సిరియాలో అన్ని పక్షాలవారూ కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితిలో కువైట్, స్వీడన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనికి సంబంధించి భద్రతా మండలిలో శాంతి చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. 30రోజులపాటు కాల్పులవిరమణ పాటించాలని మండలి తీర్మానం పేర్కొన్నది. ఈ తీర్మానంపై అమెరికా, రష్యాలు ఇంకా ఒక అంగీకారానికి రాలేకపోయాయి. తీర్మానంపై ఓటింగ్ చేపట్టడం కోసం ఐరాస వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

గతవారం రోజులుగా డమాస్కస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో జరుగుతున్న భీకర పోరు కారణంగా వందలామంది అమాయక పౌరులు మరణించారు. ఇందులో 150మంది దాకా చిన్నారులున్నారని బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల పర్యవేక్షణ సంస్థ వెల్లడించింది. సైనిక దాడుల వల్ల 2330 మందికి తీవ్రగాయాలయ్యాయి. అంతేగాక వేలాదిమంది సురక్షితప్రాంతాలకు శరణార్థులుగా వలస వెళ్లాల్సి వచ్చింది. పదుల సంఖ్యలో చిన్నారులు గల్లంతయ్యారు.


ఫైల్

గన్ లాబీకి వ్యతిరేకంగా ఉద్యమం

- రైఫిల్ అసోసియేషన్‌కు సేవలు రద్దు : పలు సంస్థలు ప్రకటన
- అమెరికాలో కాల్పుల ఘటనలపై సర్వత్రా ఆగ్రహం



వాషింగ్టన్ : ఇటీవల ఫ్లోరిడా పాఠశాలలో చోటుచేసుకున్న తుపాకీ కాల్పుల ఘటన అమెరికా సమాజాన్ని తీవ్ర భయభ్రాంతులకు లోనుచేసింది. తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా పలు నగరాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గన్ లాబీకి (నేషనల్ రైఫిల్ అసోసియేషన్-ఎన్‌ఆర్‌ఏ) వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. సేవా రంగంలోని వివిధ సంస్థలు ఎన్‌ఆర్‌ఏతో సంబంధాల్ని రద్దుచేసుకుంటున్నామని ప్రకటిస్తున్నాయి. కార్లను అద్దెకు ఇచ్చే కంపెనీలు, హోటల్స్, వివిధ బ్యాంకులు ఎన్‌ఆర్‌ఏ సభ్యులతో నెలకొన్న సంబంధాల్ని రద్దుచేసుకుంటున్నాయి. రైఫిల్ అసోసియేషన్ సభ్యులకు ఇస్తున్న ప్రత్యేక ఆఫర్లను, డిస్కౌంట్లను రద్దు చేశాయి.

అమెరికా రాజకీయాల్ని, ప్రభుత్వాల్ని శాసించే స్థాయిలో గన్ లాబీ విస్తరించిన విషయం తెలిసిందే. గన్ లాబీ కారణంగానే దేశంలో తుపాకీ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. దీనివల్లే దేశంలో విచక్షణారహితంగా తుపాకీ కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తుపాకీ వాడకంపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించాలని చూసినప్పుడల్లా గన్ లాబీ అడ్డుపడుతోంది. కొద్ది రోజుల క్రితం ఫ్లోరిడాలో డగ్లస్ హైస్కూల్‌లో 19 ఏండ్ల యువకుడు సెమీ ఆటోమెటిక్ తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. దీంతో 17 మంది అమాయక చిన్నారులు, ఉపాధ్యాయులు దుండగుడి తూటాకు బలయ్యారు.

ఈ ఘటన అనంతరం వివిధ నగరాల్లో తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. తుపాకీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ట్రంప్ సర్కార్‌పై ఒత్తిడి వస్తోంది. సామాజికమాధ్యమంలో 'హ్యాష్‌ట్యాగ్‌బాయ్‌కాట్ ఎన్‌ఆర్‌ఏ' ఉద్యమాన్ని అమెరికన్లు ప్రారంభించగా, పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. ఈనేపథ్యంలో జాతీయ రైఫిల్ అసోసియేషన్ (ఎన్‌ఆర్‌ఏ) సభ్యులతో సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని పలు సంస్థలకు నిరసనకారులు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో కార్లను అద్దెకు తిప్పే కంపెనీ 'హెర్జ్', 'బడ్జెట్', ఫస్ట్ నేషనల్ బ్యాంక్, మెట్ లైఫ్ ఇన్సూరెన్స్...తదితర సంస్థలు ఎన్‌ఆర్‌ఏతో నెలకొన్న సంబంధాల్ని రద్దుచేసుకున్నాయి. అలాగే ప్రఖ్యాత సంస్థలు ఫెడ్‌ఎక్స్, అమెజాన్‌లు కూడా ఎన్‌ఆర్‌ఏకు సేవల్ని నిలిపివేస్తున్నామని ప్రకటించాయి. మరోవైపు తమకు వ్యతిరేకంగా జరుగుతున్న 'బాయ్‌కాట్' ఉద్యమంపై ఎన్‌ఆర్‌ఏ ఇంతవరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు.



'డ్రగ్ వార్' ఆపండి...

మనీలా : మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్‌లో అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టో అనుసరిస్తున్న విధానంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన చేపట్టిన 'డ్రగ్ వార్'లో వేలాది మందిని పోలీసులు, భద్రతా బలగాలు నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తున్నాయి. మాదక ద్రవ్యాల్ని సరఫరా చేస్తున్నారని, వాడుతున్నారని...ఆరోపణలతో అనేకమందిని ప్రభుత్వం నిర్బంధిస్తోంది. ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యవాదులు, హక్కుల కార్యకర్తలు అధ్యక్షుడు డ్యూటెర్టో తీరును నిరసిస్తూ రాజధాని మనీలాలో శనివారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిపారు.

సైనికులే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు

- ఆఫ్ఘాన్‌లో 25 మంది మృతి, అత్యధికులు సైనికులే..



కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లో సైనికులే లక్ష్యంగా పలు చోట్ల శనివారం తెల్లవారుజామున ఆత్మాహుతి బాంబుదాడులు జరిగాయి. వాయువ్య ప్రాంతంలోని ఫారా ప్రావిన్స్‌లో జరిగిన భీకర ఆత్మాహుతి దాడిలో 22 మంది సైనికులు, రాజధాని కాబూల్‌కు సమీపంలో జరిగిన బాంబు దాడిలో మరో ముగ్గురు చనిపోయారు. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారని ఆఫ్ఘనిస్తాన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ ఆత్మాహుతి దాడులన్నీ తీవ్రవాద సంస్థ తాలిబాన్ జరిపిందని సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌లో తీవ్రవాదాన్ని అంతమొందిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించాక, దేశంలో తీవ్రవాద దాడులు మరింతగా పెరిగాయి.

ముఖ్యంగా సైనిక స్థావరాల్ని లక్ష్యంగా చేసుకొని తాలిబాన్ ఆత్మాహుతి దాడులకు తెగబడుతోంది. తద్వారా అమెరికాకు పరోక్షంగా సవాల్ విసురుతోందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొదట కాబూల్‌లో అమెరికా దౌత్యకార్యాలయానికి సమీపంగా తీవ్రవాదులు ఆత్మాహుతి దాడికి దిగారు. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. పేలుడు ధాటికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్ల అద్దాలు సైతం పగిలిపోయాయంటే, ఎంత పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు వాడారో ఊహించుకోవచ్చునని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు తెలియజేశారు. ఫారా ప్రావిన్స్‌లో బాలా బౌక్ జిల్లాలోని ఆర్మీ చెక్‌పోస్ట్ వద్ద జరిగిన తీవ్రవాద దాడిలో పెద్ద సంఖ్యలో సైనికులు చనిపోయారు. దేశంలోని పలు ప్రాంతాలు ఇప్పటికీ తాలిబాన్ ఆధీనంలో ఉన్నాయి. వీటిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కోసం ఆఫ్ఘాన్ ఆర్మీ, నాటో దళాలు సంయుక్తంగా తీవ్రవాద ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. అయితే దేశంలో రోజు రోజుకీ శాంతిభద్రతలు దిగజారుతున్నాయి. ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక, ఇక్కడికి 3వేల అదనపు సైనిక బలగాలను పంపారు.

ఉ.కొరియాపై మరిన్ని కఠిన ఆంక్షలు

- డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- ఆ దేశ వాణిజ్యంపై అధిక ప్రభావం



వాషింగ్టన్: ఉ.కొరియాపై అమెరికా మరోమారు విద్వేషాన్ని వెళ్లగక్కింది. జగడాలతో ఓ వైపు రెచ్చగొడుతూనే, ఆంక్షలతో ఉ.కొరియాను ఆర్థికంగా దెబ్బకొట్టే ప్రణాళికకు అమల్లో పెట్టింది. ఇంతకముందు ఎన్నడూ ఏ దేశం మీద విధించని అత్యంత కఠినమైన ఆంక్షలను ఉత్తరకొరియా మీద విధిస్తున్నట్టు స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. శుక్రవారం వాషింగ్టన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉ.కొరియాపై భారీగా ఆంక్షలు విధిస్తున్నట్టు తెలిపారు. "ఇప్పటి వరకు ఏ దేశం మీదా విధించని అత్యంత కఠినమైన ఆంక్షలను ఉత్తరకొరియాపై విధిస్తున్నా"మని ట్రంప్ మీడియా ముఖంగా వెల్లడించారు. ఉ.కొరియాకు చెందిన 56 నౌకలు, షిప్పింగ్ కంపెనీలు, ఇతర కార్యకలాపాలపై ఈ ఆంక్షలు అమలుకానున్నాయి. సరికొత్త ఆంక్షల ద్వారా ప్యాంగ్యాంగ్ నుంచి నిషేధం విధించిన ఆయుధాలను సరఫరా చేసే నౌకలు, అక్రమంగా బొగ్గు, ఇంధన రవాణా చేస్తున్న నౌకలను అడ్డుకోని వాటిని స్వాధీనం చేసుకోవచ్చు. దీని వల్ల ఆ దేశ వాణిజ్యంపై అధిక ప్రభావం పడుతోంది.

ఆంక్షలు ఉల్లంఘించారో...అంతుచూస్తాం : అమెరికా

అమెరికా ఆంక్షలు కాదని ఎవరైనా ఉత్తరకొరియాతో వాణిజ్య, వ్యాపార లావాదేవీలు జరపాలని చూసిన దేశాలతో యూఎస్ వ్యాపారాలను తెగదెంపులు చేసుకుంటుందని ట్రంప్ హెచ్చరించారు. ఒకవేళ ఆంక్షలు విధించినప్పటికీ.. ప్యాంగ్యాంగ్‌లో ఎటువంటి మార్పు రాకపోతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు మరింత భయంకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సముద్ర మార్గం ద్వారా ఆ దేశం చేస్తున్న వ్యాపారాలను అడ్డుకట్ట వేసేందుకు ఈ ఆంక్షలు విధించినట్టు యూఎస్ వెల్లడించింది. దీనిపై శ్వేతసౌధం ప్రతినిధి సారా శాండర్స్ స్పందించారు. ఇటువంటి ఆంక్షలు పెట్టడం వల్ల ఉత్తర కొరియాలో మార్పులు వచ్చే అవకాశం ఉందని ఆమె అన్నారు. ఇప్పటికే ఉ.కొరియా మీద పలు వాణిజ్య, ఆర్థిక పరమైన ఆంక్షలు ఉన్నాయి. ఆ దేశం నుంచి ఎగుమతయ్యే శుద్ధి చేయబడిన పెట్రోలియం ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి గతంలో ప్రకటించింది. గతేడాది వరుస క్షిపణి ప్రయోగాలతో ఉత్తరకొరియా రెచ్చిపోయింది. అమెరికా మీద క్షిపణి ప్రయోగం చేసి ఆ దేశాన్ని నాశనం చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఉ.కొరియా, అమెరికా అధ్యక్షుల మధ్య తీవ్ర మాటల యుద్ధమే నడిచింది.

బీసీలకు రెండు రాజ్యసభ సీట్లు ఇవ్వాలి

- తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజ్యసభ స్థానాల్లో బీసీలకు రెండు సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. బీసీల్లోని యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి ఒక రాజ్యసభ సీటు కేటాయిస్తామని సీఎం కేటీఆర్ ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఇదే సమయంలో చట్ట సభలలో అడుగుపెట్టని అత్యంత వెనుకబడ్డ కులాల వారికి కూడా ఒక సీటు కేటాయించాలన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు సమన్వయ సమితిలో బీసీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని వెంటనే సరిదిద్ది సామాజిక న్యాయం చేయాలని కోరారు. జనాభా తక్కువగా ఉండి రాజకీయ ప్రాతినిధ్యం ఎక్కువగా ఉన్న అగ్రకులాలకు చెందిన శాసనసభ్యులు తమ సామాజిక వర్గానికి చెందిన వారికే సమన్వయకర్తలుగా నియమించారని తెలిపారు. తమిళనాడు తరహాలో బీసీలకు న్యాయం చేస్తామన్న సీఎం కేసీఆర్ పదవుల్లో మాత్రం జనాభా దమాషా పద్దతిని పాటించడం లేదని విమర్శించారు.

బధిరులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి : డీఎస్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిత్యావసర ధరలు పెరుగుతున్న కారణంగా దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని "డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్" ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లో బదిరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ హిమాయత్‌నగర్‌లోని 230. 231, 232 సర్వే నెంబర్‌లో ఉన్న బధిరుల భూమిని స్వాధీనం చేసుకుని స్కూల్, కళాశాల బిల్డింగ్‌లను నిర్మించాలని డిమాండ్ చేశారు. వచ్చే బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమం కోసం రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌డీ రాష్ట్ర కార్యదర్శి కె వెంకటేశ్ గౌడ్, టీఎస్‌ఎఫ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ పాషా, ఎండీ ముక్తార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యాదాద్రీశుని కళ్యాణం

- ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-యాదాద్రి

యదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ వేడుక శనివారం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో దేవదాయశాఖ మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీస్వామి వారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రితో పాటు హోం మంత్రి నాయిని నర్సింహరెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, భువనగిరి ఎంపీ బూర నర్సయ్య, జిల్లా కలక్టర్ అనితారామచంద్రన్ హాజరయ్యారు. బాలాలయంలో ఉదయం, కొండకింద రాత్రి ఇలా రెండుమార్లు శ్రీస్వామి కల్యాణం జరిగింది.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో స్టీమ్ కుకింగ్

- అధునాతన ఆవిరి యంత్రాలు కొనుగోలుకు సర్కారు సన్నద్ధం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో స్టీమ్ కుకింగ్ ద్వారా విద్యార్థులకు భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన అధునాతన ఆవిరి యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద వంట వార్పు చేస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా.. కట్టెల వచ్చే పొగ వస్తుండటంతో సిబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్యలను అధికమించేందుకే ఆవిరి ద్వారా వంట చేయాలని నిర్ణయించామని గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 309 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. అందులో సుమారు 1.20 లక్షల మంది విద్యార్థులున్నారు. అన్ని పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మూడు పూటల భోజనాన్ని గిరిజన సంక్షేమ శాఖ సొసైటీ అందిచాల్సి ఉంది. గిరిజన ఆశ్రమ పాఠశాలన్నీ ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఉండటం వల్ల గ్యాస్ సరఫరా ఇబ్బందిగా మారింది. దీంతో పైలట్ ప్రాజెక్టు కింద స్టీమ్ కుకింగ్ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది. 250 మంది విద్యార్థులకు మించిన పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే స్టీమ్ కుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టనుంది.

'108' సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- సీఎంకు జూలకంటి లేఖ

నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

'108' సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. 108, 104 పథకాలను మరింత పటిష్టంగా అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని, దానిని వెంటనే అమలు పరచాలని కోరారు. రాష్ట్రంలో 13ఏండ్లుగా 1650 మంది సిబ్బంది '108'లో పనిచేస్తున్నారని, వారితో జీవీకే, ఐఎంఆర్ సంస్థలు రోజుకు 12గంటలు పనిచేయిస్తూ రూ.12వేల వేతనం మాత్రమే ఇస్తున్నాయని వాపోయారు. వారికి సెలవులు ఇవ్వట్లేదని, ఉద్యోగ భద్రత కరువైందని, వారికి ఏ బెనిఫిట్స్ కూడా అందట్లేదని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు ఈ సేవలను అప్పగించడం వల్ల సిబ్బందికి తక్కువ వేతనం ఇచ్చి శ్రమను దోచుకుంటున్నాయని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరిగాదని తెలిపారు.

భగీరథపై లక్నోలో
పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన- అభివద్ధిపై ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో జరిగిన జాతీయ సెమినార్ లో మిషన్ భగీరథపై పలువురు అధికారులు ప్రశంసలు కురిపించారు. నాబార్డ్ నిర్వహించిన ఈ సెమినార్ ను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా ప్రారంభించి స్వాగతోపన్యాసం చేశారు. కేంద్రప్రభుత్వంలోని ఆయా శాఖల అధికారులు, రాష్ట్రాల కార్యదర్శులు పాల్గొన్న ఈ సెమినార్‌కు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ ప్రజల దూప తీర్చడానికి చేపట్టిన మిషన్ భగీరథపై అరగంటపాటు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు లక్ష్యం, స్వరూపంతో పాటు పనులు జరుగుతున్న తీరును వివరించారు. మూడున్నరేండ్లపాటు క్రితం ప్రారంభించిన మిషన్ భగీరథ ఫలాలు ఇంకొన్ని రోజుల్లోనే ప్రతీ గ్రామానికి చేరుతున్నాయని వివరించారు. పట్టుదలతో మిషన్ భగీరథను రికార్డ్ సమయంలో పూర్తి చేయబోతున్నామని చెప్పారు. 2030 నాటికి ప్రతీ ఒక్కరికి సురక్షిత తాగునీరు, పరిశుభ్ర పరిసరాలను అందించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని 2018 నాటికే తెలంగాణ అందుకుంటుందన్నారు.

రక్షిత నీటితో పాటు ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ అందించే ఏకైక రాష్ట్రంగా 2019 నాటికి తెలంగాణ అవరిస్తుందని చెప్పారు. ఆ తరువాత మాట్లాడిన నాబార్డ్ ఛైర్మెన్ డాక్టర్ హర్షకుమార్ భన్వాలా మిషన్ భగీరథపై ప్రశంసల వర్షం కురిపించారు. తాను ఇప్పటివరకు చూసిన పథకాల్లో మిషన్ భగీరథనే వినూత్నం అన్నారు. ఈ ప్రాజెక్టులతో మహిళల తాగునీటి కష్టాల పూర్తిగా తీరుతాయని చెప్పారు. గుజరాత్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరేష్ సిన్హా మాట్లాడుతూ తాగునీటి చుట్టూ ఉన్న ఎన్నో సామాజిక సమస్యలు మిషన్ భగీరథతో పరిష్కారం అవుతాయని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి నెత్తి మీద బిందెలు మోయాల్సిన అవసరం లేకుండా గడప ముందుకే శుద్ధి చేసిన నీటిని అందించడం గొప్ప విషయమన్నారు.

రాష్ట్రంలో అరాచకాలు జరుగుతున్నాయ్...

పోలీసులు ఏం చేస్తున్నారు?

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు
- సమావేశానికి కలెక్టర్, సీపీ రాకపోవటంపై ఆగ్రహం

నవతెలంగాణ-సిద్దిపేట

'రాష్ట్రంలో దళితులపై ఇన్ని అరాచకాలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?' అని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు ప్రశ్నించారు. సిద్దిపేటలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. దళితుల సమస్యలపై వినతులను ఆయన స్వీకరించారు. సమీక్షా సమావేశానికి కలెక్టర్ వెంకట్‌రామిరెడ్డి, సీపీ శివకుమార్ హాజరుకాకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా డుమ్మాకొట్టేవారు దళితులకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సమీక్షా సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. 'దళితులు భయపడద్దు. అధైర్య పడవద్దు. ఎస్సీ కమిషన్ మీకు అండగా ఉంటుంది' అని రాములు భరోసానిచ్చారు. అభివద్ధి పేరుతో దళితులను వేధించడం సరికాదన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను 50 శాతం కూడా ఖర్చు చేయలేదని, ఇది ఎంతమాత్రం సరికాదని అన్నారు. దళితుల కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న సిద్దిపేట రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకుని వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయాలని అధికారులను ఆదేశించారు.

కేసీఆర్ పాలన పతనం ఖాయం : డీకే అరుణ

నవతెలంగాణ-జోగిపేట

కొద్ది రోజుల్లోనే సీఎం కేసీఆర్ పాలన పతనం ఖాయమని గద్వాల ఎమ్మెల్యే డీకే.అరుణ అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శనివారం మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ సమయంలో, ఎన్నికల ప్రచారంలో ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పిన కేసీఆర్ ఆయనింట్లో మాత్రం నాలుగు ఉద్యోగాలు సంపాదించుకున్నారన్నారు. నిరుద్యోగులకు చేసిందేమిలేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి ఎక్కడా సక్రమంగా ఇవ్వలేదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 8 సీట్లు గెల్చుకోవడం ఖాయమని, కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోగిపేట నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎస్.కవితాసురేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జీఆర్.కృష్ణారెడ్డి, అందోల్ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.శివరాజ్, జి.సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టులను భర్తీచేయాలని...

- జేఏసీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం

నవతెలంగాణ-జగిత్యాల



రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీచేసి నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజేఏసీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపే నిరసన కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో శనివారం ప్రారంభించారు. జేఏసీ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రమేర్పడి నాలుగేండ్లు గడుస్తున్నా ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. అత్యధిక నిరుద్యోగులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉండటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగుల పట్ల తప్పుడు ప్రకటనలు మానుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలంటూ పోస్టు కార్డులపై రాసి హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో పోస్టు చేశారు. ఈ పోస్టు కార్డులో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, క్యాలెండర్ విడుదల చేయాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలని, ప్రతి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని తదితర 5 ప్రధాన డిమాండ్లను రాసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీపాద నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు చేయాలని రాస్తారోకో

నవతెలంగాణ-అచ్చంపేట



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రైతులు శనివారం రాస్తారోకో చేశారు. మూడ్రోజులుగా కందులతో మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహబూబ్‌నగర్-శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లా డుతూ 'హాకా', సింగిల్‌విండో నిర్వాహకులు ఎలాంటి సమాచారం లేకుండా కందుల కొనుగోలును బంద్ చేశారని వాపోయారు. రోజుకు 50 టోకెన్లు ఇస్తూ కొనుగోలు చేస్తున్నారని, మార్కెట్‌లో రైతులు సౌక ర్యాలు కల్పించట్లేదని చెప్పారు. ఎస్ఐ పర్శరాములు రాస్తారోకో వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులను మార్కెట్‌కు తీసుకెళ్లి కొను గోళ్ల బంద్‌పై నిర్వాహకులు మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. టోకె న్లు ఇచ్చిన రైతుల నుంచి ఆదివారం కందులు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

నవచిత్రం

గ..ఘు..మేఘ..కనులే చెప్పే కొత్త సాగా



'ఛల్ మోహన్ రంగ' చిత్రంలో నితిన్, మేఘా ఆకాష్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్రానికి కృష్ణచైతన్య దర్శకుడు. నిఖితారెడ్డి సమర్పణలో పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై నిర్మిస్తున్న చిత్రమిది. ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మాత. ఈ చిత్రంలో 'గ.. ఘు.. మేఘ..కనులే చెప్పే కొత్త సాగా..' అంటూ సాగే మొదటి పాటను శనివారం విడుదల చేశారు. థమన్ సంగీతం సమకూర్చిన ఈ పాటకు కె.కె సాహిత్యం సమకూర్చారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఇటీవల విడుదలైన చిత్ర ఫస్ట్‌లుక్, టీజర్‌కు మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. మెలోడీల విషయంలో థమన్ ది ప్రత్యేక శైలి.ఆయన స్వరపరిచిన ఈ పాట ఎంతో వినసొంపుగా ఉంది. పాటలో సరదాగా, చలాకీగా సాగిపోయే హీరోహీరోయిన్ల ప్రయాణం లాగే, కె.కె.అందించిన సాహిత్యం కూడా అలరిస్తుంది. యుఎస్‌లోగల కీవెస్ట్, ఆమిష్ విలేజ్ లాంటి అందమైన ప్రదేశాల్లో ఈ పాటను చిత్రీకరించారు. కెమెరామెన్ ఎన్.నటరాజన్ సుబ్రహ్మణ్యన్ అద్భుతంగా షూట్ చేశారు. నితిన్ నటిస్తున్న ఈ 25వ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు' అని అన్నారు. డా॥కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రామేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రాశ్రీను, మధునందన్, ప్రగతి, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృతిక, మాస్టర్ జాయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: ఎస్.ఆర్.శేఖర్.

మరో అరుదైన గౌరవం



బి.నాగిరెడ్డి

అలనాటి లెజెండరీ నిర్మాత, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, విజయ సంస్థ అధినేత బి.నాగిరెడ్డికి మరో అరుదైన గౌరవం దక్కింది. ఆయన ముఖ చిత్రంతో పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు శుక్రవారం చెన్నైలో ఈ ప్రతిష్టాత్మక పోస్టల్ స్టాంప్‌ను రిలీజ్ చేశారు. 1912, డిసెంబర్ 2న జన్మించిన బి.నాగిరెడ్డి సినిమా రంగంపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదిగారు. 1950లో విజయ వాహిని సంస్థను స్థాపించారు. ఈ బ్యానర్‌లో 'షావుకారు', 'పాతాళభైరవి', 'మిస్సమ్మ', 'మాయాబజార్', 'గుండమ్మ కథ', 'అప్పుచేసి పప్పుకూడు', 'పెళ్ళిచేసి చూడు', 'జగదేక వీరుని కథ', 'సత్య హరిశ్చంద్ర' వంటి అనేక కళాఖండాలను రూపొందించారు. 2004, ఫిబ్రవరి 25న ఆయన కన్నుమూశారు.



సాగర్ మహతి, మణిశర్మ, అశ్వనీదత్, నాని, శ్రీరామ్ ఆదిత్య

పాటల రికార్డింగ్‌తో నాగార్జున, నాని సినిమా షురూ..

నాగార్జున, నాని హీరోలుగా టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో వైజయంతి మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న మల్టీస్టారర్ చిత్ర పాటల రికార్డింగ్ కార్యక్రమం నాని పుట్టిన రోజు సందర్భంగా శనివారం ప్రారంభమైంది. పాటల రికార్డింగ్‌ను మహతి స్టూడియోలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ, "ఆఖరిపోరాటం', 'ఆజాద్', 'రావోయి చందమామ' వంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలను నాగార్జునతో రూపొందించాను. ఇప్పుడు నాగార్జున, నాని వెరైటీ కాంబినేషన్‌లో ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌తో ఎంటర్‌టైనింగ్ వేలో చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బ్యానర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ని ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బ్యానర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారథ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చిలో షూటింగ్ స్టార్ట్ చేస్తాం. మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది' అని అన్నారు. 'నాగార్జున, నాని కాంబినేషన్‌లో సినిమాని డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అందులోనూ వైజయంతి మూవీస్ వంటి పెద్ద బేనర్‌లో సినిమా చేయడం మరింత ఆనందంగా ఉంది. ఇది దర్శకుడిగా నాకు ఓ ప్రతిష్టాత్మక చిత్రమవుతుంది' అని దర్శకుడు తెలిపారు. సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి.


ఆ విషయం మాత్రం సస్పెన్స్..



అమీ జాక్సన్

'ఐ' సినిమాతో దక్షిణాదిలో క్రేజీ హీరోయిన్‌గా మారిన అమీ జాక్సన్ ప్రస్తుతం రజనీకాంత్ సరసన నటిస్తున్న '2.0'తో ఇండియా మొత్తం పాపులర్ అయ్యింది. తాజాగా అమీ 'సాహో' చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న విషయం విదితమే. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం కోసం అమీతో చర్చలు జరుపగా, ఇందులో నటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అయితే అమీ స్పెషల్ సాంగ్‌లో మెరవనుందా లేక కీలక పాత్రలో నటించనుందా అనే విషయం మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్. 'సాహో'లో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయికగా నటించడం ఓ విశేషమైతే, తాజాగా అమీ కూడా ఇందులో భాగమవ్వడం మరో విశేషం. అమీ ప్రస్తుతం '2.0'తోపాటు కన్నడలో 'ది విలన్' చిత్రంలోనూ నటిస్తోంది.

అభిమానులకు కాలా శుభవార్త..



రజనీకాంత్

'కబాలి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పా.రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'కాలా'. ముంబయి మాఫియా నేపథ్యంలో రూపొందుతుందీ చిత్రం. ఇందులో రజనీకాంత్ ముంబయిలోని తమిళుల కోసం పోరాడే గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకంపై ధనుష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హ్యూమా ఖురేషి కథానాయికగా నటిస్తోంది. రజనీ నటించిన '2.0' వాయిదా పడటంతో ఈ చిత్రం ఏప్రిల్ 27న విడుదలకు సిద్ధమవుతోంది. ఇక ఇప్పటికే విడుదలైన ఈ చిత్రానికి సంబంధించిన రజనీ లుక్స్‌కు మంచి స్పందన లభించింది. అవి సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. చిత్ర టీజర్‌ను మార్చి 1న విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఆ వివరాలను నిర్మాత ధనుష్ వెల్లడించారు. 'ఏ వార్త కోసమైతే ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారో అది రానే వచ్చింది. మార్చి 1న ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేస్తున్నాం. వన్ అండ్ ఓన్లీ సూపర్‌స్టార్ ఛరిష్మా, స్టయిల్‌ను చూసేందుకు సిద్ధంగా ఉండండి' అని ధనుష్ పేర్కొన్నారు. దీంతో రజనీ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. దీంతోపాటు రజనీకాంత్ ఇటీవల ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఈ నూతన సినిమా తెరకెక్కనుంది.


యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్..



విజయ్ దేవరకొండ, శివానీ సింగ్

విజయ్ దేవరకొండ నటిస్తున్న నూతన చిత్రం 'ఏ మంత్రం వేశావే'. శివానీ సింగ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో గోలీసోడా ఫిల్మ్స్ పతాకంపై శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే నెలలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ విశేషాలను సమర్పకుడు మల్కాపురం శివకుమార్ చెబుతూ, "పెళ్ళిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో యువతలో హీరో విజయ్ దేవరకొండ మంచి పాపులారిటీ సంపాదించారు. తాజాగా ఆయన నటిస్తున్న ఈ చిత్రం గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథతో రూపొందుతోంది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా, నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించబోతున్నారు. 'పెళ్ళిచూపులు', 'అర్జున్‌రెడ్డి తరహాలోనే ఈ సినిమా కూడా ఆయన కెరీర్‌లో మరుపురాని సినిమాగా ఉండబోతుంది. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా ఉంటాయి. మార్చి 9న సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అబ్బుత్ సమత్, సినిమాటోగ్రఫీ: శివారెడ్డి.

ఫిక్షన్ చిత్రాలనే ఎందుకు చూడాలి..?



రాజ్ కుమార్ హిరానీ

'కల్పితం వాస్తవాలను దాయలేదు. నిజాలను కప్పి ఉంచలేదు' అని అంటున్నారు దర్శకుడు రాజ్ కుమార్ హిరానీ. దర్శకత్వం వహించింది నాలుగు సినిమాలే అయినా రాజ్ కుమార్ హిరానీ బాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా, అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. సందేశాన్ని సెటైరికల్‌గా చెబుతూ 'మున్నాభాయ్ ఎం.బి.బి.ఎస్', 'లగే రహో మున్నాభాయ్', '3 ఇడియట్స్', 'పీకే' వంటి తదితర చిత్రాలతో తానేంటో నిరూపించుకున్నారు. ప్రస్తుతం ఆయన బాలీవుడ్ మున్నాభాయ్ సంజయ్ దత్ జీవితం ఆధారంగా 'సంజు' అనే బయోపిక్‌ను నిర్మిస్తున్నారు. రణ్‌బీర్‌కపూర్ ఇందులో సంజయ్ దత్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న నేపథ్యంలో 'రైజింగ్ ది బార్' అనే డాక్యుమెంటరీ స్పెషల్ స్క్రీనింగ్‌లో పాల్గొన్న రాజ్ కుమార్ హిరానీ డాక్యుమెంటరీల గురించి చెబుతూ, 'మనం ఫిక్షన్‌ను మాత్రమే ఎందుకు చూడాలి? డాక్యుమెంటరీలను కూడా చూడాలి. ఎందుకంటే అవి చాలా ఆసక్తికరంగా ఉంటాయి. గతంలో డాక్యుమెంటరీలు తీసేందుకు ఆసక్తి చూపేవారు కాదు, ఇప్పుడిప్పుడు ఆ దిశగా, దాన్నొక ప్లాట్‌ఫామ్‌గా భావిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ ఆడియెన్స్‌కు వినోదాన్ని పంచడం కోసం కల్పిత కథలతో సినిమాలు చేస్తారు. కానీ నా దృష్టిలో డాక్యుమెంటరీల్లో ఉండే వాస్తవాలు ప్రేక్షకుల హృదయాలకు బాగా దగ్గరవుతాయని నమ్ముతాను. భవిష్యత్‌లో నేనూ డాక్యుమెంటరీలను రూపొందిస్తాను' అని చెప్పారు.

జిరాక్స్ కాపీలా..



పూజా హెగ్డే

లేటుగానైనా లేటెస్ట్‌గా భారీ ఆఫర్స్ అందుకుంటోంది పూజా హెగ్డే. ఆఫర్స్‌లో భాగంగా ప్రస్తుతం బెల్లకొండ సాయి శ్రీనివాస్ హీరోగా రూపొందుతున్న 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తోంది. ఇందులో బ్రాహ్మిణ అమ్మాయిగా పూజా కనిపించనుందట. దీనికోసమై 'దువ్వాడ జన్నాథమ్'చిత్రంలోని అల్లు అర్జున్ పోషించిన బ్రాహ్మిణ పాత్రను పూజా తూ.చ.తప్పకుండా ఫాలో అవుతోంది. ముఖ్యంగా బాడీ లాంగ్వేజ్, యాస, భాషతో సహా అన్నింటిని జిరాక్స్ కాపీలా దించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందట. శ్రీవాస్ దర్శకత్వంలో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా విడుదల కానుంది. అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతోపాటు త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందే చిత్రంలో ఎన్టీఆర్ సరసన, వంశీపైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో మహేష్‌బాబుకి జోడీగానటించే లక్కీ ఛాన్స్‌ను పూజా అందుకున్న విషయం విదితమే. అలాగే 'రంగస్థలం'లోని ఓ స్పెషల్ సాంగ్‌లో మెరవడంతోపాటు 'రేస్ 3'లో సల్మాన్‌ఖాన్‌కి జోడీగా నటించే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. మొత్తమ్మీద భారీ బంపర్ ఆఫర్స్‌తో పూజా కెరీర్ మూడు భారీ చిత్రాలు ఆరు అగ్ర హీరోల చందంగా ఉండటం విశేషం.

పరిశ్రమకు అండగా బంద్‌కు మద్దతు..

'నిర్మాతలకు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు క్యూబ్, యుఎఫ్ఒ, పిఎక్స్‌డి సంస్థలకు మధ్య జరిగిన చర్చలు విఫలమవ్వడంతో దక్షిణాదికి చెందిన నాలుగు భాషల చిత్ర నిర్మాతలు మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ చేస్తూ, ఈ మూడు డిజిటల్ సంస్థలకు కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయించారు. అందుకు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా మద్దతు తెలుపుతోంది' అని అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. నిర్మాతలకు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు శుక్రవారం జరిగిన చర్చలు విఫలమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'డిజిటల్ వ్యవస్థలోని దోపిడిపై గత పదేండ్లుగా పోరాటం చేస్తున్నాం. ఆమరణ నిరాహార దీక్షలు కూడా చేశాం. కానీ అప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. కొంత మంది నిర్మాతలకు డిజిటల్ వ్యవస్థపై అవగాహన ఉండేది కాదు. మేం చెప్పడం వల్లే డిజిటల్ వ్యవస్థలో ఎంత మోసం ఉందో, ఎంత ఎక్కువగా నిర్మాతల నుంచి వసూలు చేస్తున్నారో చాలా మందికి తెలిసింది. ఇప్పటికైనా దక్షిణాది చిత్ర పరిశ్రమలన్నీ ముందుకొచ్చి డిజిటల్ వ్యవస్థపై పోరాటం చేయడం మంచి పరిణామం. బెంగుళూరులో జరిగిన చర్చలో ఈ మూడు డిజిటల్ సర్వీస్ సంస్థలు 9శాతానికి మించి తగ్గించే ప్రసక్తే లేదని చెప్పారు. అసలు డిజిటల్ ఛార్జీలు ఐదేండ్లకు మించి ఉండకూడదు. 13ఏండ్లయినా అదే రేట్లు తీసుకుంటూ నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారు. మన సౌత్ ఇండియా ఫిల్మ్ ఇండస్ట్రీలో తప్ప హాలీవుడ్, బాలీవుడ్‌లలో ఈ విధంగా ఛార్జీలు లేవు. గతంలో 2500 రూపాయలకే డిజిటల్ సర్వీస్‌లు ప్రొవైడ్ చేస్తామంటూ కొన్ని సంస్థలు ముందుకొచ్చినా ఈ మూడు డిజిటల్ యాజమానులు వారిని రాకుండా చేశారు. ఇప్పటికే డిజిటల్ అత్యధిక రేట్ల వల్ల రిలీజ్ కాకుండా ఎన్నో చిత్రాలు ఆగిపోయాయి. క్యూబ్, యుఎఫ్ఒ, పీఎక్స్‌డీ సంస్థలతో అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకుంటే తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. కాబట్టి 1500 రూపాయల నుంచి, రెండు వేల వరకు ఇచ్చే సంస్థలకే సినిమా కంటెంట్‌ను ఇవ్వాలని నిర్మాతలను కోరుతున్నాం. ఈ క్రమంలో మార్చి 2న నుంచి థియేటర్ల బంద్‌కు అందరు సహకరించాలి. ఈ విషయంలో మేం కూడా పూర్తి స్థాయిలో సహాయ సహకారాల్ని అందిస్తాం. మా మద్దతు తెలుపుతూ బంద్‌లో పాల్గొంటాం' అని తెలిపారు.

'చాలా రోజులుగా ఈ వ్యవస్థపై మేం పోరాటం చేస్తున్నాం. ఇప్పుడు అందరూ కలిసి రావడం, ఓ పోరాటంగా తీసుకురావడం శుభ పరిణామం. దీనికి అంతా సపోర్ట్ చేయాలి. దీన్ని ముందుకు నడిపిస్తున్న తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు జెమినీ కిరణ్, సురేష్ బాబులకు థ్యాంక్స్. ఈ సమస్య పరిష్కారంతో నిర్మాతలకు కొంత భారం తగ్గుతుంది' అని సాయి వెంకట్ అని అన్నారు.



ప్రతాని రామకృష్ణగౌడ్, సాయి వెంకట్



సాయి పల్లవి
నాగశౌర్య

గొప్ప పాయింట్‌తో కణం

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. 'ఛలో' తర్వాత నాగశౌర్య చేస్తున్న విభిన్న కథా చిత్రమిది. అలాగే 'ఫిదా' హీరోయిన్ సాయిపల్లవి ఈ చిత్రంలో ఓ అద్భుతమైన పాత్రలో కనిపిస్తుంది. ఈ చిత్రం మొదటి సింగిల్ 'సంజలి..' అంటూ సాగే పాటను ఆదివారం విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మాట్లాడుతూ, 'ఇది చాలా డిఫరెంట్ సబ్జెక్ట్. కమర్షియల్ ఎలిమెంట్స్‌తోపాటు ఒక గొప్ప పాయింట్ ఇందులో ఉంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి సింగిల్ 'సంజలి..'ను ఆదివారం విడుదల చేస్తున్నాం' అని అన్నారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివశరవణన్, షియామ్ తదితరులు సాంకేతిక వర్గంగా పనిచేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు ఒకనెల వేతనం ప్రోత్సాహకం

ముఖ్యమంత్రి నిర్ణయం

- వంద రోజుల్లోనే భూ రికార్డుల ప్రక్షాళన చేశారని కితాబు
- 20లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై స్పష్టత
- కొత్త జిల్లాల వల్లే భూముల లెక్క తేలింది
- ఉద్యోగుల జీతాలు పెంచుతామన్న సీఎం

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

అత్యంత క్లిష్టమైన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన రెవెన్యూ శాఖ ఉద్యోగులకు ప్రోత్సాహకంగా ఒక నెల మూల వేతనాన్ని అందివ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. 10,809 మంది రెవెన్యూ ఉద్యోగులు, 24,410 మంది వీఆర్ఎలు, 530 మంది సర్వే విభాగం ఉద్యోగులు.. మొత్తం 35,749 మంది ఉద్యోగులకు ఒక నెల మూల వేతనం అదనంగా అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేవలం వంద రోజుల వ్యవధిలోనే రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేసి భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు.



విధి నిర్వహణ పట్ల ఇంతటి చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ఉద్యోగులుండడం తెలంగాణ ప్రజలు, రైతుల అదష్టంగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. తెలంగాణ ప్రజలు, రైతుల పక్షాన రెవెన్యూ ఉద్యోగులకు కతజ్ఞతలు తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం, కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతి భవన్‌లో శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు జి.ఆర్. రెడ్డి, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగ్ రావు, రాజేశ్వర్ తివారి, రామకష్ణ రావు, శివశంకర్, వాకాటి కరుణ, స్మితా సభర్వాల్, కలెక్టర్లు రఘునందన్ రావు, ఎంవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"దాదాపు 80 ఏళ్లుగా భూ రికార్డుల నిర్వహణ సరిగా లేదు. భూమి క్రయవిక్రయాలు, యాజమాన్యంలో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో భూ రికార్డులు గందరగోళంగా మారాయి. తెలంగాణలో పంట పెట్టుబడి పథకం అమలు చేసేందుకు ఏ భూమికి ఎవరు యజమానో ఖచ్చితంగా తేలాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో భూ రికార్డులను సరిచేసి, పూర్తి పారదర్శకంగా పథకం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కేవలం వంద రోజుల్లోనే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరిగి, రైతులతో మాట్లాడి భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత తెచ్చారు.

సొంత భూములున్న రైతులతో పాటు, అసైన్డ్ దారుల విషయంలో కూడా స్పష్టత సాధించారు. రాష్ట్రంలో 22.5 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచగా, అందులో 20 లక్షల ఎకరాల విషయంలో స్పష్టత వచ్చింది. మిగతా రెండున్నర లక్షల ఎకరాల విషయంలో స్పష్టత కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములు, అటవీ-రెవెన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములు మినహాయిస్తే మిగతా విషయాల్లో పూర్తి సాధించారు. ఇది సాధారణ విషయం కాదు. దేశంలో ఎవరూ సాధించని ఘనత రెవెన్యూ ఉద్యోగులు సాధించారు. వారికి ప్రోత్సాహకరంగా ఉండేందుకు ఒక నెల మూల వేతనాన్ని అదనంగా అందిస్తాం" అని సీఎం ప్రకటించారు. "కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉంటుందో భూ రికార్డుల ప్రక్షాళన నిరూపించింది. చిన్న జిల్లాలుండడం వల్లనే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యమైంది. కొత్త కలెక్టర్ల ప్రతిభకు, పనితీరుకు ఇది గీటురాయి. కలెక్టర్లు తమ విధిని గొప్పగా నిర్వహించారు" అని ముఖ్యమంత్రి అభినందించారు. "తెలంగాణ రాష్ట్రంలో అధికశాతం మంది అధికారులు, ఉద్యోగులు నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగుల పనితీరులో ఎంతో మార్పు వచ్చింది. కష్టపడి పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడానికి ఎంతో కషి చేస్తున్నారు.

తప్పంతా బ్యాంకులదే..!

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఏడేండ్లుగా గుర్తించలేకపోయారు..

ఒక బ్యాంకులో ఏడేండ్ల నుంచి భారీ మోసం జరుగుతుంటే ఏ ఒక్క సిబ్బంది దీనినిఎందుకు గుర్తించలేకపోయారని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మండిపడ్డారు. మోసాన్ని గుర్తించడంలో బ్యాంక్ మేనేజ్‌మెంట్, నియంత్రణాధికారులు, ఆడిటర్లు విఫలమయ్యారంటూ జైట్లీ విమర్శించారు. బ్యాంకులను మోసగించేవాళ్లను శిక్షించేందుకు అవసరమైతే చట్టాన్ని కఠినతరం చేస్తామని జైట్లీ అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ని(పీఎన్‌బీ) వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ రూ.11,400 కోట్లమేర మోసగించడాన్ని ఉద్దేశిస్తూ జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆయన నేరుగా ఆ బ్యాంక్ పేరుగానీ, నీరవ్ పేరుగానీ ప్రస్తావించలేదు. బ్యాంక్ కుంభకోణాలను అడ్డుకునేందుకు నియంత్రణాధికారులు మరింత చురుగ్గా వ్యవహరించాలని ఆర్థికమంత్రి హితవు పలికారు. రుణదాత-రుణగ్రహీత మధ్య సంబంధాల్లో అనైతికతకు స్వస్తి పలికి నైతిక వ్యాపార విధానాలను అలవరచాల్సి ఉన్నదని జైట్లీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ నిర్వహిస్తున్న గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో శనివారం జైట్లీ ప్రసంగించారు. ఇదే సదస్సులో శుక్రవారం ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, ప్రజా ధనాన్ని దోచుకునేవారిని అనుమతించబోమని అన్నారు. అయితే, తప్పంతా అధికారులపైకి నెట్టి తమ బాధ్యతేమీ లేదంటూ ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తప్పించుకునేందుకు యత్నిస్తున్నారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

పనితీరు ఆందోళనకరం..

బ్యాంకులను మోసగించేవారిని అడ్డుకోవడంలో నియంత్రణాధికారుల పాత్ర కీలకమని, వారు ఎల్లప్పుడూ తెరిచి ఉండే మూడో కన్నులా వ్యవహరించాలని జైట్లీ అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలోని పలు శాఖల్లో మోసం కొనసాగుతుండగా ఏ ఒక్కరూ గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోందని జైట్లీ అన్నారు. మన వ్యవస్థలో నియంత్రణాధికారులను కాకుండా రాజకీయ నేతలను జవాబుదారీని చేయడం దురదృష్టకరమని జైట్లీ అన్నారు. పీఎన్‌బీ కుంభకోణాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. ఉద్దేశపూర్వక ఎగవేతలకు సంబంధించిన ఇటువంటి కేసులు వ్యాపార వైఫల్యాలకన్నా ఎక్కువ నష్టం చేస్తాయని జైట్లీ అన్నారు. ఇటువంటి (బ్యాంకులను మోసగించే) సంఘ టనలు వరుసగా జరుగుతూ ఉంటే తమ ప్రభుత్వం అనుసరిస్తున్న సులభ తర వాణిజ్య విధానానికి విఘాతం కలుగుతుందని, మన ఆర్థిక వ్యవస్థపై పడ్డ ఆ మచ్చలే ముందు వరుసలో కనిపిస్తాయని జైట్లీ అన్నారు. పీఎన్‌బీ కుంభకోణం వెలుగు చూసిన తర్వాత ఈ వారం ప్రారంభంలోనూ జైట్లీ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. మన దేశ వ్యాపారుల్లోని కొందరికి నైతికత లోపించిందని, ప్రభుత్వాన్ని నడుపుతున్న తమపై అలాంటి వారిని అడ్డుకో వాల్సిన బాధ్యత ఉన్నదని జైట్లీ అన్నారు. దేశాన్ని మోసగించలేరని హామీ ఇవ్వాల్సి ఉన్నదన్నారు. పీఎన్‌బీ కుంభకోణంపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ పరిశోధిస్తున్నాయి. పీఎన్‌బీ ముంబయిశాఖ నుంచి లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌వోయూలు) తీసుకొని వాటి ఆధారంగా నీరవ్‌మోడీ,ఆయన మామ మెహుల్ చోక్సీ 2011 నుంచి 2017 వరకూ విదేశాల్లోని పలు బ్యాంక్ శాఖల నుంచి అప్పులు తీసుకున్న విషయం తెలిసిందే.

27న సింగరేణికి సీఎం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 27న సింగరేణిలో పర్యటించనున్నారు. మంచిర్యాలలోని శ్రీరాంపూర్ గనుల ప్రాంతంలో ఆయన పర్యటిస్తారు. అదేరోజు మధ్యాహ్నం అక్కడి ప్రగతి మైదాన్‌లో జరిగే సమావేశంలో ఆయన కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తారు. సీఎం పర్యటన సందర్భంగా రామగుండం 1,2,3 గనులు, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ గనుల్లో పనిచేసే కార్మికులకు ఈనెల 27న సెలవు ప్రకటించారు. యాత్రకు సంబంధించి శనివారం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. మార్చి 5న ధర్మపురి, ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారు. ఆ సందర్భంగా ధర్మపురి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై చర్చిస్తారు. అనంతరం ముథోల్ నియోజకవర్గంలోని బాసర దేవాయంలో పూజలు నిర్వహించి.. అక్కడి ప్రజాప్రతినిధులతో భేటీ అవుతారు. సాయంత్రం నిర్మల్‌లో జిల్లా అధికారుల కార్యాలయాలు, పోలీస్ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలోనూ ఆయన ప్రసంగిస్తారు.

నీరవ్, చోక్సీల పాస్‌పోర్టుల తాత్కాలిక రద్దు

న్యూఢిల్లీ:పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో ప్రధాన నిందితులైన నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీల పాస్‌పోర్టులను సస్పెండ్ చేసినట్టు విదేశాంగశాఖ అధికారులు తెలిపారు. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని నాలుగు వారాలపాటు పాస్‌పోర్టులపై సస్పెన్షన్ విధించినట్టు అధికారులు తెలిపారు.

ఈడీ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ నెల 16న ఇచ్చిన నోటీసులపై ఆ ఇద్దరు నిందితులు స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. దర్యాప్తు సంస్థల తదుపరి సూచనలమేరకు పాస్‌పోర్టుల రద్దుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

గుజరాత్ ఎన్నికల ఫలితాలపై ఈసీకి హైకోర్టు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న పరిమితి కంటే ఎక్కువ ప్రచార ఖర్చు చేసి గెలుపొందారని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కాంగ్రెస్ అభ్యర్థి దామోర్.. కోర్టును అభ్యర్థించారు. కోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ నేతల్లో ఎక్కువ మంది 3 వేల లోపు ఓట్ల తేడాతో ఓడిపోయిన వారే ఉన్నారు. బోతాడ్ నియోజకవర్గంలో కాంగ్రెష్ అభ్యర్థి మాధవ్‌జీభాయ్ కలాతియా సమీప ప్రత్యర్థిపై 906 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. గోద్రాలో 258, పోర్‌బందర్‌లో 1855 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమిని చవి చూశారు. అయితే.. నిబంధనల ప్రకారం.. వీవీపీఏటీ స్లిప్పుల ఆధారంగా కౌంటింగ్ నిర్వహించేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్లు కోరారు. దీనిపై విచారణ శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై వివరణ ఇవ్వాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది.

మనం ఇద్దరం..మనకు18 మంది

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశాను' అని గొప్పలు చెప్పుకొచ్చారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సైనీకి ఇది మొదటి సారి కాదు. హిందుస్థాన్.. హిందువుల కోసమేనని, ముస్లింలు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని గత నెలలో విక్రం సైనీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. దీంతో తన కోపం పాకిస్థాన్‌పైనే కానీ.. ముస్లిములపై కాదని సమర్థించుకున్నారు.

28 నుంచి ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయి. వచ్చేనెల 14 వరకు ప్రధాన పరీక్షలు, 19వ తేదీ వరకు మొత్తం పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం సర్వంసిద్ధం చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటి నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉంటుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 9,63,546 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,55,635 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,911 మంది విద్యార్థులున్నారని వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ కేటగిరీలో 4,15,215 మంది, ఒకేషనల్‌లో 40,420 మంది ఉన్నారని చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ కేటగిరీ (రెగ్యులర్)లో 3,95,503 మంది, జనరల్ కేటగిరీ (ప్రయివేటు)లో 74,452 మంది, ఒకేషనల్ (రెగ్యులర్)లో 33,689 మంది, ఒకేషనల్ (ప్రయివేటు)లో 4,267 మంది హాజరవుతున్నారని అన్నారు.

25,395 మంది ఇన్విజిలేటర్లు

రాష్ట్రవ్యాప్తంగా 1,294 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అశోక్ చెప్పారు. ఇందులో ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు 527, ప్రయివేటు విద్యాసంస్థలు 767 ఉన్నాయని అన్నారు. 1,294 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 1,294 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు. ఇందులో 19,307 మంది అధ్యాపకులు, 6,088 మంది ఉపాధ్యాయులున్నారని అన్నారు. డీఐఈవో కన్వీనర్‌గా జిల్లా పరీక్ష కమిటీ (డీఈసీ) ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ చైర్మెన్‌గా, ఎస్పీ, ఆర్జేడీ, డీఐఈవోలతో కలిపి జిల్లా ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 50 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. ఈ పరీక్షల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీని కోరామని చెప్పారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరా చేయాలని విద్యుత్ శాఖను కోరామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మౌలిక వసతులు, పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే విద్యార్థులు, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రం సూచించే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 40 వరకు ప్రభుత్వ కాలేజీల్లో సెల్ఫ్‌సెంటర్లున్నాయని వివరించారు. దగ్గర్లో ఇతర కేంద్రాలు అందుబాటులో లేకపోవడం, విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే సెల్ఫ్‌సెంటర్లకు అవకాశమిచ్చామని అన్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రశ్నాపత్రం విడుదల చేసే సమయంలో సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని అశోక్ అన్నారు. పరీక్షా కేంద్రాలకు దగ్గర్లో ఉండే జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులను కోరామని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు జనరల్ పాకెట్ రేడియో సిస్టం (జీపీఆర్ఎస్)ను అమలు చేశామన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీని అరికట్టేందుకు ఈ విధానం అమల్లోకి తెచ్చామని చెప్పారు. మొబైల్ ఫోన్లు విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెట్లు తేవడానికి వీల్లేదని అన్నారు. ఒకవేళ మొబైల్ ఫోన్లు తెచ్చినా జీపీఆర్ఎస్ ఉన్నందున ఆ ఫోన్లు పనిచేయబోవని, ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌కు అవకాశం లేదని, ఎస్ఎంఎస్ పంపేందుకు వీల్లేదని అన్నారు. ఇంటర్ బోర్డు నుంచి పరీక్షలను పర్యవేక్షించేందుకు 50 మంది పరిశీలకులను నియమించామని చెప్పారు. https://admi.tsbie.cgg.gov.in, https://tsbie.cgg.gov.in, bietelangana.cgg.gov.in వెబ్‌సైట్‌ల నుంచి ఈనెల 26వ తేదీ నుంచి విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందని అన్నారు. ఫీజు, ఇతర సమస్యల కారణంగా విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా చేయొద్దని యాజమాన్యాలను కోరారు. ఏమైనా సమస్యలుంటే 040-24601010, 24732369 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే వెయ్యి మంది విద్యార్థులకు వచ్చేనెల 19 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు నీట్, జేఈఈ, ఎంసెట్ కోచింగ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి సుశీల్‌కుమార్, జాయింట్ సెక్రెటరీలు భీంసింగ్, ప్రభాకర్, నారాయణరెడ్డి, ఖాలిక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థను శాసిస్తున్న బడాకంపెనీలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

గతంలో టాటా, బిర్లాలు...ఇప్పుడు అంబానీ కంపెనీలు వ్యవస్థను శాసిస్తున్నాయనీ సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బి సుదర్శన్‌రెడ్డి అన్నారు. విధానాలపరంగా దేశంలోని అగ్రశేణి పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వాల నుంచి ప్రోత్సహం లభిస్తుందని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆవిర్భవించి 30వసంతాలు పూర్తి అయిన సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్పిరిట్ ఆఫ్ ఇంక్వైరీ-అప్‌హోల్డ్ క్వశ్చనింగ్' అనే అంశంపై రెండు రోజుల సెమినార్ శనివారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు బి సుదర్శన్‌రెడ్డి ప్రారంభోపాన్యాసం చేశారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ ద్వారా సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని, దీంతో అసమానతలు పెరిగిపోతున్నాయనీ ఆయన అన్నారు. అసమానతలతో అవకాశం కోల్పోయిన వారిపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులతో కార్మికోద్యమాలు, అభ్యుదయ ఉద్యమాలు ప్రాధాన్యత కోల్పోతున్నాయని అన్నారు. దేశంలో రాజకీయ సంస్కృతి మారిపోతున్నదనీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించడమూ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆలోచనలకే తలొగ్గాలనే నియంతృత్వ పోకడలు పెరుగుతున్నాయన్నారు. జేవీవీ చెప్తున్నట్టుగా ప్రశ్నించడం లేకపోతే విజ్ఞానం పెరగదనీ, ఎదుటివారి ఆలోచనలు పంచుకోకపోతే సహనం పెరగదని తెలిపారు. మనదేశం ఈరెండు సమస్యలను అధిగమించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక అసమానతల నుంచే వైరుధ్యాలు పెరుగుతున్నాయని, వీటి నుంచే హక్కుల ప్రస్తావన మొదలవుతుందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన జరగాలంటే ఆర్థిక, సామాజిక, సమానతలు ఉన్నప్పుడే అది సాధ్యమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడంలో జేవీవీ తనవంతు పాత్ర పోశించాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ...ప్రస్తుత కాలంలో విశ్వాసం విద్వేషంగా రూపాంతరం చెందుతుందనీ, ఈ విషయంలో మతోన్మాదశక్తులు కొంత విజయం సాధించాయని అన్నారు. ఆర్టికల్ 39 ప్రకారం ఉత్పత్తి శక్తులు కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావొద్దని, కానీ ప్రస్తుతం దీనికి పూర్తి విరుద్ధంగా జరిగేందుకు ఆర్థిక విధానాలు దోహదం చేస్తున్నాయని తెలిపారు. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం 74శాతం జాతీయాదాయం ఒక్కశాతం జనాభా వద్దే పోగైందని చెప్పారు. ప్రభుత్వం గడిచిన మూడేండ్ల కాలంలో తిండి, బట్ట, గూడు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం కంటే, ఏం తినాలి.? ఎలాంటి దస్తులు ధరించాలి.? తదితర వాటినే సమస్యలుగా మలుస్తున్నారని మండిపడ్డారు. ఏపీ ఎమ్మెల్సీ, జేవీవీ సీనియర్ నాయకులు వి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ...ప్రజలకు సైన్స్ బోధిస్తూ, ప్రజల నుంచి నేర్చుకుంటూ జేవీవీ ఎదిగిందని అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమం, ఆరోగ్య రంగాలల్లో జేవీవీ ముఖ్యపాత్ర పోషించిందని చెప్పారు. ప్రముఖ శాస్త్రవేత్త మెహతాజ్ ఎస్ బాఫ్జీ మాట్లాడుతూ...ముఢనమ్మకాలకు ప్రశ్నించనివ్వని నేటి విద్యావిధానమే కారణమని అన్నారు. నమ్మకాలు తమ పరిధి దాటి, ముఢనమ్మకాలుగా ఈ ఆధునిక కాలంలో రూపాంతరం చెందడం విస్మయకరమని చెప్పారు. ఆల్ ఇండియా పీపుల్స్ నెట్‌వర్క్(ఏఐపీఎస్ఎన్) ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ రాజమాణిక్యం మాట్లాడుతూ...ప్రజా సైన్స్ ఉద్యమాల ద్వారానే విద్యాహక్కుచట్టం, ఎన్‌ఎచ్ఆర్ఎంసీ వచ్చాయని అన్నారు. దేశంలో పీఎస్ఎన్‌కు కోటిమంది కార్యకర్తలున్నారని చెప్పారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ... జేవీవీ రాష్ట్రంలో 20వేల సభ్యత్వంలో కలిగి, సైన్స్, విద్య, ఆరోగ్యం, సాంఘిక అంశాలపై కృషి చేస్తుందని అన్నారు. ఇటీవల నిర్వహించిన చెకుముఖి కార్యక్రమంలో 6.2లక్షల మంది విద్యార్థులను భాగస్వామ్యం చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి టి శ్రీనాథ్, నాయకులు కేఆర్ వేణుగోపాల్, వీఎం మనోహరప్రసాద్, డాక్టర్ అందె సత్యం, బీఎన్‌రెడ్డి, సత్యప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, రాజా, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేవీవీ 30ఏండ్లుగా చేసిన కార్యక్రమాలు, శాస్త్రవేత్తల ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకున్నది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్‌షో అందరినీ అలరించాయి.

టీఆర్టీ పరీక్షలు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు శనివారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శనివారం ఆన్‌లైన్ రాతపరీక్షల నిర్వహణలో స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నాయి. పలు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు సమయానికి రాకపోవడంతో అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. దీంతో పరీక్షలు రాయలేకపోయిన అభ్యర్థులు తీవ్ర మనోవేదన చెందారు. హైదరాబాద్‌లో టీకేఆర్ కళాశాల కేంద్రం వద్ద ఓ అభ్యర్థి సమయానికి రాకుండా ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. మౌలాలిలోని అయాన్ పరీక్షా కేంద్రంలో ఆలస్యంగా వచ్చిన సుధీర్ అనే అభ్యర్థిని నిర్వాహకులు పరీక్షా కేంద్రంలోకి అనుమతిం చలేదు. దీంతో ఆ అభ్యర్థి కాలేజీ గోడ దూకి పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నిం చారు. ఆ అభ్యర్థిని పట్టుకున్న సిబ్బంది బయటకు పంపించి వేశారు. దీంతో ఆ అభ్యర్థి కన్నీరుమున్నీరయ్యారు. ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల ఆలస్యమైందని, అనుమతించాలని సిబ్బందిని వేడుకున్నారు. నిబంధనల ప్రకారం కుదరదని సిబ్బంది చెప్పడంతో పరీక్ష రాయకుండానే ఆ అభ్యర్థి ఆవేదనతో వెనుదిరగాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని అల్వాల్‌లో అయాన్ డిజిటల్ జోన్, టాటా ఏజెన్సీ సర్వీసెస్ కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట దగ్గర్లోని పూలదేవి బండ తండాకు చెందిన ఓ గిరిజన వికలాంగ అభ్యర్థి జటావత్ శంకర్ పాత హాల్‌టికెట్‌తో రావడంతో సిబ్బంది పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇవ్వలేదు. ఎందుకని ప్రశ్నిస్తే కొత్త హాల్‌టికెట్ కాదని, పాత హాల్‌టికెట్ నెంబర్ ఇక్కడ లేదని చెప్పడంతో ఆ అభ్యర్థి ఆవేదనకు గురయ్యారు. తీరా వెబ్‌సైట్‌లో చూస్తే వేరే కేంద్రంలోకి కేటాయించినట్టుగా, హాల్‌టికెట్ నెంబర్ సైతం మారినట్టుగా ఉంది. అప్పటికే పరీక్ష ప్రారంభమయ్యే సమయం దగ్గరపడడంతో ఏమీ చేయలేక ఆవేదన చెందారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో నిశిత ఇంజినీరింగ్ కాలేజీలో ఉన్న కేంద్రంలో కొంత మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. కొత్త హాల్‌టికెట్ కాదని చెప్పడంతో అభ్యర్థులు కంగుతిన్నారు. దీంతో వారు పరీక్ష రాయకుండానే వెళ్లిపోవాల్సి వచ్చింది. తొలిరోజు శనివారం టీఆర్టీ ఆన్‌లైన్ రాతపరీక్ష భాషా పండితులు (ఎల్‌పీ) ప్రశాంతంగా జరిగిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. 52 పరీక్షా కేంద్రాల్లో సజావుగా జరిగిందని తెలిపింది. శనివారం ఉదయం పరీక్షకు 17,970 మంది దరఖాస్తు చేస్తే, 17,333 (92.8 శాతం) మంది హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం పరీక్ష స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) పరీక్షకు 16,827 మంది దరఖాస్తు చేస్తే, 15,473 (85.43 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

నేడు ఆఫ్‌లైన్‌లో ఎస్జీటీ

ఆదివారం టీఆర్టీలో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) రాతపరీక్ష ఆఫ్‌లైన్ (ఓఎంఆర్)లో జరుగుతుందని వాణీప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం ఎస్జీటీ (తెలుగు మీడియం), మధ్యాహ్నం ఎస్జీటీ (ఇంగ్లీష్ మీడియం)లో రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 57,464 మంది, మధ్యాహ్నం 29,334 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం పరీక్షకు 86 కేంద్రాలు, మధ్యాహ్నం పరీక్షకు 38 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులు, పరిశీలకులు, స్క్వాడ్‌లను నియమించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో కమాండ్ కేంద్రం ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు సూచనల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సతులు పరీక్షల్లో - పతులు పిల్లలతో

టీఆర్టీ రాతపరీక్షలు నిర్వహించిన పలు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మౌలిక వసతుల్లేక, టెంట్ లేక, తాగునీరు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. మరికొన్ని కేంద్రాల్లో చంటిపిల్లలతో పరీక్షలకు హాజరయ్యారు. సతులు (భార్య) పరీక్షలకు హాజరు కావడంతో, ఆ పిల్లలను ఎత్తుకునే పని పతుల వంతైంది. కూర్చోవడానికి సరైన వసతుల్లేక పోవడంతో చెట్లే వారికి ఆధారమయ్యాయి. చెట్ల కిందే భోజనాలు చేశారు.

ఫోన్‌కు సై.. బంధానికి నై!

కడవేర్లు

"18 ఏళ్ల ప్రియ(పేరు మార్చాం) సాయంత్రం నుండి ఏదో కోల్పోయినట్టు దిగాలుగా ఉంది. ఎంతగా అంటే.. చిన్నప్పుడు ఎంతో గారంగా పెంచిన నాయినమ్మ చనిపోయినప్పుడు కూడా లేనంత బాధగా! ప్రియ పరిస్థితిని గమనించిన పేరెంట్స్ విషయం ఏంటని ఆరాతీశారు. ప్రియ చెప్పిన సమాధానాన్ని విని విస్తుపోయారు"

ఇదేదో సినిమా/సీరియల్లోని సన్నివేశం కాదు. తాజాగా, హైదరాబాద్ లో జరిగిన సంఘటన ఇది. ఇంతకి, ప్రియ మూడీగా ఉండటానికి కారణం ఏంటో తెలుసా? "మొబైల్ ఫోన్ సైలెంట్ మోడ్ లో ఎక్కడో పెట్టి మరచిపోవడం!" వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. కనిపించే ఆత్మీయుల కన్నా.. ఫోన్ బంధాల పట్ల నేటి యువత ఎక్కువగా ఆకర్షితులు అవుతుండటం.. చిన్న చిన్న కారణాలకే డిప్రెషన్లోకి వెళ్తున్నారని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

ఆత్మీయులకంటే ఫోనే ముఖ్యం

కుటుంబ సభ్యుల ప్రేమానురాగాల కన్నా.. ఫోన్, ఇంటర్నెట్ స్నేహాలకే యువత ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నట్టు తాజాగా హార్వర్డ్ యూనివర్సిటీ సైకాలజీ ప్రతినిధులు మరియు మోటరోలా టెలీ కమ్యూనికేషన్ సంస్థలు చేసిన సంయుక్త అధ్యయనంలో తేలింది. ఇక, సర్వే ప్రకారం.. తమని అమితంగా ఇష్టపడే వారి కంటే మొబైల్ ఫోన్లకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తామని సర్వేలో పాల్గొన్న 47% యంగ్ ఇండియన్స్ అభిప్రాయపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్నేహితుల విషయానికి వస్తే, తమ జీవితంలో అత్యుత్తమ మిత్రుడు మరియు భాగస్వామి తమ ఫోనేనని 65% మంది భారత యువత అభిప్రాయపడ్డారు. ఎప్పుడైతే, తమ ఫోన్ కనిపించకుండా పోతుందో తమలో భయంతో కూడిన ఒకరకమైన ఆందోళన మొదలవుతుందని సర్వేలో పాల్గొన్న సుమారు 77శాతం యువత చెప్పడాన్ని చూశాక.. మన భారత యువతపై ఫోన్ ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, ఫోన్ అనేది తమకు ఒక వ్యసనంగా మారిందని, మొబైల్ యూసేజ్ ను తగ్గిస్తే మంచిదని తెలిసినా.. తాము ఆ పనిని చెయ్యలేకపోతున్నామని సర్వేలో పాల్గొన్న 53శాతం మంది పేర్కొనడం గమనార్హం.

పేరెంట్స్ మీరు కూడా మారాలి

పిల్లలు చాలా విషయాలను పెద్దలను చూసే పాలో అవుతారని తెలిసిందే! మారుతున్న జీవనశైలి, పోటీతత్వం, ఉద్యోగ జీవితం మొదలగు బాధ్యతలతో కొందరు పేరెంట్స్ కుటుంబ సభ్యులతో కలిసి ఉండే సమయాన్ని క్రమక్రమంగా కోల్పోతున్నట్టు ఇప్పటికే కొన్ని అధ్యయనాల్లో తేలింది.

రెస్టారెంట్లలో పిల్లలతో కలిసి భోజనం చేసేటపుడు పెద్దల వ్యవహారశైలి, పిల్లల ప్రవర్తనపై బోస్టన్ మెడికల్ సెంటర్ లో చేసిన ఓ పరిశోధనలో కొన్ని ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ఫ్యామిలీతో వారాంతాల్లో బయట గడిపే ప్రతి ముగ్గురు తల్లిదండ్రుల్లో ఒకరికి.. కుటుంబ సభ్యులతో గడిపే ఇలాంటి సమయాల్లో ఫోన్లో మాట్లాడే అలవాటు ఉన్నట్టు తేలింది. 73 శాతం మంది పేరెంట్స్ భోజన సమయంలో కనీసం ఒకసారైనా ఫోన్ వాడుతున్నారని.. దీనివల్ల ఫ్యామిలీతో గడిపే అతికొద్ది సమయాన్ని ఆయా తల్లిదండ్రులు కోల్పోతున్నారని, ఈ వ్యవహారం మూలంగా పిల్లలకు తల్లిదండ్రులకు మధ్యనున్న అనుబంధం క్రమంగా తగ్గుతున్నదని తేలింది. ఇటువంటి సందర్భాల్లో సైతం తల్లిదండ్రులు తమతో అప్యాయంగా గడపట్లేదని పిల్లల మనసుల్లో ముద్ర పడి ప్రతికూల ప్రభావం చూపుతూ వారు కూడా భవిష్యత్తులో అలాగే తయారయ్యి రానురాను కుటుంబ బంధాలకు దూరం అవుతారని పరిశోధకులు ఈ సందర్భంగా హెచ్చరించడం గమనార్హం. ఏదేమైనా, యువతరంలో, పేరెంట్స్ వ్యవహార శైలిలో వస్తున్న ఈ మార్పు కొంత ఆందోళనను కలిగిస్తోంది. అవసరాలకు ఉపయోగపడే సాధనంగా ఉపయోగపడాల్సిన ఫోన్.. బంధాలను బలి చేసే విధంగా మారకూడదని మానసిక నిపుణులు సలహానిస్తున్నారు.

ఇప్పటికైనా, పిల్లలు, తల్లిదండ్రుల ఫోన్ వాడకంలో మార్పు వస్తుందని ఆశిద్దాం.

ఫోన్ వాడకం- కొన్ని ఆసక్తికర అంశాలు

- ఫోన్ ను తరుచుగా వాడే 18 నుంచి 45 యేళ్ల వయస్సున్న 60 శాతం మంది మెడనొప్పితో బాధపడుతున్నట్టు ఓ సర్వే సారాంశం.
- ప్రపంచంలో ఉన్న మొత్తం జనాభాలో సుమారు 80శాతం మందికి మొబైల్ ఫోన్లు ఉన్నాయట! ఇందులో దాదాపు 40శాతం మొబైల్ బానిసలేనని తేలడం విచారకరం.
- నేటి యువత ఒక రోజులో సరాసరిగా 110- 250 సార్లు తమ మొబైల్ ను చెక్/ఓపెన్ చేస్తున్నారని తేలడం నిజంగా విస్మయాన్ని కలిగిస్తోంది.

ఫోన్ పై యువత అభిప్రాయాలు	ఇండియా	ప్రపంచ సగటు
ఆత్మీయుల కంటే ఫోనే ముఖ్యం	47%	33%
స్మార్ట్ ఫోనే మా బెస్ట్ ఫ్రెండ్	65%	53%
తరుచూ ఫోన్ చెక్ చేస్తాము	65%	50%
అతిగా వాడుతున్నామని తెలిసినా వదలలేకపోతున్నాము	48%	35%
ఫోన్ లేకపోతే, డిప్రెషన్ లోకి వెళ్తాం	77%	65%

ఆధారం: హార్వర్డ్ యూనివర్సిటీ సర్వే

కీలక రంగాలకు కత్తిరింపులు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. ఈ రంగంపై ఆధారపడి దాదాపు 70 లక్షల మంది రైతులు బతుకుతున్నారు. వీరితోపాటు లక్షలాది మంది వ్యవసాయ కార్మికులు, ఇతర అనుబంధ రంగాలకు చెందిన వారు జీవిస్తున్నారు. ఈ క్రమంలో కీలకమైన వ్యవసాయ రంగానికి ప్రభుత్వం 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.6,940 కోట్లను కేటాయించింది. ఇందులో ప్రణాళికా వ్యయాన్ని రూ.2 వేల కోట్లుగాను, ప్రణాళికేతర వ్యయాన్ని రూ.4,939 కోట్లుగానూ ప్రతిపాదించారు. అయితే 2017-18 ఆర్థిక సంవత్సరం నాటికి (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం.. మార్చితో ముగుస్తుంది) ఈ కేటాయింపులు రూ.5,851 కోట్లకు పడిపోయాయి. మరోవైపు పేదలకు బువ్వపెట్టే పౌర సరఫరాలశాఖకు 2015-16లో రూ.2,340 కోట్లను కేటాయించారు. అదే శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు 1,759 కోట్లకు పడిపోయాయి. మరోవైపు ప్రభుత్వం టీ హబ్‌లు, స్టార్టప్‌లు అంటూ ఐటీకి సంబంధించిన రకరకాల ప్రకటనలను గుప్పిస్తున్నది. కానీ ఆ రంగానికి అనుసంధానంగా ఉండే సాంకేతిక విద్యను మాత్రం విస్మరిస్తున్నది. ఆ శాఖకు 2015-16లో రూ.509 కోట్లను కేటాయిస్తే.. 2017-18లో మాత్రం కేవలం రూ.379 కోట్లను మాత్రమే విదిల్చారు. దీన్నిబట్టి ప్రజలకు అత్యంత అవసరమైన రంగాలకు సర్కారు నిధులు తగ్గిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు వైద్యారోగ్యశాఖకు నిధులు పెంచినట్టు కనబడుతున్నా అవి ఏ మూలకూ సరిపోవని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ రంగానికి 2015-16లో రూ.4,931 కోట్లను కేటాయించిన సర్కార్.. 2016-17లో రూ.5,966 కోట్లు, 2017-18లో రూ.5,976 కోట్లను కేటాయించింది. అంటే గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ రంగానికి కేవలం రూ.10 కోట్లను పెంచారన్నమాట. దీంతోపాటు బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం.. 2016-17లో విద్యుత్ రంగానికి పెట్టుబడి రూపంలో ఈక్విటీ కింద రూ.2,262 కోట్లను, 2017-18లో 2,498 కోట్లను కేటాయించారు. నష్ట నివారణ చర్యల నిమిత్తం డిస్కామ్‌లకు రూ.310 కోట్లను కేటాయించారు. ఈ విధంగా నష్ట నివారణ, పెట్టుబడుల కోసం తప్ప వాస్తవంగా విద్యుత్ రంగ కేటాయింపుల్లో పెద్దగా పెంపుదల లేదనే విషయం దీన్నిబట్టి విదితమవుతున్నది.

ఆర్థిక సంవత్సరాల వారీగా కేటాయింపులు తగ్గిన వివిధ రంగాలు.. (కేటాయింపులు రూ.కోట్లలో)

	2015-16	2016-17	2017-18
వ్యవసాయం	6,940	6,610	5,851
విద్యుత్	7,399	5,341	4,203
పౌర సరఫరాలు	2,340	2,312	1,759
సాంకేతిక విద్య	509	443	379
క్రీడలు, యువజన	126	118	104
కళలు, సంస్కృతి	217	114	93

సెన్సెక్స్ ▼ 25 33,819	నిఫ్టీ ▼14 10,382	డాలరుకు రూపాయి విలువ 65.06	బంగారం(10.గ్రా) రూ. 30,554	వెండి (కేజీ) రూ. 40,600

కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410

వొడా నుంచి మరో ఆకర్షక 'ప్లాన్'

- రూ. 799కే 126 జీబీ డేటా

న్యూఢిల్లీ: దేశంలో టెలికాం సంస్థల మధ్య పోటీ అంతకంతకు తీవ్రతరం అవుతోంది. టెలికాం సంచలనంగా దూసుకుపోతున్న రిలయన్స్ జియో సంస్థకు దీటుగా వొడాఫోన్ సరికొత్త ఆకర్షణీయమైన ప్లాన్‌ను ప్రకటించింది. దేశంలో రెండో అతిపెద్ద టెలికాం ప్రొవైడరైన వొడాఫోన్ కేవలం రూ.799 రూపాయలతో సరికొత్త ప్లాన్ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 4.5జీబీ డేటాను ఆఫర్ చేయనున్నట్టు వొడాఫోన్ తెలిపింది. ఈ ప్యాక్ డైరెక్ట్ జియో రూ.799 ప్లాన్‌కు పోటీగా నిలవనుంది. జియో తన రూ.799 ప్లాన్ కింద రోజుకు 5జీబీ డేటా ఆఫర్ చేస్తుండగా... దీని కంటే 0.5 జీబీ తక్కువగా ఈ ప్యాక్ అందుబాటులో ఉండనుంది. సరికొత్త ప్లాన్ వాలిడిటీ 28 రోజులు. దీంతో మొత్తంగా 28 రోజుల పాటు 126 జీబీ డేటా వినియోగదారులకు లభించనుంది. అదనంగా అపరిమిత లోకల్, ఎస్టీడీ కాల్స్, రోమింగ్స్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా లభించనున్నాయి. రూ.549తో కూడా వొడాఫోన్ మరో ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఈ ప్లాన్ కింద రోజుకు 3.5 జీబీ డేటాను వొడాఫోన్ ఆఫర్ చేయనుంది. దీనిపై కూడా ఇతర ప్రయోజనాలు అపరిమిత లోకల్, ఎస్టీడీ, రోమింగ్ వాయిస్ కాల్స్ ఉచితం. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా యూజర్లు పొందనున్నారు. మొత్తంగా యూజర్లకు 28 రోజులకు 98జీబీ డేటా అందుబాటులోకి రానుంది.

ఏపీని అగ్రస్థానంలో నిలుపుతాం: బాబు

- విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం



విశాఖపట్నం: పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ మేటి గమ్యస్థానంగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో బాబు కీలకోపన్యాసం చేస్తూ రాష్ట్రంలో మూడోసారి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో శాశ్వత కన్వెన్షన్ కేంద్రం, షాపింగ్ మాల్స్, హెూటళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. గతేడాది కంటే ఈసారి భాగస్వామ్య సదస్సుకు స్పందన బాగుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో భారీగా విదేశీ పెట్టుబడులను ఆశిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. 2022 నాటికి దేశంలో మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. 2029 నాటికి దేశంలో అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ సారి రాష్ట్రంలో 13.8 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు.

బ్యాంకుల్లో దొంగలు పడ్డారు!

- సీబీఐకి పెరుగుతోన్న ఫిర్యాదులు
- తాజాగా మరో మూడు కేసులు..
- ఓబీసీలో రూ.390 కోట్ల మోసం!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: అన్నం పెట్టే రైతన్నలు.. సామాన్యులు రుణం కోసం బ్యాంకుకు వెళితే కనీస స్పందన కూడా కనబరచని కొందరు బ్యాంకు అధికారులు.. సూటుబూటు వేసుకొని వచ్చే దొంగలకు మాత్రం కొట్లాది రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా అంటగట్టేస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల ఘరానా మోసం, రోటోమాక్ కొఠారి రూ.3,700 కోట్ల రుణ ఎగవేతతో మొదలైన బ్యాంకుల స్కామ్‌ల క్రమంగా రోజుకొకటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత కొంతకాలంగా తమ తప్పిదాలు బయట ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్త పడుతూ వచ్చిన సర్కారు బ్యాంకు అధికారులు.. పీఎన్‌బీ స్కామ్ వెలుగు చేసిన నేపథ్యంలో తమతమ శాఖల్లో జరిగిన ఎగవేతలతో సీబీఐని ఆశ్రయిస్తున్నారు. ఆయా బ్యాంకులు సీబీఐకి బడా ఎగవేతల గురించి సమాచారం ఇస్తున్న నేపథ్యంలో ఒక్కొక్క స్కామ్ వెలుగులోకి వస్తోంది.


ఓబీసీ బ్యాంక్‌కు రూ.390 కోట్ల టోపీ!

వజ్రాల వ్యాపారి నిరవ్ మోడి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసు ఒక కొలిక్కి రాకముందే మరో వజ్రాల నగల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) ను మోసగించిన ఉదంతం వెలుగు చూసింది. దీనికి సంబంధించి సీబీఐ శుక్రవారం కేసు నమోదు చేసింది. ఓబీసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రాల నగల ఎగుమతి కంపెనీపైనా, దాని డైరెక్టర్లపైన కేసు నమోదు చేసింది. కరోల్‌బాగ్‌కు చెందిన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల నగల ఎగుమతి కంపెనీ రూ.389.85 కోట్ల మోసానికి పాల్పడిందని ఆ బ్యాంకు ఫిర్యాదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ కంపెనీ వజ్రాలు, బంగారం, వెండి నగలను తయారు చేసే వ్యాపారం చేస్తోంది. ఈ మోసానికి సంబంధించి దాదాపు ఆరు నెలల క్రితమే సీబీఐకి ఓబీసీ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన ఆరు నెలల తరువాత సీబీఐ కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ కంపెనీ డైరెక్టర్లుగా ఉన్న సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణ కుమార్ సింగ్, రవిసింగ్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది. వీరికి చెందిన రెండో కంపెనీ ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్‌ను కూడా ఈ కేసులో చేర్చింది. ఈ మోసానికి సంబంధించి అంతర్గత విచారణలో నిందితులు విదేశాలు పారిపోయినట్టు తేలడంతో ఓబీసీ 2017లో సీబీఐని ఆశ్రయించింది. లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌పై ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ కంపెనీ రుణాలు తీసుకున్నదని ఓబీసీ తన ఫిర్యాదులో పేర్కొంది. 2007–2012 సంవత్సరాల మధ్య బంగారు నగల ఎగుమతి, దిగుమతి కోసం ఇతర మార్గాలలో కూడా రుణాలు తీసుకున్నట్టు ఓబీసీ తెలిపింది. కాని వాటిని తిరిగి చెల్లించడంలో విఫలమవ్వడంతో ఆ రుణాలను 2014లో నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు. సభ్య సేథ్ దర్జాగా బ్యాంకులకు టోపీ పెట్టి భారత్ వదిలి విదేశాలకు పారిపోయినట్టుగా విచారణ అధికారులు గుర్తించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో..

నకిలీ ఆస్తి పత్రాలను రుణానికి పూచీకత్తుగా ఉంచి దాదాపు రూ.10 కోట్ల రుణాన్ని పొంది ఎగవేసిన కేసు తాజాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో వెలుగులోకి వచ్చింది. అమిత్ సింఘాల్ ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా ఢిల్లీ, హర్యానాల్లోని పలు ఆస్తులను పూచికత్తుగా రికార్డుల్లో చూపి దాదాపు రూ.10 కోట్ల రుణాలను తీసుకొని ఎగవేతకు పాల్పడినట్టుగా బ్యాంక్ తాజాగా గుర్తించింది. ఈ మోసాన్ని ఆలస్యంగా గుర్తించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సీబీఐని ఆశ్రయించిది. విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న బ్యాంక్ అధికారులు.. సింఘాల్ ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు.

స్పందించకుంటే భారీ నష్టం..



పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ 'భారత రిజర్వు బ్యాంకు' (ఆర్‌బీఐ) గవర్నరు ఉర్జిత్ పటేల్ తన పదవికి రాజీనామా చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్ వెంకటాచలం డిమాండ్ చేశారు. రూ.11,400కోట్ల రుణాలను ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై ఎటు వంటి తక్షణ చర్యలకు దిగకపోవడం, నష్టనివారణ చర్యలను ప్రకటించకపోవడంలో ఆర్‌బీఐ గవర్నరు ఆంత ర్యమేంటని ఆయన ప్రశ్నించారు. బ్యాంకులపై పర్యవేక్షణ కొరవడిందనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని, ఆర్‌బీఐ నిర్లక్ష్యం, వైఫల్యం ఇందులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విమర్శించారు. 'ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయనే స్వతహాగా గవర్నర్ పదవి నుంచి తప్పుకోవాలి. ఆర్‌బీఐకి చెందిన నామి నీలు పీఎన్‌బీలో ఉన్నారు కాబట్టే ఈ విషయంపై అధికారులు.. మిన్న కుండిపోయారని ఆయన ఆరోపించారు. నీరవ్ మోదీ ఘటన తర్వాతైనా బ్యాంకుల అకౌంట్ వివరాలను ఆర్‌బీఐ పరిశీలించలేదని.. ఇప్పటికైనా స్పందించకపోతే భారీగా నష్టపోతారని ఆయన హెచ్చరించారు.

పీఎన్‌బీ 'బార్మర్'లో మరో మోసం..

రాజస్థాన్‌లోని బార్మర్‌లో మరో పీఎన్‌బీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. పీఎన్‌బీఐ బార్మర్ శాఖలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్న ఇందర్ చాంద్ చుందావత్ దాదాపు రూ.2.0 కోట్ల మేర మోసానికి పాల్పడినట్టుగా పీఎన్‌బీ స్థానిక శాఖ సీబీఐకి ఫిర్యాదు చేసింది. 2011లో ఈ మోసం చోటు చేసుకున్నట్టుగా బ్యాంక్ ఫిర్యాదులో పేర్కొంది. అంతర్గత విచారణలో భాగంగా సదరు అధికారిని తాము సస్పెండ్ చేసినట్టుగా బ్యాంక్ అధికారులు తెలిపారు.

రూ.6393 కోట్ల ఆస్తులు జప్తు: ఈడీ



ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను (పీఎన్‌బీ)ని రూ.11,400కోట్ల మేర మోసం చేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం నీరవ్ గ్రూప్‌కు చెందిన 21 విలువైన స్థిరాస్తులను జప్తు చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. జప్తు చేసిన ఆస్తుల్లో నీరవ్‌కు కంపెనీకి చెందిన పెంట్‌హౌస్, ఫామ్ హౌస్ ఉన్నాయి. మనీ లాండరింగ్ చట్టం కింద ఈ ఆస్తులను ఆటాచ్ చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఎటాచ్ చేసిన ఆస్తుల్లో ముంబయిలోని సముద్రమహల్ అపార్ట్‌మెంట్‌లోని రూ.15.45 కోట్ల విలువ చేసే ఫ్లాట్, రూ.81.16 కోట్ల విలువ చేసే పెంట్‌హౌస్‌ను సీజ్ చేశారు. 21 స్థిరాస్తుల విలువ మార్కెట్ ప్రకారం రూ.523కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. 6 రెసిడెన్షియల్ ప్రాపర్టీ, పది కార్యాలయాలు, పూణెలోని రెండు ఫ్లాట్లు, ఓ సోలార్ పవర్ ప్లాంట్, అలీబగ్‌లోని ఫామ్ హౌస్, అహ్మద్‌నగర్‌లోని 135ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు జప్తు చేసిన ఆస్తుల విలువ సుమారు రూ.6,393కోట్లు ఉంటుంది. పీఎన్‌బీ కేసులో విచారణకు హాజరు కావాల్సిందిగా ఇప్పటికే నీరవ్‌కు ఆయన సతీమణి అమీ, వ్యాపార భాగస్వామి గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ ఛోక్సీలకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఈనెల 26న వీళ్లు విచారణకు రావాల్సి ఉంది. ఇప్పటికే ఆయన పాస్‌పోర్టును స్తంభింపజేసినట్టుగా అధికారులు ఆయనకు ఈమెయిల్ సందేశం పంపినట్టుగా సమాచారం. కాగా ఈడీ దాడుల్లో నీరవ్‌కు చెందిన అత్యంత ఖరీదైన 10వేల రకాల విదేశీ చేతి గడియారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

కొలువులకు ఎలాంటి ముప్పు లేదు



వాషింగ్టన్: కృత్రిమ మేథ (ఏఐ) కారణంగా రానున్న రోజుల్లో ఉద్యోగాలకు ఎసరు రానుందన్న వార్తలను యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకులు స్టీఫెన్ వొజ్నిక్ ఖండించారు. ఏఐతో పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆయన జోస్యం చెప్పారు. కొత్త టెక్నాలజీతో ఉద్యోగాలకు ఎలాంటి ముప్పూ లేదని భరోసా ఇచ్చారు. కృత్రిమ మేథపై పనిచేసేందుకు మనకు మరింత మంది కొత్త ఉద్యోగులు అవసరమవుతారని అన్నారు. రాబోయే తరానికి ఎంచుకునేందుకు భిన్న ఉద్యోగాలు అందుబాటులో ఉండనున్నాయని ఆయన వివరించారు. తాను మెషీన్లను డిజైన్ చేసినప్పటికీ వాటిని మార్కెట్ చేసేందుకు స్టీవ్ జాబ్స్ లాంటి ఎంట్రెప్రెన్యూర్ అవసరమని స్వతహాగా ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్, ప్రోగ్రామర్ వొజ్నిక్ అన్నారు

వేతనాలు పెంచకుంటే... సమ్మె సైరన్ తప్పదు

- సర్కారుకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ హెచ్చరిక
- 28న డీఎంఏ, ప్రిన్సిపల్ సెక్రెటరీలకు సమ్మె నోటీసు ఇస్తామని వెల్లడి



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులందరికి 2014 జూన్2 నుంచి వేతనాలు పెంచుతామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు పెంచలేదని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ పేర్కొంది. 2015లో జీవో 14 ఇచ్చినప్పటికీ ఆ జీవోను అమలు చేయలేదని విమర్శించింది. మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని, లేకపోతే జేఏసీ సమ్మె సైరన్ మోగిస్తుందని హెచ్చ రించింది. శనివారం షోయాబుల్లా హాల్‌లో జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్, జె వెంకటేష్, ఖమర్ అలీ, జన్ను ప్రకాష్ (సీఐటీయూ), ఏసు రత్నం (ఏఐటీయూసీ), కె సూర్యం, మల్లేష్ (ఐఎఫ్‌టీయూ), నాయకులు మంగపతి, అంజయ్యలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల వేతనాలను సాధించడానికి జేఏసీ ఉద్యమ కార్యచర ణను వారు ప్రకటించారు.

మార్చి 1 నుంచి 5 వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించడం, మార్చి 6, 7 తేదీలల్లో ఇంటింటికి బిక్షాటన, మార్చి 12న కలెక్టరేట్ల ముట్టడి, ధర్నాలు నిర్వహించడం, మార్చి 14న రాజకీయపార్టీలు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలతో హైదరాబాద్‌లో రౌండ్‌టేబులు సమా వేశం, మార్చి 15,16,17 తేదీలల్లో మూడు రోజుల సమ్మె చేస్తామని, అప్పటికి ప్రభుత్వం స్పందిం చకపోతే ఆ తర్వాత నిరవధిక సమ్మెకు దిగు తామని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్ని కల్లో ఓట్ల కోసం కేవలం గ్రేటర్ కార్మికులకు 2015 జూలై నెలలో వేతనాన్ని రూ 8500 నుంచి రూ 12500 పెంచిందన్నారు.

గ్రేటర్ మున్సిపల్ కార్మికు లకు వేతనాలు పెంచిన సర్కారు జిల్లాల్లో పని చేస్తున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల కార్మికులకు వేతనాలు పెంచక పోవడం అన్యాయ మన్నారు. ఇది చట్ట విరుద్ధమని, వివక్ష కిందకే వస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒకే రకమైన పనులు చేస్తున్న వారి మధ్య వేతన వ్యత్యా సాలుండరాదని, కాంట్రాక్టు కార్మికుడికి సైతం పర్మినెంట్ ఉద్యోగితో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్దంగా ఒకే రకమైన పనులు చేసే కాంట్రాక్టు కార్మికులకు గ్రేటర్ హైదరా బాద్‌లో ఒక రకంగా, జిల్లాల్లో మరోరకంగా వేతనా లుండటం ఏమిటని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి మున్సిపల్ కార్మికులకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలి

- కనీస పెన్షన్ రూ. 12వేలు చెల్లించాలి
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ సదస్సులో వక్తలు



నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

సుప్రీం కోర్టు అక్టోబరు 2016లో ఇచ్చిన తీర్పు తక్షణమే అమలు చేయాలని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ రాష్ట్ర సదస్సు శనివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సదస్సుకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. సందర్భంగా సీఐటీయు ఆలిండియా ఉపాధ్యక్షులు ఆర్. సుధాభాస్కర్ మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన రూ. 6,500పై మొత్తాన్ని ఇపిఎఫ్‌లో జమచేయాలని కోరారు. ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.3వేలు చెల్లిస్తామని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించిందన్నారు. హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ డిమాండ్ నెరవేర్చేందుకు బీజేపీ ఎంపీలందరూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ)లో ఉన్న కార్మికుల ప్రతినిధులు అంటే ఇపీఎఫ్,ఇపీఎస్, ఇడీఎఐ నిధుల నిర్వహణలో వారిదే ప్రధాన పాత్ర కనుక ఈ డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని కోరారు. తెలంగాణలో ఇపిఎస్ పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఐఐఈఏ ఉపాధ్యక్షులు కె. వేణుగోపాల్ మాట్లాడుతూ ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్‌కు కార్మికుని జీతంపై12శాతం జమచేసిందన్నారు. సదరు కార్మికుడు రిటైర్డ్ అయినప్పుడు చివరి నెల జీతం ఎంతైతే ఉంటుందో ఆ మేరకే పెన్షన్ చెలించాలని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ప్రభుత్వం కూడా ఆమోదం చెప్పిందన్నారు. కానీ అది అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై ఇపిఎఫ్ఓ ఏకపక్షంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. టీఏపీఆర్‌పీఏ అధ్యక్షులు పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ. 12వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక భృతి నెలకు రూ. 3వేలుగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. సిబిటి సభ్యుల్లో 24 మంది కార్మికుల ప్రతినిధులుండాలన్నారు. వారిని ఇపిఎఫ్, ఇపిఎస్ పెన్షనర్స్ ఎన్నుకునే విధంగా ఉండాలన్నారు. టీఏపీఆర్‌పీఏ ఉపాధ్యక్షులు ఎఆర్‌కె చౌదరి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 7న, ఢిల్లీలో ఆలిండియా కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వరంలో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. బలమైన ఉద్యమ నిర్మాణం చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు. ఏఐటీయుసీ కార్యదర్శి యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక శాఖ అదనపు కార్యదర్శి హీరాలాల్ సమారియా అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో వేసిన ఉన్నత స్థాయి కమిటీ పని చేయడం లేదన్నారు. అధికారుల నాయకత్వంలో వేసిన కమిటీలతో న్యాయం జరగదని చెప్పారు. సాంఘిక, సామాజిక భద్రతల ప్రాతిపదికన రావాల్సిన కనీస పెన్షన్ డియర్‌నెస్ రిలీఫ్, పెన్షన్ సవరణకు గడువు వంటి అంశాలను ఈ కమిటీ సమూలంగా పరిశీలించాలని కోరారు. ఈ సదస్సులో టీఏపీఆర్‌పీఏ ప్రధాన కార్యదర్శి ఎంఎన్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

డిస్కాంలలకు ఆర్థిక ఇబ్బందులు లేవు

మునుగుతాయనడం అవాస్తవం

- పూర్తిగా ప్రభుత్వ సహకారం
- 10వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- 11,500 మెగావాట్లకు చేరినా ఇబ్బంది లేదు
- ఆర్‌ఈసీ వడ్డీరేట్లు తగ్గించింది
- 50 రోజులుగా 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా
- టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కాంలు) ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి స్పష్టం చేశారు. స్వయం సమృద్ధితో పాటు ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సహకారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల డిస్కాంలు ఆర్థికంగా మునిగిపోతాయనే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. వ్యవసాయం సహా రాష్ట్రంలోని అన్ని రంగాలకు 24గంటల విద్యుత్ సరఫరా చేపట్టి 50 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ ఎ గోపాలరావు, టీఎస్‌ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు శ్రీనివాస్ (ప్రాజెక్ట్స్), మీర్ కమాలుద్దీన్ అహ్మద్ (హెచ్‌ఆర్), శ్రీనివాసరెడ్డి (ఫైనాన్స్) కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు ఉంటాయని జరిగిన ప్రచారానికి పూర్తి భిన్నంగా కేవలం మూడున్నరేండ్లలో దేశంలోనే తొలిసారిగా అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. దీనికోసం డిస్కంలు, ట్రాన్స్‌కో రూ. 12,136 కోట్ల వ్యయంతో విద్యుత్ సరఫరా, పంపిణీకి అవసరమైన మౌలిక సౌకర్యాల్ని సమకూర్చుకున్నామని, దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో పూర్తి ఆర్థికతోడ్పాటును అందించారని వివరించారు. 3,200 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తితో మన రాష్ట్రమే నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో పీక్ అవర్ విద్యుత్ డిమాండ్ శనివారం ఉదయం గంటలు 7.44 నిముషాలకు 10,002 మెగావాట్లకు చేరిందని, ఇది ఓ గొప్ప రికార్డు అని తెలిపారు. ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ 10,700 మెగావాట్ల వరకు ఉంటుందని అంచనా వేశామని, అయితే 11,500 మెగావాట్ల వరకు డిమాండ్ పెరిగినా సరఫరా చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. ఇందుకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకున్నామన్నారు.

రాష్ట్రంలో కొత్తగా వస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, ప్రాజెక్టులు, రాబోయే నూతన పరిశ్రమలకు కూడా నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం డిస్కంలకు ఉన్నదని స్పష్టం చేశారు. ఆర్‌ఈసీ ద్వారా తీసుకున్న దాదాపు రూ.2,400 కోట్ల రుణానికి వడ్డీరేటును 12.5 శాతం నుంచి 9.65 శాతానికి తగ్గిస్తున్నట్టు ఆ సంస్థ స్వయంగా తమకు సమాచారం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర విద్యుత్‌రంగంలో ఇంతటి గణనీయమైన విజయాలు సాధించడానికి సంస్థల్లోని కాంట్రాక్ట్ కార్మికులు మొదలు సీఎండీల వరకు అందరూ కారణమేనని, వారందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు. డిస్కంలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుంటే...తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ)కి ఇచ్చిన 2018–19 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనల్లో (ఏఆర్ఆర్) రూ.9,600 కోట్ల ఆదాయ లోటును ఎందుకు చూపారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం చెప్పలేదు. అది ఈఆర్సీ పరిధిలోని అంశమని దాటవేశారు.



చదువుల్లోతమ కృషి, పట్టుదలతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ఉజ్వలమైన భవిష్యత్ కోసం ఎదురు చూసే నేటి యువత ముఖ్యంగా తెలుసుకోవలసింది 'ఆత్మవిశ్వాసాన్ని' పెంపొందించుకోవటం. విద్యార్థి దశ తర్వాత ఉద్యోగం లక్ష్యంగా సాగే ప్రయత్నాలలో మనలో మనతో ఉండి నడిపించేది మన 'ఆత్మవిశ్వాసం' .. ఆత్మవిశ్వాసం నింపుకోవటం అంటేనే మనపైన మనం భరోసా పెంచుకొని మనం అనుకున్న లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని సొంతం చేసుకోవటం. 'అందుకే చెట్టు కొమ్మ పై కూర్చున్న పక్షికి కింద పడతాననే భయం ఉండదు కారణం తనకు రెక్కలున్నాయనే భరోసా' ఇటువంటి భరోసానే ప్రతి విద్యార్థీ, యువత మానసికంగా పెంచుకోవటమనేది చాలా అవసరం. మరి ఇటువంటి మానసిక భరోసా ఎలా సాధించాలి? దానికి ఎటువంటి ప్రయత్నాలు అవసరమౌతాయి?

ఆత్మవిశ్వాసాన్ని పెంచుదాం!

మనం అంకిత భావంతో చేసే ప్రయత్నాలలో పెంపొందే ఆత్మవిశ్వాసాన్ని మరిన్ని భవిష్యత్ విజయాల కోసం ఎలా కొనసాగించాలి? అనేది అత్యవసరమైన విషయం. ఇక్కడ ముఖ్యంగా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సినది విషయ జ్ఞానం ఉన్నవారికి లేనివారికి మధ్య స్పష్టంగా తేడా కనిపిస్తుంది. ఎందుకంటే విషయ జ్ఞానం వున్న వారు వ్యక్తీకరించే భావాలు అవగాహనతో కూడి ఎటువంటి బెరుకు లేకుండా ఆత్మవిశ్వాసంతో కూడి ఉంటాయి. అందుకే K=CCC అంటే విషయం పట్ల మన అవగాహన (Knowl edge) "నేను చేయగలను, నేను సాధించగలను" అనే మనపై మనకు నమ్మకం(Confidence) ఉండాలి. దీని వల్ల మన భావ వ్యక్తీకరణలో (Communicat ion) స్పష్టత ఏర్పడుతుంది. అంతే కాదు కాకుండా అవసరానికి తగ్గట్టుగా ఇతరులను ఒప్పించే (Convincing) నైపుణ్యం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. మరి ఈ లక్షణాలన్నీ మనం సాధన ద్వారా పెంచుకుంటే ఎంతోమేలు జరుగుతుంది.

విజయాన్ని చూస్తే అపజయానికి భయమే మరి!

ఈ సందర్భంలో ప్రతి విద్యార్థీ, యువత గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఒకటుంది. మన దశా దిశ నిర్దేశించేది కేవలం మన డిగ్రీ పట్టాల మార్కులొకటే కాదు. దీనితో పాటుగా సామాజిక, సాంఘిక అంశాలపై అవగాహన, పట్టు పెంచుకోవాల్సి ఉంటుంది.

ఈనాడు ప్రధానంగా పెద్ద పెద్ద ఉద్యోగ సంస్థలు ఈ విషయాలకి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారంటే మన జీవిత ఎదుగుదలలో వీటి ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

వీటికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉద్యోగ సంస్థలు సామాజిక అంశాలపై మనం ఎంత అవగాహనని కలిగి ఉన్నమో అంచనా వేస్తాయి.

పుట్టుక తోనే ఏమనిషి ఆత్మవిశ్వాసాన్ని మెళ్ళో వేసుకొని పుట్టడు. మారుతున్న కాలానికి తగ్గట్టుగా మారే సామాజిక, సాంఘిక పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా తన పరిణితిని పెంచుకుంటూ జీవనం సాగిస్తాడు.

ఈ దశగా మన అడుగులు ఎలా ఉండాలి? మనం కనే కలలు ఎలా సాకారం కావాలి? అంటే పట్టుదలతో కూడిన కృషి మన జీవిత గమ్యాన్ని మార్చి వేస్తుంది. దానికై తక్షణం ఆచరణలోకి తేవాల్సిన విషయాలేమిటో చూద్దాం!

1 **పాఠ్యాంశాలకు పదును :-** ఏస్థాయిల్లో చదివిన వారైనా సరే ఆ చదువులకు సంబంధించిన పాఠ్యాంశాలలోని ముఖ్యమైన వాటికి సంబంధించిన విషయాలను పునరుశ్చరణ ద్వారా పదును పెట్టుకోవాలి. దీనివలన మనం ఎలాంటి రాత పరీక్షలైనా, మౌఖిక పరీక్షలైనా, పోటీ పరీక్షలనైనా ఎదుర్కోవటానికి మన మనసు సన్నద్ధమై ఉంటుంది.

2 **సామాజిక జ్ఞానం:-**మనం ఏం చదువుకున్న, ఎంత చదువుకున్నా సామాజిక జ్ఞానం లేని చదువులు మాత్రం నిస్సారమే! సామాజిక జ్ఞానం లేకుండా మనం చేసే ఏ ప్రయత్నమైనా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. వాస్తవంగా చెప్పాలంటే నేటి యువతలో ఎంత మందికి మన భారతదేశ మొట్టమొదటి పౌరుడెవరు? మన భారత రాష్ట్రపతి పేరు తెలుసో ఆలోంచించండి! అందుకే సమాజ జ్ఞానాన్ని పెంచుకునే దిశగా మారే ప్రయత్నాలు తక్షణం ప్రారంభం కావాలి. సామాజిక సృహ, సామాజిక జ్ఞానం మనలో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఈ విషయాన్ని తెలుసుకోవాలంటే ప్రతి రోజు కొంతసేపు దినపత్రిక చదవటానికి కేటాయించండి!

3 **మనలోని అనుకూల లక్షణాల సమీక్ష:** ప్రతి మనిషికి మనసులో అనుకూల దృక్పథాలు (Positive Trends) ఉండటం అనేది చాలా సహజం. అనుకూలంగా ఆలోచిస్తే పొందే ఫలితాలు కూడా అనుకూలంగానే సాగుతాయి. వాస్తవంగా ఆలోచిస్తే జీవితంలో సమాధానం దొరకని సమస్య ఉండదు. అందుకే మీరు అతిగా ఏ సమస్యకూ భయపడవలసిన పనిలేదు. సమస్యను ధీటుగా ఎదుర్కొనాలంటే దానికి కావలసిందల్లా సంయమనం (Patiency) విషయం పట్ల అవగాహనే (Knowledge) మన అడుగులను లక్ష్యం వైపు నడుపుతాయి.

4 **ఆచరణలోఒకచిన్నపని:-** కొందరు తమకు ఏమీ చేతకాదు, ఏమీ చేయలేనని ఆత్మాన్యూనతతో బాధ పడుతుంటారు. ఇటు వంటి వారు మొదటగా గుర్తుంచుకోవాలసింది ప్రపంచంలో పనికిరానిదంటూ ఏమీ ఉండదు. దేనికుండే ప్రయోజనం దానికి ఉంటుంది. అందుకే ఇటువంటి ఆలోచనలు ఉన్నవారు ఏదైనా చిన్న చిన్న పనులు ప్రారంభించి తమని తాము పరిశీలించి చూసుకొని నిరూపించుకునే ప్రయత్నం చేయాలి. ఒకటి రెండూ ప్రయత్నాలలో కచ్చితంగా మీరు విజయం సాధిస్తారు. అనవసరంగా ఆలోచిస్తూ కూర్చోవటం కన్నా ఏదైనా ప్రయత్నాన్ని చేయటం వల్ల పొందేఫలితాలు కచ్చితంగా సానుకూలంగా ఉంటాయి. ముందు ముందు చేయ బోయే పనులకు ఆలంబనగా ఉంటాయి. అందుకే ఆచరణలో అడుగు కదపటం ముఖ్యం అని మరువద్దు.



5 **మీకు మీరే కౌన్సిలింగ్:-** విజయానికి కారణాలు ఎన్ని వుంటాయో, అపజయానికి అన్ని కారణాలుంటాయి అందుకే చేసే ఏ పనిలోనైనా ఎప్పటికప్పుడు సమీక్ష అనేది చాలా అవసరం. దీని వలన పొందే ప్రతి అనుకూల ఫలితంలో(Positive Result) మన ఆత్మావిశ్వాసం రెట్టింపు అవుతుంది ఎప్పుడైనా పొందే ప్రతికూల ఫలితాలలో కూడా మనం పొందిన అనుకూల ఫలితాల తాలూకా స్ఫూర్తీ, ప్రతికూలతను(Negative) అవలీలగా ఎదుర్కొనే ధైర్యాన్ని మనలో నింపుతుంది.

6 **ఆదర్శ జీవితాల పఠనం :-** సామాజికంగా, సాంఘికంగా ప్రజల అభ్యున్నతి కోసం కృషి జరిపిన మహోన్నత వ్యక్తుల జీవితాలను చదివే ప్రయత్నం చేయాలి అంతేకాక ప్రతికూల పరిస్థితులలోనైనా ఎదురయ్యే కష్టనష్టాలలో కూడా ఆత్మ విశ్వాసాన్ని చెక్కుచెదరనీయకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించిన వ్యక్తుల జీవిత చరిత్రలు నిజంగానే మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఇటువంటి ఉదాహరణలు మన కళ్ళ ముందు ఎన్నోవున్నాయి. వాటి వైపు దృష్టి సారించండి కచ్చితంగా మీలో మార్పు కనిపిస్తుంది.

7 **పెద్దల మాట భరోసా:-** మనసులో కలిగే అనేకానేక భయాలకు అర్థముండదు. వాటిని మనలో ఉన్న అనుకూల ఆలోచనల ద్వారా కౌంటర్ చేయవచ్చు. కానీ మనసు కదా! ఒక్కో సారి మన చేతిలో ఉండదు. ఇటువంటి సమయంలో తెలిసిన పెద్దలు లేదా అనుభవజ్ఞుల సలహాల ద్వారా భరోసా పెంచుకోవచ్చు.

8 **సైకాలజిస్టులతో సంప్రదింపు :-** మన మేమిటి? మనలోని అనుకూల, ప్రతికూల అంశాలేమిటి? అనే విశ్లేషణలతో జరిపే సంభాషణల ద్వారా మనలో అంతర్లీనంగా వుండే మన అనుకూల లక్షణాలు మరియు వాటిని ఎటువంటి ప్రాధాన్యాలతో మన భవిష్యత్ మార్గాన్ని తీర్చి దిద్దుకోవచ్చనే అనుకూల ఆలోచనలతో మనసు తలుపులు తెరుచుకునే అవకాశాలుంటాయి.

9 **ఒత్తిడికి దూరంగా:-** ఏ పనిలోనైనా ఒత్తిడిని దరి చేరనీయవద్దు. ఒత్తిడి అనేది మన ఆత్మవిశ్వాసానికి ఒక శత్రువు లాంటిది ఏ పనైనా, యెంత పని అయినా సరే మన అవగాహనే (Knowledge) మన రక్షణ కవచం. దీని ద్వారా ఏర్పరుచుకున్న ప్రాధాన్యతల ద్వారా (Priorities) మనం అనుకున్న గమ్యాన్ని విజయవంతంగా చేరు కోవచ్చు. నేర్చు కోవటానికి, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి ఎటువంటి పరిమితులు లేవు. జీవితంలో మనల్ని మనం అభివృద్ధి చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో అడుగులు బలంగా విజయదిశగా పడాలంటే నేర్చుకోవటం అనేది తప్పని సరి ప్రక్రియ. అప్పుడు మీరేమంటారో తెలుసా! ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధిస్తామని!



అమరనాథ్ జగర్లపూడి,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
9849545257

ప్రజెంటేషన్ ఎఫెక్టివ్‌గా ఉండాలి

ఎఫెక్టివ్ ప్రజెంటేషన్ అనేది మీ ప్రతిభాప్రదర్శనలో కీలక అంశం. మీరు విద్యార్థియైనా, ఉద్యోగి అయినా, బిజినెస్ పర్సన్ అయినా ఒకానొక దశలో ప్రజెంటేషన్ ఇవాల్సి వస్తుంది. ఆ పరిస్థితుల్లో ఎంత సమర్థవంతంగా ఉంటే ఆ ఘట్టాన్ని అంత విజయ వంతంగా ఎదుర్కొగల్గుతాం. ఒక అంశానికి సంబం ధించి సేకరించిన అంశాలను దశల వారీగా పద్ధతి ప్రకారం వివరించడాన్ని ప్రజెంటేషన్ అంటాం. అది గ్రూప్‌తో మాట్లాడటం కావచ్చు, ఒక మీటింగ్‌లో మాట్లాడటం కావచ్చు, ఒక టీమ్‌ను మోటివేట్ చేయటం కావచ్చు. సందర్భం ఏదైనా మీరిచ్చే ప్రజెంటేషన్ ఎఫెక్టివ్‌గా ఉండాలి. అలాంటి ప్రజెంటేషన్ రావాలంటే ఎలాంటి ప్లాన్ ఉండాలో చూద్దాం..



మీరు ఇవ్వాలకున్న సందేశాలను క్లియర్‌గా ఉండాలి. మీరు తెలుసుకున్న తర్వాత మీరు దాని గురించి మాట్లాడితే ఎలా ఉంటుందో తెలుసుకోవటం అవసరం. మీరిచ్చే ప్రజెంటేషన్ పద్ధతి చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. సమావేశానికి హాజరైన ప్రేక్షకులు, అక్కడున్న సౌకర్యాలు, ఏర్పాటు చేసిన వేదిక చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావం మీ మీద ఉంటుంది. వాటి అన్నిటినీ గుర్తుంచుకుని ఆకర్ష ణీయంగా, ప్రేరణాత్మకంగా మాట్లాడటానికి మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి. హడావుడికి లోనవకుండా అవసరమైన స్పీచ్‌ను మాత్రమే సిద్ధం చేసి పెట్టు కోవాలి. అప్పుడే అప్పుడే ఎపెక్టివ్ స్పీచ్ ఇవ్వగల్గుతాం. ప్రజెంటేషన్ ఇవ్వాలంటే వాయిస్ బాగుండదు అనే ఆత్మాన్యుతాభావంలో ఉంటారు.అది సరికాదు. మాట్లాడాలనుకున్న విషయంపై పక్కా క్లారిటీ ఉన్నపుడు, ప్రేక్షకులకు తమ సందేశం సరిగ్గా రీచ్ అవుద్ది అనే నమ్మకం ఉన్నపుడు గొంతుతో పని లేదు. ఒకవేళ అదే ముఖ్యం అనుకుంటే ప్రజెంటేషన్‌కి కొన్ని రోజుల ముందు నుంచే ప్రాక్టీస్ చేస్తే ఆ ఫీలింగ్‌ను అధిగమించవచ్చు. అద్దం ముందు నిల్చుని మాట్లాడటం. వాయిస్ రికార్డింగ్ చేసుకుని వినడం వంటి పనులు చేస్తే కొంత ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దీంతో పాటు ప్రజెంటేషన్‌లో అవసరమైన మెటిరియల్‌ను మాత్రమే ఉంచుకోండి. స్పష్టమైన ఆలోచనలు, ప్రధాన అంశాలు, ఉత్తమ నిర్వహణ ప్రభావవంతంగా సజీవమైన తార్కిక సందేశాన్ని ఇవ్వటానికి తోడ్పడతాయి. ఎలాంటి నోట్స్ నోట్స్ లేకుండా కొంతమంది ప్రజెంటేషన్ ఇవ్వగలరు. అలా మీరు చేయాలనుకుంటే మీకు అనుభవం అవసరం. మీ సామర్థ్యాన్ని బట్టి ఎంత ఉత్తమమైన ప్రజెంటేషన్ ఇవ్వగలరో తెలుసుకోండి. అవసరమైన చోట విజువల్స్‌ను వాడండి. అంశానికి సంబంధించిన వీడియోలను చూపడటం ద్వారా ప్రేక్షకులు మరింత ప్రభావితం అవుతారు.మీ ప్రజెంటేషన్ మీద కూడా ఎక్కువ అసక్తి చూపుతారు.

ప్రశాంతంగా ఉండండి :

ప్రజెంటేషన్ ఇవ్వడానికి ముందు ఒకవేళ మీరు హడావుడికి లోనవుతున్నట్టునిపిస్తే ఎవరితో మాట్లాడకండి. కాస్త ప్రశాంతం గా ఉండటానికి ప్రయత్నించండి. ఆలోచనలు పక్కదారి పట్టకుండా ఉండటానికి మీరు చెప్పే విషయంపై మీ దృష్టి కేంద్రికరించండి. వీళైతే నీళ్లు ఎక్కువ తాగండి. నీరు ఎక్కువ తీసుకోవటం వల్ల ఒత్తిడి, టెన్షన్ దూరమవతాయి.

ప్రజెంటేషన్‌ని బట్టి ముగింపు ఉండాలి. కొన్ని ప్రేరణాత్మకమైన సందర్భాల్లో ప్రేక్షకులకు ప్రశ్నగా ముగింపు ఉండాలి. కొన్ని సందర్భాల్లో మీ సొంత కామెంట్స్‌తో ముగింపు ఇవ్వచ్చు. లేదా గొప్ప వ్యక్తుల స్టేట్‌మెంట్లను గుర్తు చేస్తూ ముగించొచ్చు.. ఆల్ ద బెస్ట్

అచ్చ తెలుగు పిల్ల

మజాక్

పెండ్లి వయసు వచ్చిన అమ్మాయిని తండ్రి అడిగాడు నీకు ఎటువంటి అబ్బాయిని చూడమంటావుఅని. నాకు 'అ నుంచి అం' వరకు అర్హత వున్న అబ్బాయి కావాలి అని చెప్పింది. అ-అం వరకు అర్థం ఏంటి అని తండ్రి అడుగగా ఈ కింది విధంగా చెప్పింది.

అ: అమ్మా-నాన్నలతో ప్రేమగా ఉండాలి
ఆ: ఆస్తి-పాస్తులు ఎలా ఉన్నా పర్వాలేదు.
ఇ: ఇల్లు సొంతమై ఉండాలి
ఈ: ఈతరం యువకుడిగా ఉండాలి.
ఉ: ఉన్నత స్థాయి స్నేహితులు ఉండాలి.
ఊ: ఊర్లో మంచి పేరుండాలి
ఎ: ఎర్రగా-బుర్రగా ఉండాలి.
ఏ: ఏకైక సంతానమై ఉండాలి.
ఐ: ఐనవాళ్లతో బాధ్యతగా ఉండాలి
ఒ: ఒడ్డూ-పొడుగూ బాగుండాలి.
ఓ: ఓర్పుతో ఉండాలి
ఔ: ఔషధాల జోలికిపోని ఆరోగ్యవంతుడవ్వాలి.
అం: అంతులేని ప్రేమను పంచాలి





అక్కడా తప్పదా...!

మొదటిసారి ఫ్లైట్ ఎక్కిన మహిళ ఎయిర్ హోస్టేస్‌తో
మహిళ: ఫ్లైట్ ఉన్నట్టుండి కూలిపోతే
నా ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు?
ఎయిర్ హోస్టెస్: కంగారుపడకండి
మీకేమైనా అయితే వెంటనే
ప్యారాచూట్ ఇస్తాం లెండి
మహిళ: ప్రాణాలు పోయేటైంలో
కొబ్బరి నూనె ఇస్తే
ఎక్కడ రాసుకోవాలి???



'సెల్ఫీ' తీసుకోవటంలో మీరు ఏ కేటగిరి ?

'సెల్ఫీ' ఈ మధ్య కాలంలో యూత్‌లో వైరల్ అయిన ట్రెండ్. సమయమేదైనా సెల్ఫీలకు ఫోజులివ్వటంలో ఇప్పడు యూత్ బిజీ అయిపోంది. పండగైనా, పార్టీ అయినా, షాపింగ్ కెళ్లినా, సినిమాకెళ్లినా చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు సెల్ఫీలు తీసుకోవడమే తరువాయి. మరి మితిమీరిన సెల్ఫీమోజు మంచిదేనా..? ఇది ఓ మానసిన సమస్యకు దారి తీస్తుందా ? అవుననే చెపుతున్నాయి కొన్ని తాజా సర్వేలు. యూకేకు చెందిన నాటింగ్‌హామ్ యూనివర్సిటీ, తమిళనాడులోని తియంగరాజర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వారు సెల్ఫీ సర్వే నిర్వహించారు. రోజూ సెల్ఫీలు తీసుకునే వారి మానసిక పరిస్థితిని మిగతా రోజులతో పోల్చితే , సెల్ఫీ తీసుకోని రోజు వారు ఇబ్బంది పడినట్టు గుర్తించారు. ప్రత్యేక సందర్భాల్లో మినహా నిరంతరం సెల్ఫీలు తీసుకోవటం మానసిక రుగ్మతలకు సంకేతం అని సైకాలజిస్టులు చెబుతున్నారు. మార్క్ గ్రిఫిట్స్, జనార్ధన్ బాలకిషన్ అనే మానిసిన వైద్య నిపుణులు 225 కాలేజీల విద్యార్థులతో ఇటీవల సెల్ఫీ సర్వే నిర్వహించారు. వీరిలో సెల్ఫీలకు వ్యసనంగా మారిన వారిని గుర్తించి bor-derline, acute, and chronic మూడు కేటగిరీలుగా విభజించారు. సెల్ఫీలు తీసుకొని ఎలాంటి సోషల్ మీడియాలో పోస్టు చేయని వారు మొదటి రకం. రోజుకు కనీసం రెండు లేదా మూడు సెల్ఫీలు తీసుకుని పోస్టు చేసే వారు రెండో రకం. ఇంక మూడో రకంలో సెల్ఫీలంటే వ్యసనంగా మారిన వారుంటారు. నిరంతరం సెల్ఫీలు తీసుకుని పోస్టు చేస్తుంటారు. ముఖ్యంగా ఇలాంటి ప్రవర్తన గలవారు తమ సెల్ఫీలను సోషల్‌మీడియాలో విపరీతంగా పోస్టు చేస్తున్నారట. అంతేకాదు వారు అప్‌డేట్ చేసే పోస్టులను వదిలేసి, ఇతరులు షేర్ చేసే పోస్టులకు కామెంట్స్ పెట్టడంపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. అంటే తమదైన శైలిలో ఘాటుగా స్పందిస్తున్నారని వారు తెలిపారు.

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. సెల్: 07660066469

e-mail : navatelangana.josh@gmail.com

ప్రేమ పరిమళాలు

వహ్వా..వహ్వా

నా మనసు దారి తప్పింది
నీ చూపుల ధ్యాసలో పడి..

నా గుండె గదిలో దాచుకుంటున్నా
నువ్వు పంపే జ్ఞాపకాలన్నీ...

కలవరమే మదిలో
కలలో నువ్వు కనిపించిన ప్రతిసారీ..

వినట్లేదే నా మది
నీ కోసమే సతమతమవుతున్నది.

-వినో





అతను-ఆమె

కళ్లు తెరిచిన వెంటనే
కృతజ్ఞతగా
ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు
అతడు
కళ్లు తెరవకుండానే
అతని చేష్టలను మరోసారి
చిరునవ్వుతో
అనుభవించింది
ఆమె

- బూర్ల వెంకటేశ్వర్లు

ఎదురుచూస్తున్నాయ్ ప్రియా..

నా కండ్లు నీ రూపాన్ని చూడాలని
నా గుండె నీ ప్రేమను నింపుకోవాలని
నా చేతులు నీ చెయ్యి పట్టుకోవాలని
నా పాదాలు నీతో కలిసి నడవాలని
ఎదురుచూస్తున్నాయ్ ప్రియా..
నా మనసు నీతో మాట్లాడాలని
నా శ్వాస నీలో కలిసిపోవాలని.. నీ దాకా రావాలని
నిన్ను చేరుకోవాలని... నీతో కలిసి జీవితాన్ని
పంచు కోవాలని ...

రామదాసు, ఖమ్మం,
9553497526





టీ20 సిరీస్ ట్రోఫీతో టీమ్ ఇండియా అమ్మాయిలు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ షీల్డ్‌తో మిథాలీరాజ్.

చరిత్ర సృష్టించారు

మన అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. సఫారీ గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పారు. కేప్‌టౌన్‌లో జరిగిన ఐదో టీ20లో 54 పరుగులతో గెలుపొందిన టీమ్ ఇండియా.. 3-1తో పొట్టి సిరీస్ సొంతం చేసుకున్నది. మిథాలీ రాజ్ అర్ధ శతక మెరుపులతో సఫారీ బౌలర్లపై విజృంభించింది. సుదీర్ఘ విరామానంతరం అంతర్జాతీయ సర్క్యూట్‌లో అడుగుపెట్టిన భారత అమ్మాయిలు.. దక్షిణాఫ్రికాను రెండు ఫార్మాట్లలోనూ చిత్తు చేశారు. రెండు కప్పులతో సగర్వంగా స్వదేశానికి రానున్నారు.

- ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు నెగ్గిన అమ్మాయిలు
- 3-1తో పొట్టి సిరీస్ టీమ్ ఇండియా సొంతం
- 54 పరుగుల తేడాతో ఐదో టీ20లో ఘన విజయం

నవతెలంగాణ-కేప్‌టౌన్

దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్ ఇండియా అమ్మాయిలు అరుదైన ఘనత దక్కించుకున్నారు. ఆతిథ్య జట్టును చిత్తు చిత్తుగా ఓడించిన వరుసగా రెండో సిరీస్ సాధించారు. మిథాలీ రాజ్ (62, 50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో చెలరేగిన వేళ.. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 166 పరుగులు చేసింది. యువ క్రికెటర్ జెమీమా రొడ్రిగస్ (44, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ నమోదు చేసింది. బౌలర్లు రుమేలీ దార్ (3/26), శిఖా పాండే (3/16), రాజేశ్వరి గైక్వాడ్ (3/26)లు నిప్పులు చెరగటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 112 పరుగులకే కుప్పకూలింది. అర్ధ శతకంతో మెరిసిన మిథాలీరాజ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గానూ నిలిచింది.

బౌలర్లు భళా : లక్ష్యం భారీగా ఉన్నా.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై విజయంతో సిరీస్ సమం చేయాలని దక్షిణాఫ్రికా ఆశించింది. కానీ సహకారం లభించని పిచ్ నుంచి సైతం మనోళ్లు వికెట్లు కూల్చారు. సఫారీని ఛేదనలో ఏ దశలోనూ ముందడుగు వేయనీయలేదు. ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాట్స్‌వుమెన్, కెప్టెన్ వాన్ నికెర్క్ (10)ను ఆరంభంలోనే వెనక్కి పంపిన రుమేలీ దార్ (జులన్ గోస్వామి గాయంతో సిరీస్‌కు దూరం కాగా, ఆమె స్థానంలో కొత్తగా జట్టులోకి వచ్చిన బౌలర్) ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. మరో ఓపెనర్ లిజెలి లీ (3)ని సైతం రుమేలీ ఎంతో సేపు క్రీజులో కొనసాగనీయలేదు. మూడోస్థానంలో వచ్చిన సునె లిస్ (5)ను శిఖా పాండే బలిగొన్నది. దీంతో 20/3తో దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ దశలో డు ప్రీజ్ (17), చొలె ట్రయాన్ (25)లు నాల్గో వికెట్‌కు 20 పరుగులు జోడించారు. ప్రీజ్ మూడు బౌండరీలతో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసింది. శిఖా పాండే బౌలింగ్‌లో కవర్స్‌లో భారీ షాట్‌కు పోయిన ప్రీజ్ అక్కడ మిథాలీకి చిక్కింది. డి క్లెర్క్ (4)ను వచ్చీ రాగానే శిఖానే అవుట్ చేసింది. కానీ ట్రయాన్‌తో కలిసి కాప్ (27) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని నిలువరించింది. ఈ సమయంలో రాజేశ్వరి గైక్వాడ్, పూనమ్ యాదవ్‌లు వికెట్ల వేటలో నిమగ్నమయ్యారు. దీంతో ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు పోవటం సఫారీల వంతైంది. మరో 12 బంతులుండగానే దక్షిణాఫ్రికాను కుప్పకూల్చిన అమ్మాయిలు 54 పరుగుల తేడాతో భారీ విజయం దక్కించుకున్నారు. యువ క్రికెటర్ జెమీమా రొడ్రిగస్ కండ్లుచెదిరే క్యాచ్‌తో విశేషంగా ఆకట్టుకున్నది. మరిజానె కాప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ సంధించబోగా.. బౌండరీ లైన్ వద్ద అద్భుత నియంత్రణతో రొడ్రిగస్ క్యాచ్ ఒడిసిపట్టేసింది. జెమీమా ఫీల్డింగ్ నైపుణ్యంతో క్రికెట్ పండితుల మార్కులు కొట్టేసింది.



మిథాలీరాజ్ 62

మిథాలీ మెరిసెన్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు ఓపెనర్లు శుభారంభం అందించారు. సీనియర్ బ్యాట్స్‌వుమెన్ మిథాలీరాజ్ (62, 50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మృతి మంధాన (13)లు తొలి వికెట్‌కు 32 పరుగులు జోడించారు. మూడు ఫోర్లతో జోరందుకున్నట్టే కనిపించిన స్మృతి మంధాన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో వికెట్ కోల్పోయింది. కాప్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిష్క్రమించింది. మూడో స్థానంలో వచ్చిన జెమీమా రోడ్రిగస్ (44, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మిథాలీతో కలిసి చెలరేగింది. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో మిథాలీ రాజ్ మరో అర్ధ సెంచరీ నమోదు చేయగా.. మరో ఎండ్‌లో జెమీమా సైతం దుమ్మురేపింది. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో చెలరేగింది. వీరిద్దరి జోరుతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. రెండో వికెట్‌కు ఈ జోడీ 98 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసింది. ఆఖర్లో మిథాలీ, జెమీమాలు ఇద్దరూ స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. అయినా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 నాటౌట్ , 17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధనాధన్ ముగింపునిచ్చింది. వేద కృష్ణమూర్తి (8) సైతం రాణించింది.



ప్రపంచకప్ కాంస్య పతకంతో అరుణ రెడ్డి

అరుణ కాంస్య కాంతులు

- హైదరాబాద్ జిమ్నాస్ట్‌కు పతకం
- జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్

న్యూఢిల్లీ : హైదరాబాద్ అమ్మాయి జిమ్నాస్ట్ బుద్ద అరుణ రెడ్డి జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్యం సాధించి చరిత్ర సృష్టించింది. మెల్‌బోర్న్‌లో జరుగుతోన్న ప్రపంచ కప్ పోటీల్లో మహిళల వాల్ట్స్ విభాగంలో కాంస్యం నెగ్గిన అరుణ.. వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయ మహిళా జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పింది. పోటీల్లో రెండు రౌండ్లలో 13.649 సగటుతో అరుణ మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో మరో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ 13.416 సగటుతో ఆరో స్థానంలో నిలిచింది. ఫైనల్లో తొలి రౌండ్‌లో క్లిష్టమైన 4.600 లెవల్‌ను ఎంచుకున్న అరుణ, ఎగ్జిక్యూషన్‌లో 9.066 పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో మరింత క్లిష్టమైన 4.800 లెవల్లో పోటీపడిన అరుణ.. ఈ సారి ఎగ్జిక్యూషన్‌లో 8.333 పాయింట్లే పొందింది. తొలి రౌండ్లో 13.666, రెండో రౌండ్లో 13.633 ఫైనల్ పాయింట్లు సాధించిన అరుణ.. సగటున 13.649 పాయింట్లతో నిలిచింది. 13.800 పాయింట్లతో జాసా, 13.699తో ఎమిలీలు వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఇది మూడో జిమ్నాస్ట్ మెడల్. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో అశీష్ కుమార్ కాంస్యం సాధించగా, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో దీప కర్మాకర్ సైతం కాంస్యమే గెల్చుకున్నది. తాజాగా తెలుగమ్మాయి అరుణ రెడ్డి ఏకంగా ప్రపంచకప్‌లోనే కాంస్యం కొట్టేసి కొత్త చరిత్రకు నాంది పలికింది.

కరాటే శిక్షకురాలిగా పనిచేసి.. :

2005లో జాతీయ స్థాయిలో మెడల్ అందుకున్న అరుణ అదే స్ఫూర్తితో జిమ్నాస్టిక్స్ సాధన చేసింది. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో అర్హత పోటీల్లో 14వ స్థానంలో నిలిచిన ఆమె ఆ తర్వాత ఆసియా గేమ్స్‌లో తొమ్మిదో స్థానానికే పరిమితమైంది. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ఆరో స్థానంలో నిలిచింది. తాజా పోటీల్లో భాగంగా నేడు జరగనున్న ఫ్లోర్ ఈవెంట్ ఆఖరు రౌండ్‌లోనూ పాల్గొననున్నది. గతంలో కరాటే శిక్షకురాలిగా కూడా పనిచేసిన అరుణ బ్లాక్ మెడల్ సైతం సాధించింది.

'వియన్నా' టైటిల్ కశ్యప్‌దే

వియన్నా : హైదరాబాద్ స్టార్ షట్లర్ ఆస్ట్రియా ఓపెన్ టైటిల్ గెల్చుకున్నాడు. సీజన్‌లో తొలి టైటిల్ గెలుపొందిన కశ్యప్ శనివారం అర్ధ రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచులో జూన్‌వెయ్ చీమ్ (మలేసియా)ను 23-21, 21-14తో ఓడించాడు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో చీమ్.. రెండో సీడ్ కశ్యప్‌కు గట్టిపోటీనిచ్చినా.. రెండో సెట్‌లో తేలిపోయాడు. ఇక భారత యువ షట్లర్ సమీర్ వర్మ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్స్ చేరుకున్నాడు. సెమీస్ సమరంలో 21-14, 11-21, 21-12తో కాంటఫోన్ వాంగ్‌చరోన్ (థాయిలాండ్)పై గెలుపొందాడు.

ఆఖరి పంచ్ అదుర్స్

దక్షిణాఫ్రికాతో మూడో టీ20లో ఏడు పరుగుల తేడాతో భారత్ గెలుపు



- మెరిసిన రైనా, ధావన్
- సమిష్టిగా రాణించిన బౌలర్లు
- 2-1తో టీ20 సిరీస్ సొంతం

నవతెలంగాణ-కేప్‌టౌన్

సఫారీ గడ్డపై భారత్ మరో రికార్డు నెలకొల్పింది. అంచనాలకు మించిన ప్రదర్శనతో ఆతిథ్య జట్టుకు ఫైనల్ పంచ్ ఇచ్చింది. ఇదివరకే 5-1తో వన్డే సిరీస్ నెగ్గిన టీమ్ ఇండియా 2-1తో పొట్టి సిరీస్‌ను సొంతం చేసుకున్నది. సిరీస్ నిర్ణాయక పోరులో శిఖర్ ధావన్ (47), సురేశ్ రైనా (43) రాణించారు. దీంతో నిర్ణీత ఓవర్లలో భారత్ 7 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసి కాపాడుకోగల లక్ష్యాన్నే సఫారీల ముందుంచింది. ఛేదనలో భారత బౌలర్లు సమిష్టి ప్రదర్శన చేశారు. ఆఖరి రెండు ఓవర్లలో మ్యాచ్ ఉత్కంఠ రేకెత్తించినా, డెత్ ఓవర్ స్పెషలిస్టులు భువీ, బుమ్రాలు భారత్‌కు ఏడు పరుగుల తేడాతో విజయాన్ని లాంఛనం చేశారు. విరాట్ కోహ్లికి గాయం కావటంతో భారత సారథిగా రోహిత్ శర్మ బాధ్యతలు తీసుకున్నాడు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగిన రైనాకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' లభించగా.. సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి ఏడు వికెట్లు కూల్చిన పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.

రైనా ధనాధన్ : టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ. వచ్చీ రాగానే దూకుడు ప్రదర్శించిన ఓపెనర్ రోహిత్ శర్మ (11) రెండో ఓవర్లోనే ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అయితే మరో ఓపెనర్ శిఖర్ ధావన్ (47, 40 బంతుల్లో 3 ఫోర్లు) నిలకడగా ఆడాడు. వన్‌డౌన్‌లో బరిలో దిగిన సురేశ్ రైనా (43, 27 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్) రెచ్చిపోయాడు. ధనాధన్ ఆటతో చెలరేగిన రైనా, ధావన్‌తో కలిసి భారత స్కోరు బోర్డును నడిపించాడు. షంషీ బౌలింగ్‌లో బౌండరీ బాదే క్రమంలో రైనా బెహార్డిన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో టీ20లో అర్ధ శతకంతో ఆకట్టుకున్న మనీశ్ పాండే (13) కేప్‌టౌన్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. క్రీజులో నిలదొక్కుకునే క్రమంలో జూనియర్ డాలా బౌలింగ్‌లో మిల్లర్‌కు చిక్కాడు. ఆట నిదానంగా ఆరంభించినా వేగం పెంచిన శిఖర్ ధావన్ అర్ధ శతకానికి మూడు పరుగుల దూరంలో రనౌట్‌గా పెవిలియన్ చేరాడు. 15 ఓవర్లు ముగిసే సరికి నాల్గు వికెట్లు నష్టపోయిన భారత్ 126 పరుగులు చేసింది. ఆ తరువాత భారత్ వరుసగా వికెట్లు పోగొట్టుకున్నది. హార్దిక్ పాండ్య (21) ఫర్వాలేదనిపించినా.. ఆశించిన మేర ఆడలేదు. మాజీ కెప్టెన్ ఎమ్ఎస్ ధోని (12), దినేశ్ కార్తిక్ (13)లు వేగంగా పరుగులు చేయాలని ప్రయత్నించి వికెట్ సమర్పించుకున్నారు. సఫారీ బౌలర్లలో డాలా మూడు, మోరిస్ రెండు, షంషి ఓ వికెట్ తీసుకున్నారు.

బౌలర్లు సమిష్టిగా : సఫారీల ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా బౌలర్లు సమిష్టిగా రాణించారు. 173 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీలను విజయవంతంగా కట్టడి చేశారు. తొలి పది ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే పడగొట్టినా 52 పరుగులు మాత్రమే ఇచ్చారు. తదుపరి ఓవర్లలో దక్షిణాఫ్రికా వికెట్లు నష్టపోయినా స్కోరు బోర్డు ఊంపదుకున్నది. అక్సర్ పటేల్ వేసిన ఓవర్‌లో ఏకంగా 16 పరుగులు పిండుకున్నారు. ఓ దశలో జేపీ డుమిని (55) ప్రమాదకరంగా మారినా శార్దూల్ బౌలింగ్‌లో తాత్కాలిక కెప్టెన్ రోహిత్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్ బాట పట్టారు. పీకల్లోతు కష్టాల్లో పడిన ఆ జట్టును క్రిస్టియాన్ జోంకర్ (49) ఆదుకున్నాడు. అతని దూకుడు చూస్తుంటే రెండో టీ20 మాదిరిగానే కేప్‌టౌన్ మ్యాచ్ కూడా సఫారీల పరం అవుతుందనిపించినా.. డెత్ ఓవర్లలో భువీ, బుమ్రాలు పకడ్బందీగా బంతులేయటంతో ఘనవిజయం భారత్ సొంతమైంది. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు కూల్చగా.. బుమ్రా, శార్దూల్, పాండ్య, రైనా తలో వికెట్ తీశారు.

కోహ్లికి గాయం

వెన్ను నొప్పితో ఇబ్బంది పడుతోన్న విరాట్ కోహ్లి సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌కు దూరమయ్యాడు. టాస్ సమయంలో వైస్ కెప్టెన్ రోహిత్ ఈవిషయాన్ని వెల్లడించాడు. వెన్ను నొప్పితో సుదీర్ఘ సఫారీ పర్యటనలో ఆఖరు మ్యాచ్‌కు కోహ్లి డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యాడు.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ ఎల్‌బిడబ్ల్యూ (బి) జూనియర్ డాలా 11, శిఖర్ ధావన్ (రనౌట్) జూనియర్ డాలా 47, సురేశ్ రైనా (సి) బెహార్డిన్ (బి) షంషి 43, మనీశ్ పాండే (సి) మిల్లర్ (బి) జూనియార్ డాలా, హార్దిక్ పాండ్య (సి) క్లాసెన్ (బి) క్రిస్ మోరిస్ 21, ఎమ్ఎస్ ధోని (సి) మిల్లర్ (బి) జూనియర్ డాలా 12, దినేశ్ కార్తిక్ ఎల్‌బిడబ్ల్యూ (బి)క్రిస్ మోరిస్ 13, అక్సర్ పటేల్ 1 నాటౌట్, భువనేశ్వర్ 3 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 172.

బౌలింగ్ : క్రిస్ మోరిస్ 4-0-43-2, జూనియర్ డాలా 4-0-35-3, జేపీ డుమిని 3-0-22-0, ఆండిలె ఫెలుక్వాయో 3-0-26-0, తబ్రేజ్ షంషి 4-0-31-1, ఆరోన్ ఫాంగిసో 2-0-13-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : రీజ హెండ్రిక్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 7, డెవిడ్ మిల్లర్ (సి) అక్సర్ (బి) రైనా 24, జేపీ డుమిని (సి) రోహిత్ (బి) శార్దూల్ 55, హెన్రిచ్ క్లాసెన్ (సి) భువనేశ్వర్ (బి) హార్దిక్ పాండ్య 7, క్రిస్టియాన్ జోంకర్ (సి) రోహిత్ (బి) భువనేశ్వర్ 49, క్రిస్ మోరిస్ (బి) బుమ్రా 4, ఫర్హాన్ బెహార్డిన్ నాటౌట్ 49, ఎక్స్‌ట్రాలు 4, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 165.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-24-2, జస్‌ప్రీత్ బుమ్రా 4-0-39-1, శార్దూల్ ఠాకూర్ 4-0-35-1, హార్దిక్ పాండ్య 4-0-22-1, సురేశ్ రైనా 3-0-27-1, అక్సర్ పటేల్ 1-0-16-0.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.